thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal
సంపుటి - 20 సంచిక - 5 కరీంనగర్ ఆదివారం, 16 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్.. కోళ్లఫారాల్లో పెరుగుతున్న గుడ్ల నిల్వలు

చెన్నై: నామక్కల్ కోళ్ల ఫారాల్లో 2 కోట్ల గుడ్లు నిల్వ ఉండడంతో యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నామక్కల్ మండల పరిధిలో నామక్కల్, ఈరోడ్, తిరుప్పూర్, పల్లడం తదితర ప్రాంతాల్లో 6 కోట్లకు పైగా కోళ్లను పెంచుతున్నారు. ఆ కోళ్లు ప్రతిరోజు 5 కోట్ల గుడ్లు పెడుతుంటాయి. ఈ గుడ్లను రాష్ట్ర ప్రభుత్వ పౌష్టికాహార పథకంలో వినియోగిస్తుండగా, పొరుగు రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ విస్తరణ, ఎండల కారణంగా ప్రజలు కోడిగుడ్ల వినియోగం తగ్గించారు. దీంతో, కోళ్ల ఫాంలలో గుడ్లు నిల్వలు పెరుగుతున్నాయి. డిమాండ్ తగ్గడంతో ఐదు రోజుల్లో గుడ్డుపై సుమారు 1.10 పైసలు తగ్గించి ప్రస్తుతం ఫాం ధర 3.80 పైసలుగా ఉంది. ప్రస్తుతం పాంలలో 2 కోట్ల గుడ్లు నిల్వ ఉన్నాయని, మరో రెండు రోజుల్లో ఇవి పాడయ్యే అవకాశముందని, అలాగే, నిల్వలు కూడా పెరిగే అవకాశముందని ఫాం యజమానులు వాపోతున్నారు.




## సోషల్ మీడియా 'వికృత' పోస్టులపై
# సీఎం రేవంత్ ఫైర్!

హైదరాబాద్ : అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శనివారం ఉభయ సభల్లోనూ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మాణంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. రెండు గంటల 25 నిమిషాల పాటు మాట్లాడారు. సీఎం రేవంత్ ప్రసంగంలో భాగంగా సోషల్ మీడియాలో పోస్టులపై కన్నెర్రజేశారు. హద్దు దాటితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. "సోషల్ మీడియాలో భాష చూడండి.. కుటుంబ సభ్యులు, ఆడబిడ్డల మీద ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెడుతున్నారు.. ప్రజా జీవితంలో ఉన్నాం కదా అని ఓపిక పడుతున్నా.. కాదు అంటే.. ఒక్కడు బయట తిరగలేడు.. మీ అమ్మపై, చెల్లిపై ఇలాంటి పోస్టులు పెడితే ఊరుకుంటారా?.. హద్దు దాటితే ఇకపై ఊరుకునేది లేదు.. ఆడపిల్లల వీడియోలు తీసి పోస్ట్ చేస్తే ఎలా? జర్నలిస్టు అంటే వివరణ ఇవ్వండి.. ముసుగేసుకుని వస్తే గుడ్డలు ఊడదీసి కొడతా. తొడ్కలు తీస్త. అని సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఈ సంస్కృతి విష సంస్కృతి. నన్ను తిట్టిన తిట్లకి.. మీ పేరు పెట్టుకుని చూడండి.

నేను ఓపికతో ఉన్న. కాదు అంటే.. ఒక్కొక్కడు బయట తిరగడు. కేసీఆర్ మీ పిల్లలకు చెప్పు. హద్దు దాటితే .. ఊరుకోను ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోను. కోర్టుకు పోతే బెయిల్ వస్తది అనుకుంటున్నారు. అవసరం ఐతే చట్టాన్ని సవరిస్తాం. ఆడ పిల్లలు వీడియోలు తీసి పోస్ట్ చేస్తే ఏం బాగుంటుంది. ఇవి వింత పోకడలు. కేసీఆర్.. మీ పిల్లలకు బుద్ధి చెప్పండి. ఇకపై ఇలా పోస్టులు చేస్తే ఉప్పు పాతర వేస్తా. సమస్యలు.. తప్పులు చెప్పండి. సరిదిద్దికుంటం. మీడియా సంఘాలు చెప్పండి. కుర్చీలో ఉన్న అని.. ఊరుకుంటారు అనుకుంటున్నారు. చట్ట పరిధిలోనే అన్ని చర్యలు ఉంటాయి. సోషల్ మీడియాపై చర్చ పెట్టండి. విశ్రుకలత్వం ఆపండి.

పరిష్కారం చూపకపోతే సమాజం దెబ్బ తీస్తారు. చట్ట సభలో చట్టం చేద్దాం. నా ఒక్కరి ఆవేదన కాదు.. అందరి ఆవేదన. అందరూ సహకరించాలి. స్వీయ నియంత్రణతో పాటు రాజ్యాంగ నియంత్రణ ఉండాలి." అని సీఎం రేవంత్ ప్రసంగించారు.

# హై..హై.. హైదరాబాద్..

## 10,472 చ.కి.మీ విస్తరించిన మహానగరం



హైదరాబాద్ మెట్రోపాలిటీ డెవలప్ మెంట్ ఆథారిటీ(హెచ్ఎండీఏ) పరిధిని విస్తరించారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ 7,257 చదరపు కి.మీ.లో విస్తరించి ఉంది. దీన్ని 10,472.72చదరపు కిలో మీటర్లకు పెంచింది. కొత్త జిల్లాల ఏర్పాటుకు ముందు హెచ్ఎండీఏలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల్లోని పలు మండలాలు ఉండేవి.

కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత హైదరాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి, వికారాబాద్, మేడ్చల్, రంగారెడ్డితో కలిపి 8 జిల్లాలు, 74 మండలాలు, 1,000 గ్రామ పంచాయతీలు, 8 కార్పొరేషన్లు, 38కి పైగా మున్సిపాలిటీలకు విస్తరించింది. పెరుగుతున్న జనాభా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని హెచ్ఎండీఏని విస్తరించింది. 11 జిల్లాలు, 104 మండలాలు, 1,355 గ్రామాలను కలిపారు. ఇబ్రహీంపట్నం, కందుకూరు, మంచాల, యాచారం మండలాల్లోని 36 రెవెన్యూ గ్రామాలనూ హెచ్ఎండీఏలో విలీనం చేశారు. సిద్దిపేట, సంగారెడ్డి, యాదాద్రి-భువనగిరి, నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్, రంగారెడ్డి, వికారాబాద్, మెదక్ జిల్లాలను కలుపుతూ రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణం నేపథ్యంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్(హెచ్ఎంఆర్) పరిధిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**జీవో 111 ప్రాంతాలు :** తెలంగాణ ప్రభుత్వం జీవో 111 పరిధిలోని కొన్ని గ్రామాలను కొత్తగా ఏర్పాటు చేసిన హైదరాబాద్ మహానగరం పరిధిలోకి తీసుకొచ్చింది. ఉదాహరణకు మొయినాబాద్ పరిధిలోకి వచ్చే బాకారం, కేతిరెడ్డిపల్లి, అజీజ్‌నగర్, చిలుకూరు, కనకమామిడి.. శంషాబాద్ కిందికొచ్చే చౌదరిగూడ, గంధిగూడ.. ఇలా అనేక ప్రాంతాల్ని కొత్త పరిధిలోకి తెచ్చింది. మరి 111 జీవో పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో కొత్తగా ఇల్లు కట్టుకోవడానికి అనుమతినిస్తారా? లేక ఇప్పటి వరకూ ఉన్న నిషేధాన్ని కొనసాగిస్తారా? అనేది తేలాల్సి ఉంది.

**ఫ్యూచర్ సిటీకి పునాది...** సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ఫ్యూచర్ సిటీకి పునాది రాయి పడింది. సీఎం మానస పుత్రికగా పిలుస్తోన్న ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ(ఎఫ్ సీడీఏ) ఏర్పాటైంది. ఇది రంగారెడ్డి జిల్లాలోని 765.28 చ.కి.మీ. పరిధిలో విస్తరించి ఉంది. దీంట్లో ఆమన్ గల్, ఇబ్రహీంపట్నం, కందుకూరు, కడ్తాల్, మహేశ్వరం, మంచాల, యాచారం మండలాల్లోని 56 రెవెన్యూ గ్రామాలను విలీనం చేశారు. హెచ్ఎండీఏ కలిపిన 36 రెవెన్యూ గ్రామాలను వదిలిపెట్టి మిగిలిన గ్రామాలన్నీ ఈ అథారిటీ కిందికి వస్తాయి.

ఈ అథారిటీకి చైర్మన్ గా ముఖ్యమంత్రి వ్యవహరించనున్నారు. వైస్ చైర్మన్ గా పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ / ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి వ్యవహరించనున్నారు. సభ్యులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి, అటవీ, పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి, హెచ్ఎండీఏ కమిషనర్, టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, డీటీసీపీ డైరెక్టర్, ఎఫ్సీడీఏ కమిషనర్/సీఈవో ఉంటారు.

**మా గ్రామాన్ని కలపండి...** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీలో తమ గ్రామాలను కూడా కలపాలని ప్రజలు స్వచ్ఛందంగా డిమాండ్ చేస్తున్నారు. కొత్త సిటీలో చేరితే అభివృద్ధి పరిఢవిల్లుతుందని ఆశిస్తున్నారు. ఇప్పటికే ఉన్న 56 గ్రామాలకు తోడు మరికొన్నింటికి విలీనం చేయాలని ప్రజాప్రతినిధులను కలుస్తున్నారు.

తాజాగా యాచారం మండలం మొండిగౌరెల్లి, మంథని గౌరెల్లికి చెందిన పలువురు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ రెండు గ్రామాలను ఫ్యూచర్ సిటీ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో కలిపి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మరికొన్ని గ్రామాల ప్రజలు కూడా ఫ్యూచర్ సిటీ మీద చాలా నమ్మకాన్ని పెట్టుకున్నారు. మౌలిక సదుపాయాలు కల్పన, పరిశ్రమల స్థాపన వంటి అనేకాంశాలకు ప్రాధాన్యత లభిస్తుందని, భూములకు విలువ పెరుగుతుందని విశ్వసిస్తుండడం గమనార్హం.





### పాత కేసులు గుర్తొచ్చి జగదీశ్ ఏడ్చిండు మంత్రి కోమటిరెడ్డి చిట్‌చాట్

హైదరాబాద్: పాత కేసులు గుర్తొచ్చి జగదీశ్ రెడ్డి ఏడ్చిన్నట్లు ఉన్నాడని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. చిట్‌చాట్ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'హరీశ్ రావు ఎమ్మెల్యే మాత్రమే. డిప్యూటీ లీడర్ కాదు కదా? ఆయన అడిగితే ఎలా మైక్ ఇస్తారు? ప్రతిపక్ష నేత సభలో లేడు. బీఆర్ఎస్ఎల్పీ సెక్రటరీ లేరు. మూడు కేసుల్లో జగదీశ్వర్ రెడ్డిముద్దాయిగా ఉన్నాడు. అవి ఎక్కడ ఓపెన్ చేస్తారో అని ఏడ్చిన్నట్లు ఉన్నాడు' అని ఎద్దేవా చేశారు.



## మా జోలికొస్తే వదలం...

బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ దేశం వదిలిపోయేలా చేస్తామని హెచ్చరించారు. లేదా తాను బీజేపీలో జాయిన్ అవుతానని అసదుద్దీన్ ఒవైసీ తమ నేతల కాళ్లు పట్టుకుంటారని ఎద్దేవా చేశారు. రంజాన్ సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీ లేనిపోని కామెంట్స్ చేస్తున్నారని రాజాసింగ్ మండిపడ్డారు. యూపీ తరహాలో తెలంగాణలో కూడా జమ్మికి నమాజ్ చేస్తే బాగుంటుంది అన్న యోగి ఆదిత్యనాథ్ మాటలకు అసదుద్దీన్ ఓవైసీకి రాజాసింగ్ కౌంటర్ ఇచ్చారు. నిన్న హోలీ ప్రశాంతంగా జరగకూడదని అసద్దుద్దీన్ ఒవైసీ కుట్ర చేశారని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో వయొలెన్స్ సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని అసదుద్దీన్ ఒవైసీ కుట్ర చేస్తున్నారని రాజాసింగ్ ఆరోపణలు చేశారు. 'అసదుద్దీన్ ఒవైసీ మెంటల్ అయిపోయిండు.. రేవంత్ రెడ్డి గారు మీ కొత్త దోస్తులకు మెంటల్ హాస్పిటల్లో ట్రీట్మెంట్ చేపియండి' అని రాజాసింగ్ సెటైర్లు గుప్పించారు.




హైదరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన కేవలం 3 నెలల్లోనే రూ.2 లక్షల రుణమాఫీ చేసి చూపించామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దీనిపై కావాలనే ప్రతిపక్ష బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఫైర్అయ్యారు. తాము అమలు చేస్తున్న ప్రతి పథకానికి సంబంధించి లెక్కలతో సహా చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. ఇవాళ (మార్చి 15) అసెంబ్లీ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా భట్టి మట్లాడుతూ ప్రతీ గ్రామాల్లో జాబితా పెడతాం. గృహ జ్యోతి 115 నియోజక వర్గాల సమాచారం మా దగ్గర ఉంది. మేము చేసేది ప్రజల కోసమే. మీలాంటి రాజకీయ పార్టీలకు కాదు. ముఖ్యంగా గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేటలకు బీఆర్ఎస్ కంటే ఎక్కువ మేలు చేశాం. గృహజ్యోతి పథకం కింద రూ.కోట్లు చెల్లిస్తున్నం' అని తెలిపారు.

**పల్లా వాస్తవాలు చెప్పు** : బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. విద్యాశాఖపై సమీక్షించడానికి ముఖ్యమంత్రికి సమయంలేదని అనడం సరికాదన్నారు. వందేళ్ల చరిత్ర ఉన్న ఓయూకి తొలిసారి దళిత వీసీని నియమించినట్లు వివరించారు. 'పల్లా విద్యాసంస్థలు నడుపుతారు. లెఫ్ట్ నుంచి వచ్చారు. వాస్తవాలు చెప్తారని అనుకున్నం. కానీ ఇంత బ్లైండ్ గా మాట్లాడతారేంటి? అని మండిపడ్డారు.




హైదరాబాద్: 'రెండోసారి కూడా నేనే సీఎం అవుతా' అని రేవంత్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసి ప్రజల వద్దకు వెళతానని ఆయన శాసనమండలిలో మీడియాతో ముచ్చటించిన సందర్భంలో అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని రేవంత్ చెప్పారు. తొలిసారి బీఆర్ఎస్‌పై వ్యతిరేకతతో ఓటేశారని, రెండోసారి తమపై నమ్మకంతో ఓటేస్తారని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తాను పనిని నమ్ముకుని ముందుకు వెళుతున్నానని, సంక్షేమ పథకాల లబ్ధిదారులే తమ ఓటర్లని సీఎం రేవంత్ అన్నారు. ఇప్పుడు ప్రజలు తనను నమ్మి మళ్లీ గెలిపిస్తారని రేవంత్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. స్టేచర్ కాదు స్టేట్ ఫ్యూచర్ తనకు ముఖ్యమని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో కోటి మంది మహిళలకు కచ్చితంగా లబ్ది చేకూరుస్తానని సీఎం హామీ ఇచ్చారు. మహిళలు ఇప్పుడు మాట్లాడకపోయినా ఓటు తమకే వేస్తారని సీఎం నమ్మకంగా చెప్పారు. గతంలో తాను చెప్పిందే జరిగిందని, భవిష్యత్‌లో కూడా తాను చెప్పిందే జరుగుతుందని రేవంత్ చెప్పారు. జనాభా లెక్కలపై కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ అంచనాలు అడిగిందని, 2027లో జనాభా లెక్కలు నోటిఫై చేస్తారని అంటున్నారని సీఎం రేవంత్ తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలు నష్టపోకుండా ప్రయత్నిస్తున్నామని చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తొలిసారి బీఆర్ఎస్‌పై వ్యతిరేకతతో ప్రజలు తమకు ఓటేసినా, రెండోసారి తమపై ప్రేమతో ఓటు వేస్తారని సీఎం రేవంత్ చెప్పడం గమనార్హం.




హైదరాబాద్: రాజ్యాంగ స్ఫూర్తితోనే వ్యవస్థలు ఏర్పడ్డాయని.. వాటిని గౌరవించాల్సిన బాధ్యత మన అందరిదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా సీఎం శాసన సభలో మాట్లాడారు. "గవర్నర్ ప్రసంగం లేకుండానే 2022 బడ్జెట్ సమావేశాలు ప్రారంభించారు. 2023లోనూ గవర్నర్ ప్రసంగం లేకుండానే బడ్జెట్ సమావేశాలు ప్రారంభించాలనుకున్నారు. కోర్టు కఠినంగా వ్యవహరించడంతో గవర్నర్ ప్రసంగానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. రాజ్యాంగ స్ఫూర్తితోనే వ్యవస్థలు ఏర్పడ్డాయి. వాటిని మనం గౌరవించాలి. ప్రభుత్వాలు వ్యక్తుల ఆస్తులు కాదు. బలహీన వర్గాలకు చెందిన మహిళా గవర్నర్‌ను గత ప్రభుత్వం అవహేళన చేసింది. మంత్రివర్గం ఆమోదించిన అంశాలనే ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. మాది కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇది ప్రజా పాలన. మా విధానం. మా ఆలోచనలు.. మేం ప్రజలకు చేసిన పనులు మాత్రమే గవర్నర్ ప్రసంగంలో పొందుపరుస్తాం. అవగాహన లేని వాళ్లు మంత్రులుగా చేశామని చెప్పుకోవడానికి అర్హత ఉందా? అని నేను అడుగుతున్నాను. పదేళ్ల భారాస పాలనలో నాటి మంత్రివర్గం ఆమోదం లేకుండానే గవర్నర్ ప్రసంగం ఉందా? వాళ్లకు గవర్నర్ వ్యవస్థపై నమ్మకం లేదు. మహిళా గవర్నర్‌ను అవమానించారు.. ఆ తప్పు మేం చేయం. గవర్నర్ వ్యవస్థను గౌరవించే బాధ్యత మాది. గవర్నర్ ప్రసంగంలో సూచనలు చేస్తే ప్రభుత్వం స్వీకరిస్తుంది" అని రేవంత్ అన్నారు.

**కేసీఆర్ వందేళ్లు ఆయురారోగ్యాలతో ప్రతిపక్షంలోనే ఉండాలి..** "రైతుల సమస్యల శాశ్వత పరిష్కారానికి రైతు కమిషన్ వేశాం. చివరి ఆయకట్టు వరకు నీళ్లు ఇచ్చేందుకు గల్లీ నుంచి ఢిల్లీ వరకూ కొట్లాడుతున్నాం. ఆనాడు అధికార పార్టీగా భారాసకు స్టేచర్ ఉండేది. 2023లో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ప్రజలు స్టేచర్ ఇచ్చారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో గుండుసున్నా ఇచ్చి మార్చురీకి పంపించారు. భారాస నేడు మార్చురిలో ఉందని నేను చెప్పాను. అందులో తప్పేముంది. పెద్దాయన కేసీఆర్‌ను నేను అన్నట్లుగా కేటీఆర్, హరీశ్‌రావు చిత్రీకరించారు. అంత కుంచిత స్వభావం నాకు లేదు. కేసీఆర్ వద్ద ఉన్న కుర్చీని 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలు గుంజుకుని నన్ను కూర్చోబెట్టారు. చంద్రశేఖర్ రావు వద్ద తీసుకోవడానికి ఇంకేముంది. వారి వద్ద ఉన్నది ప్రధాన ప్రతిపక్ష హెూదా.. ఆ హెూదా కేటీఆర్ లేదా హరీశ్‌రావుకు కావాలి. తప్పుడు మాటలు నాకు ఆపాదిస్తున్నారు. కేసీఆర్ వందేళ్లు ఆయురారోగ్యాలతో ప్రతిపక్షంలోనే ఉండాలి.. నేను ఇక్కడే ఉండాలి. కేసీఆర్ సూచనలు చేస్తూనే ఉండాలి.. నేను మంచి పరిపాలన అందిస్తూనే ఉండాలి" అని సీఎం అన్నారు. పదేళ్ల భారాస పాలనలో రైతులకు జరిగిన సంక్షేమం, అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం ప్రకటించారు.




హైదరాబాద్: భారాస అధినేత, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం లేదని అధికార పార్టీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శాసన సభ్యులు కూడా ప్రభుత్వ ఉద్యోగులేనని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. "కేసీఆర్ శాసనసభకు వచ్చింది రెండు సార్లు మాత్రమే. శాసనసభ్యుడిగా, ప్రతిపక్ష నాయకుడిగా ఆయన తీసుకున్న జీత భత్యాలు రూ.57,84,124. డిసెంబరు 2023 నుంచి 28 ఫిబ్రవరి 2025 వరకు.. దాదాపు 15 నెలలుగా జీత భత్యాల రూపంలో ఆయన తీసుకున్న ప్రభుత్వ సొమ్ము ఇది. శాసనసభ్యులు కూడా ప్రభుత్వ ఉద్యోగులేనని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది. ఆయన మాత్రం రెండు సార్లే అసెంబ్లీకి వచ్చారు. నియోజకవర్గ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ఎక్కడా పర్యటనలకు కూడా వెళ్లలేదు. ప్రజా సమస్యలపై చట్ట సభల్లో ప్రస్తావించిన సందర్భాలు లేవు.

కొవిడ్ సమయంలో వర్క్ ఫ్రమ్ హెూం ఫెసిలిటీ ఉండేది. ఇప్పుడు అది కూడా లేదు. రాజకీయాల్లో వర్క్ ఫ్రమ్ హెూం.. వర్క్ ఫ్రమ్ ఫామ్ హౌస్ వంటిది ఏమైనా ఉందా? వారి బాధ్యతలు నెరవేర్చడం లేదు" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## ప్రధాని మోదీని కలవడంలో రాజకీయం ఏముంది?: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్: ఢిల్లీ పర్యటన పేరుతో ఎలాంటి దుబారా చేయడం లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రాల సీఎంలకు పెద్దన్న లాంటివారని.. ఆయన్ను తాను కలవడంలో రాజకీయం ఏముందని ప్రశ్నించారు. ప్రధాని, కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు రాష్ట్రాల అభివృద్ధికి దోహదపడతాయని.. అందువల్ల కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించాలన్నారు. కేవలం రాష్ట్ర ప్రయోజనాల కోసమే ప్రధాని మోదీని కలిశానని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. "ప్రధానిని గౌరవించే విజ్ఞత మాది. రాజకీయాలకు వచ్చినప్పుడు నేను కాంగ్రెస్ నేతను.. ఆయన భాజపా నాయకుడు. అవసరమైతే మహేశ్వర్‌రెడ్డిని ఢిల్లీ తీసుకెళ్తాం. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని నాలుగు సార్లు కలిశాం. నిర్మలాసీతారామన్, అమిత్ షాలను కూడా కలిశాం" అని సీఎం వివరించారు.

**హైదరాబాద్‌ను సర్వనాశనం చేశారు..** కమీషన్లు తీసుకొని హైదరాబాద్ నగరాన్ని సర్వనాశనం చేశారని సీఎం విమర్శించారు. చెరువులు, కుంటలు మాయం చేశారన్నారు. అపార్ట్‌మెంట్‌లకు తగినట్లు డ్రైనేజీ వ్యవస్థ లేకుండా పోయిందన్నారు. చెరువులు, కుంటలను పునరుద్ధరించాలని ప్రయత్నిస్తుంటే అనవసరంగా గగ్గోలు పెడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. లెక్క లేకుండా అనుమతులిచ్చి నగరంలో గందరగోళం సృష్టించారని గత భారాస ప్రభుత్వ పనితీరుపై మండిపడ్డారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశాం. ప్రపంచ దేశాలతో పోటీపడేలా నగరాన్ని నిర్మించాలని చూస్తే అడ్డం పడుతున్నారు. పరిశ్రమలు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామంటే అడ్డుపడుతున్నారు. మాజీ సీఎం కేసీఆర్ సలహాలు, సూచనలిస్తే పాటించేందుకు సిద్ధంగా ఉన్నాం. అనుభవం ఉన్న వ్యక్తిగా ఆయన చెప్పినవి పాటిస్తాం.

**అప్పులు పెట్టింది కాకుండా తిరిగి మాపైనే విమర్శలా..** అప్పులు పెండింగ్‌లో పెట్టి పారిపోతే మేము కట్టుకుంటున్నాం. కేసీఆర్ పాలనలో తప్పులు.. అప్పులే చేశారు. ఈ 15 నెలల కాలమంతా కేసీఆర్ చేసిన అప్పులు, తప్పులు సరిచేయడానికే సరిపోయింది. వాళ్లు పెట్టిన అప్పులకు వడ్డీలు కట్టడమే భారంగా ఉంది. అప్పులు పెట్టింది కాకుండా తిరిగి మాపైనే విమర్శలు చేస్తున్నారు. డిస్కంలు, సింగరేణి, కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ పెట్టి వెళ్లిపోయారు. రూ.8 లక్షల కోట్ల అప్పులు మాపై వేశారు. రూ.1.52 లక్షల కోట్లు అప్పు చేశామని మాపై బురద జల్లుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ అప్పు రూ.7,38,707 కోట్లు. అబద్ధాల పునాదుల మీద ప్రభుత్వాన్ని నడపాలని అనుకోవడం లేదు. ప్రజలే మా బాసులు.. నన్ను సీఎం కుర్చీలో కూర్చోబెట్టిన ప్రజలకు నేను జవాబుదారిగా ఉండాల్సిన బాధ్యత నాపై ఉంది" అని సీఎం వివరించారు.




గువాహటి: అస్సాంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తాను కూడా నిర్బంధాలను ఎదుర్కొన్నానని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అన్నారు. విద్యార్థిగా ఉన్నప్పుడు నిర్వహించిన ఆందోళన కారణంగా తనని జైల్లో పెట్టారని, తనపట్ల కఠినంగా వ్యవహరించారని పేర్కొన్నారు. డెర్గావ్‌లోని లచిత్ బర్ఫుకాన్ పోలీసు అకాడమీ ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం తన విద్యార్థి జీవితాన్ని అమిత్ షా గుర్తు చేసుకున్నారు. "అస్సాంలో హితేశ్వర్ సైకియా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రధాని ఇందిరా గాంధీకి వ్యతిరేకంగా విద్యార్థులంతా కలిసి ఆందోళన నిర్వహించాం. అప్పట్లో నన్ను 7 రోజుల పాటు జైల్లో పెట్టారు. నా పట్ల కఠినంగా వ్యవహరించారు. నాపై భౌతికంగా దాడి చేశారు కూడా" అని అమిత్ షా అన్నారు. సైకియా అస్సాంకు కాంగ్రెస్ తరఫున రెండు పర్యాయాల పాటు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా అస్సాంలో శాంతికి ఏమాత్రం కృషి చేయలేదని అమిత్ షా దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చిన 10 ఏళ్లలో రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగయ్యాయని చెప్పారు. 10 వేల మంది యువత ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిశారని పేర్కొన్నారు. ఈ పోలీసు అకాడమీకి లచినత్ బర్ఫుకన్ పేరు పెట్టినందుకు ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మకు కృతజ్ఞతలు తెలిపారు. మొఘులుల సామ్రాజ్యకాంక్షను, వారి దాష్టీకాలను ఎదుర్కొన్న వారిలో లచిత్ బర్ఫుకన్ ఒకరు. ఆయన చరిత్ర కేవలం అస్సాంకు మాత్రమే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా తెలియాల్సిన అవసరం ఉందని అమిత్ షా అన్నారు.

## తొలి దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నయం చేసుకోవచ్చు: వెంకయ్య నాయుడు




రెజిమెంటల్ బజార్ : రొమ్ము క్యాన్సర్‌పై యూట్యూబ్ వేదికగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో వీక్షించిన నేపథ్యంలో కిమ్స్ ఆస్పత్రి రొమ్ము క్యాన్సర్ వైద్య నిపుణులు రఘురాం గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు సాధించారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అభినందించారు. కిమ్స్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకయ్య హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ప్రశంస పత్రాన్ని రఘురాం అందుకున్నారు. రొమ్ము క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించడంలో కిమ్స్ ఆస్పత్రి వైద్యులు చేస్తున్న కృషి అభినందనీయమని వెంకయ్యనాయుడు ప్రశంసించారు. "తొలి దశలోనే ఈ క్యాన్సర్‌ను గుర్తిస్తే అధునాతన వైద్య పద్ధతులను అనుసరించి నయం చేయవచ్చు. అందుకోసం ప్రజలకు అవగాహన కల్పించడం అత్యంత అవసరం. ఏకకాలంలో వందలాది మందికి అవగాహన కల్పించడంలో రఘురాం పాత్ర గొప్పది. ప్రస్తుత సమాజంలో వినోదానికే వాడుతున్న సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యల పట్ల అవగాహన కల్పించడం శుభ పరిణామం. మారుమూల ప్రాంతాల ప్రజలకు సైతం వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్న అభిరుచి కలిగి ఉండడం దేశానికి శ్రేయస్కరం. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఆరోగ్యం కాపాడుకోవాలంటే శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత, ఆహార అలవాట్లను నియంత్రణలో ఉంచుకోవాలి. అప్పుడే వ్యాధుల బారిన పడే అవకాశం తక్కువగా ఉంటుంది. భారత ప్రజలు మాతృభాషకు తొలి ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత ఉంది" అని వెంకయ్యనాయుడు అన్నారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవడంపై డాక్టర్ రఘురాం ఆనందం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మౌంట్ అబూలో బ్రహ్మకుమారిలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా.. దాన్ని 11,000 మంది యూట్యూబ్ వేదికగా చూశారని తెలిపారు. ఉషా లక్ష్మి రొమ్ము క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలి దశలోనే ఈ వ్యాధిని గుర్తిస్తే క్యాన్సర్ ముప్పు నుంచి బయటపడొచ్చని అన్నారు. 40 ఏళ్లు దాటిన మహిళలంతా రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే స్క్రీనింగ్ చేసుకోవాలని సూచించారు. తన తల్లి కూడా ఈ వ్యాధితో బాధపడినట్లు తెలిపారు. ఆమె స్ఫూర్తితోనే ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తన వంతుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఆసుపత్రుల ఎండీ భాస్కర్ రావు, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, వరల్డ్ రికార్డు ప్రతినిధి రిషి నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## డీ లిమిటేషన్ చేస్తే సీట్లు తగ్గుతాయనేది దుష్ప్రచారం మాత్రమే: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దేశవ్యాప్తంగా కేంద్రప్రభుత్వం వివిధ రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌తో కలిసి బేగంపేట రైల్వేస్టేషన్‌ను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైల్వేలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. త్వరలోనే బేగంపేట రైల్వే స్టేషన్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. మరో పది శాతం పనులు పూర్తికావాల్సి ఉందని వివరించారు. విమానాశ్రయాల తరహాలో రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ""రూ.26.55 కోట్లతో మొదటివిడత పనులు జరుగుతున్నాయి. మరో రూ.12 కోట్లతో రెండోవిడత పనులు పూర్తి చేస్తాం. ప్రయాణికులకు ఇబ్బందిలేకుండా దశలవారీగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నాం. ఒకప్పుడు రైల్వేస్టేషన్‌కు వస్తే ముక్కు మూసుకొని రావాల్సిన పరిస్థితి ఉండేది. ప్రధాని మోదీ స్వచ్ఛభారత్ ద్వారా స్వచ్ఛ రైల్వేస్టేషన్ పేరుతో వినూత్న మార్పులను తీసుకొచ్చారు. చర్లపల్లి రైల్వే స్టేషన్‌ని కూడా అధునాతనంగా నిర్మించుకొని ప్రారంభించుకున్నాం. బేగంపేట రైల్వేస్టేషన్‌లో అందరూ మహిళలే ఉద్యోగులు ఉండేలా చూస్తాం. త్రిభాషా విధానం దేశంలో కొత్తదేమీ కాదు. కేంద్ర ప్రభుత్వం బలవంతంగా తమపై హిందీ రుద్దుతోందని దుష్ప్రచారం చేస్తున్నారు. ఏ ఒక్కరిపై కూడా బలవంతంగా హిందీని రుద్దే ప్రయత్నం చేయలేదు. ఏ భాష కావాలంటే అందులో చదువుకునే అవకాశం ఉంది. తమిళ భాషలో తీసిన సినిమాలు హిందీలో డబ్ చేసి రూ.కోట్లు లాభాలను నిర్మాతలు పొందుతున్నారు. వాళ్లకా లాభాలు ఎలా వస్తున్నాయి? భాష పేరుతో దేశాన్ని విభజించాలని చూడటం సరికాదు. ముఖ్యమంత్రిగా స్టాలిన్ ఏం చేశాడో చెప్పి తమిళనాడు ప్రజల్ని ఓట్లు అడగాలి. ఆయనేం చేయలేదు కాబట్టే భాష పేరు మీద దుష్ప్రచారం చేస్తూ ఎన్నికలు దాటేయాలని చూస్తున్నారు. పునర్విభజనకు సంబంధించి 2009లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటి విధానాలే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనపై కొత్త విధానం రాలేదు. డీ లిమిటేషన్ చేస్తే సీట్లు తగ్గుతాయనేది దుష్ప్రచారం మాత్రమే" అని కిషన్‌రెడ్డి చెప్పారు.

## సభాపతిని అగౌరవపరచాలన్న ఉద్దేశం మాకు ఎప్పుడూ లేదు: హరీశ్‌రావు



హైదరాబాద్: సభాపతిపై జగదీశ్‌రెడ్డి అగౌరవంగా మాట్లాడలేదని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. జగదీశ్‌రెడ్డికి అవకాశం ఉంటే వివరణ ఇచ్చేవారని చెప్పారు. ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. "సభాపతి అంటే మాకు ఎంతో గౌరవం. ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు సహకరించాం. సభా సంప్రదాయాలు పాటించాలని మాకు మా అధినేత ఎప్పుడూ చెబుతుంటారు. సభాపతిని అగౌరవపరచాలనన్న ఉద్దేశం మాకు ఎప్పుడూ లేదు. జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను పునఃపరిశీలించాలని కోరుతున్నాం" అని హరీశ్‌రావు తెలిపారు.

## కోకాపేటలో అగ్నిప్రమాదం.. ఐటీ ఉద్యోగులకు తీవ్ర గాయాలు



హైదరాబాద్: కోకాపేటలో ఉన్న జీఏఆర్ భవనంలో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ఐటీ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. స్పందించిన సహోద్యోగులు గాయపడిన వారిని వెంటనే సమీపంలోని కాంటినెంటల్ ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

## భారాస.. సోషల్ మీడియా ద్వారా లబ్ధి పొందాలని చూస్తోంది: మంత్రి సీతక్క



హైదరాబాద్: భారాస.. సోషల్ మీడియా ద్వారా లబ్ధి పొందాలని చూస్తోందని మంత్రి సీతక్క ఆరోపించారు. "సోషల్ మీడియా ద్వారా నేను కూడా చాలా ఇబ్బంది పడ్డాను. నాపై పెట్టిన పోస్టులకు మానసికంగా ధైర్యం కోల్పోయా. నిజాయతీగా పనిచేసే మహిళల ధైర్యాన్ని సోషల్ మీడియా దెబ్బతీస్తుంది. ఒక మంచి పని చేసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తే దాన్ని స్ఫూర్తిగా తీసుకొని మరో పది మంది సాయం చేసేలా ఉండాలి. మార్చురీ అన్న పదం ఒక వ్యక్తిని ఉద్దేశించి అన్నది కాదు.. ఒక పార్టీని అన్నారు. రాజకీయంగా ఎదుర్కోవాలి.. కానీ, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేయడమేంటి? బాడీ షేమింగ్ చేయకూడదు. సోషల్ మీడియాకి హద్దు ఉండాలి. అబద్ధాలకి బ్రాండ్ అంబాసిడర్‌గా భారాస మారింది. ఒక అబద్ధాన్ని వంద సార్లు చెబితే నిజం అవుతుందని ఆ పార్టీ నమ్ముతోంది. సోషల్ మీడియాలో భాజపా, భారాస అన్నదమ్ములు. సోషల్ మీడియాలో పెట్టే పోస్టుల విషయంలో కట్టడికి ఒక చట్టం తీసుకు రావాలి" అని మంత్రి సీతక్క అన్నారు.

# అలనాటి ఆకాశవాణి మేటి గాయకురాలు గోపాలరత్నం

## మార్చి 16...శ్రీరంగం గోపాలరత్నం వర్ధంతి



శ్రీరంగం గోపాలరత్నం ఆకాశవాణి ద్వారా సమర్పిత భక్తిరంజని ద్వారా శ్రోతల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్న అలనాటి మేటి సంగీతజ్ఞులు. కర్ణాటక శాస్త్రీయ సంగీత సభల ద్వారా, భక్తిరంజని ద్వారా, రేడియో నాటకాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు, శ్రోతలకు చిర పరిచితులు, విజయవాడ కేంద్రంలో దాదాపు 20 సంవత్సరాలు స్టాఫ్ ఆర్టిస్టుగా పని చేశారు. ఆ తర్వాత పదవీ విరమణ చేసి సికిందరా బాదు సంగీత కళాశాల ప్రిన్సిపాల్గా పనిచేశారు. శ్రీరంగం గోపాలరత్నం (1939 – మార్చి 16, 1993) అలనాటి ఆకాశవాణిలో శాస్త్రీయ, లలిత సంగీత గాయకురాలు. కూచిపూడి, యక్షగాన, జావళి, యెంకి పాటలు పాడడంలో ఆమెది అందె వేసిన చేయి. అన్నమయ్య పదాలు, క్షేత్రయ్య పదాలు, మీరా భజన గీతాలు మొదలైనవి ఆమె ఆల పించిన పాటల్లో ప్రాచుర్యం పొందినవి. 1992 లో ఆమెకు భారత ప్రభుత్వం నుండి పద్మశ్రీ పురస్కారం లభించింది. ఆమె 1939 సంవత్సరంలో విజయ నగరం జిల్లా పుష్పగిరిలో వరదా చార్యులు, సుభద్రమ్మ దంపతు లకు జన్మించారు. ఆమె 1956లో సంగీతంలో డిప్లొమా తీసు కున్నారు . తల్లికి మేనమామ అయిన అప్ప కొండమాచార్యులు రాసిన రెండు హరికథలను పాలకొల్లు సభలో తొమ్మిదేళ్ళ వయసులో గానం చేయడం ద్వారా ప్రదర్శనలను ప్రారంభించారు. కవిరాయని జోగారావు ఆమెకు ప్రధాన సంగీత గురువు. ద్వారం వెంకటస్వామి నాయుడు, శ్రీపాద పినాకపాణి వద్ద కూడా సంగీతాన్ని అభ్యసించారు. తొలిసారిగా విజయవాడ ఆకాశ వాణిలో 1957 సంవత్సరం నిలయ విద్వాంసురాలిగా చేరారు. అప్పటి నుండి రెండు దశాబ్దాల పాటు శాస్త్రీయ, లలిత సంగీత బాణీలతో శ్రోతలకు విందు చేశారు. ఎందరో ప్రముఖ సంగీత సాహిత్య ప్రముఖు లతో కలిసి ఆమె ఎన్నో కార్యక్రమాలను సమర్పించారు. ఆమె కంఠం నుంచి అలవోకగా జాలువారిన అన్నమయ్య పదాలు, క్షేత్రయ్య పదాలు, మీరా భజన గీతాలు శ్రోతల హృదయాలలో చెరగని ముద్రలు వేశాయి. భామా కలాపం యక్షగానం, నౌకా చరితం ఆమె ప్రతిభకు నిదర్శనాలుగా నిలిచా యి. ఆమెకు అత్యంత కీర్తిని తెచ్చినది సంగీత ప్రధానమైన రేడియో నాటకం మీరాబాయి. ఆల్ ఇండియా రేడియోలో భక్తిరంజని కార్యక్రమాల్లో ఆమె భాగస్వామ్యం ఎన్నదగినది. అన్నమా చార్య కీర్తనలకు బాణీలు సమకూర్చారు. శ్రీ వేంకటేశ్వర వైభవం చిత్రంలోని ఒక పిలుపులో పిలిచితే పలుకుతావటా పాట యావత్ ఆంధ్రదేశం వ్యాపించింది. ఈ గీతాన్ని రచించినది ఏడిద కామేశ్వర రావు. తిరుమల తిరుపతి దేవస్థానం 60లలో నిర్మించిన "శ్రీ వేంకటేశ్వర వైభవం" డాక్యుమెంటరీ చిత్రంలో ఈ పాటను ఉపయోగించారు. ఈ పాటను మోహన (హిందూస్తానీ: భూపాలీ) రాగం, తిశ్రగతి తాళంలో ప్రముఖ కర్ణాటక, లలిత సంగీత గాయని కుమారి శ్రీరంగం గోపాల రత్నం గానం చేయగా అనూహ్య ప్రజా దరణ పొందింది. బికారి రాముడు చిత్రంలో ఆమె పాడిన నిదురమ్మా నిదురమ్మా గీతం బహుళ పాచుర్యం పొందింది. సుబ్బశాస్త్రి' (1966) సినిమాలోని శ్రీరంగంలోని ప్రసిద్ధ కన్నడ సినిమా పాట కృష్ణాన కొలలిన కరే... అయిదు దశాబ్దాల తర్వాత కూడా కర్ణాటక అంతటా ప్రసిద్ధి చెందింది. మ్యూజిక్ ఎకాడమీ మదరాసులో 1960 దశకంలో పలు మార్లు పాడారు. శ్రీరంగం శాస్త్రీయ సంగీతం పాడినా, లలిత సంగీతం పాడినా, భక్తి గేయం పాడినా, నాటక, నాటికల్లో పద్యం చదివినా ఏ పాటైనా చివరకు మంగళ హారతి పాడినా పూర్తిగా అంకితమై, మమే కమై న్యాయం చేకూర్చే వారు. మైసూరు, బెంగుళూరు, కలకత్తా, నాగపూరు, సేతూర్ (కేరళ) తదితర పట్టణాలలో బహు కచేరీలు చేశారు. తిరువయ్యూరులో త్యాగ రాజోత్సవ ములో ... శ్యామ శాస్త్రులవారి గృహంలో కూర్చొని పాడినపుడూ ఓ రానుభూతి పొందానని చెపుతుండే వారు. కచేరీ జరుగుతుండగా ఉత్సాహం పట్టలేక 94 సంవత్సరాల సేకూర్ జమీందారు కంజీరా తీసికొని వాక చేరికి వాయించిన సందర్భం అనందభరితురాల్ని చేసిందని పదేపదే గుర్తు చేసుకుంటుండే వారు. ఆమె ఆకాశవాణి కళాకారిణిగా, హైదరాబాద్లోని ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్గా, తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్గా, డీన్గా బాధ్యతలు నిర్వహించారు. 1969లో తిరుమల – తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసు రాలిగా సేవలందించారు. 1977లో హైదరాబాదు లోని తెలుగు విశ్వ విద్యాలయం ఆవిర్భావంతో లలిత కళా పీఠానికి ప్రత్యేక అధికారిణి గా నియమితు లయ్యారు. ఆమె గాన కోకిలగా, సంగీత కళానిధిగా, సంగీత రత్నగా గుర్తింపు పొందారు. ఆమె 1979 మరియు 1980 మధ్య విజయ నగరం మహారాజా ప్రభుత్వ సంగీత మరియు నృత్య కళాశాల ప్రిన్సి పాల్గా పనిచేశారు. 1992లో భారత ప్రభుత్వం ఆమెను 'పద్మశ్రీ' గౌరవంతో సత్కరించింది. గానకళా తపస్విని గోపాల రత్నం 1993 మార్చి 16న పరమ పదించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# రాయబారులపై బహిష్కరణ వేటు.. ట్రంప్ ఏం చెప్పాలనుకుంటున్నారు?





అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరిపాలన తన దూకుడు విధానాలతో నిత్యం వార్తల్లో నిలుస్తోంది. దేశీయంగా ఉద్యోగాల కోత, విదేశాలపై సుంకాల విధింపు వంటి చర్యలతో అంతర్జాతీయంగానూ చర్చనీయాంశంగా మారిన ట్రంప్ సర్కారు, తాజాగా దౌత్య సంబంధాల విషయంలోనూ అనూహ్యమైన నిర్ణయాలు తీసుకుంటోంది. వివిధ దేశాలకు చెందిన రాయబారులపై బహిష్కరణ వేటు వేయడం ఇప్పుడు హాట్ టాపిక్గా మారింది. ముఖ్యంగా దక్షిణాఫ్రికా రాయబారి ఇబ్రహీం రసూల్ను బహిష్కరించడం, తుర్క్మెనిస్థాన్లోని పాకిస్థాన్ రాయబారి ఎసాన్కు అమెరికాలోకి ప్రవేశం నిరాకరించడం వంటి ఘటనలు అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే కొన్ని కీలక అంశాలు స్పష్టమవుతున్నాయి. మొదటగా దక్షిణాఫ్రికా రాయబారి ఇబ్రహీం రసూల్ బహిష్కరణ విషయానికి వస్తే, దీనికి అధికారికంగా చెబుతున్న కారణం ఆయన ట్రంప్ను ద్వేషించడమే. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్వయంగా ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా ప్రకటించడం గమనార్హం. రసూల్ గతంలో ట్రంప్ పరిపాలనను విమర్శించినట్లు తెలుస్తోంది. అయితే, ఒక దేశ రాయబారిని కేవలం రాజకీయ విమర్శల కారణంగా బహిష్కరించడం అనేది అసాధారణమైన చర్యగా పరిగణించవచ్చు. సాధారణంగా దౌత్య సంబంధాల్లో పరస్పర గౌరవం, సహనం చాలా ముఖ్యం. ఒక దేశాధినేతను విమర్శించినంత మాత్రాన రాయబారిని బహిష్కరించడం అనేది అంతర్జాతీయ దౌత్య నియమాలకు విరుద్ధంగా ఉందా అనే ప్రశ్న తలెత్తుతోంది. అంతేకాకుండా, రూబియో రసూల్ను "జాతి విద్వేష రాజకీయ నాయకుడు" అని పేర్కొనడం మరింత తీవ్రమైన వ్యాఖ్యగా చూడవచ్చు. దీనికి ఎలాంటి ఆధారాలు ఉన్నాయనేది స్పష్టంగా తెలియాల్సి ఉంది. దక్షిణాఫ్రికా ప్రభుత్వం ఈ విషయంపై ఇంకా స్పందించకపోవడం కూడా గమనార్హం. రసూల్ గతంలో కూడా అమెరికాలో రాయబారిగా పనిచేసి, ఈ ఏడాది జనవరిలో తిరిగి నియమితులయ్యారు. ఇలాంటి అనుభవం ఉన్న వ్యక్తిని బహిష్కరించడం వెనుక బలమైన కారణాలు ఉండాలనే అభిప్రాయం వినిపిస్తోంది. ఇక తుర్క్మెనిస్థాన్లోని పాకిస్థాన్ రాయబారి ఎసాన్కు అమెరికాలోకి ప్రవేశం నిరాకరించిన ఘటన మరో ఆసక్తికరమైన అంశం. దీనికి పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ చెబుతున్న కారణం ఆయన వీసాలో ఉన్న "వివాదాస్పద ప్రస్తావనలు". లాస్ ఏంజెలెస్కు వెళ్తున్న ఎసాన్ను అమెరికా ఇమిగ్రేషన్ అధికారులు వెనక్కి పంపడం జరిగింది. ఈ ఘటనపై పాకిస్థాన్ ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించడం, ఎసాన్ను ఇస్లామాబాద్కు పిలిపించే అవకాశం ఉండటం చూస్తుంటే, ఇది కేవలం సాధారణ వీసా సమస్య కాకపోవచ్చు అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఒక రాయబారి వీసాలో వివాదాస్పద అంశాలు ఉండటం, దాని కారణంగా ఆయనను దేశంలోకి అనుమతించకపోవడం అనేది రెండు దేశాల మధ్య సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. మొత్తంగా ఈ రెండు ఘటనలను పరిశీలిస్తే, ట్రంప్ సర్కారు దౌత్య సంబంధాల విషయంలో మరింత కఠినంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. తమ విధానాలను విమర్శించే వారిని సహించేందుకు సిద్ధంగా లేరనే సంకేతాలను పంపుతోంది. ఇది అమెరికా యొక్క అంతర్జాతీయ సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి. ముఖ్యంగా దక్షిణాఫ్రికా వంటి కీలకమైన దేశంతో సంబంధాలు దెబ్బతినే అవకాశం ఉంది. అలాగే, పాకిస్థాన్తో ఇప్పటికే ఉన్న సంక్లిష్ట సంబంధాలు మరింత దిగజారే ప్రమాదం ఉంది. ఈ పరిణామాలు అంతర్జాతీయంగా ఇతర దేశాలు అమెరికాతో వ్యవహరించే విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి. దౌత్య మర్యాదలు, అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే, అది ప్రపంచ రాజకీయాల్లో అనిశ్చితికి దారితీసే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో ట్రంప్ సర్కారు మరిన్ని ఇలాంటి షాకింగ్ నిర్ణయాలు తీసుకుంటుందా అనేది వేచి చూడాలి.

# వైభవంగా ఉగ్ర నరసింహ డోలోత్సవం

## భక్తులతో కిటకిటలాడిన ధర్మపురి క్షేత్రం







ధర్మపురి క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహ, వేంకటేశ్వర బ్రహ్మోత్సవాలలో అంతర్భాగంగా శని వారం సాయంత్రం శ్రీ ఉగ్ర నారసింహుని తెప్పోత్సవ, డోలోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించారు. సాయంత్రం క్షేత్ర సనాతన సాంప్రదాయ పద్ధతిలో ఉగ్రనారసింహ స్వామి ప్రధానాలయం నుండి వేదమంత్రోచ్చాటనల, మంగళ వాద్యాలతో, భక్తజనం తోడు రాగా స్వామి ఉత్సవ మూర్తులను జయజయ ధ్వనాలతో ఊరేగించి, బ్రహ్మ పుష్కరిణి లోనికి కోనేరు ఉత్తర ద్వారం గుండా వేంచేపు చేయగా, అప్పటికే కోనేటిలో సోపానాలపై ఆసీనులై వేచియున్న భక్తజనం తమ ఇష్ట దైవాన్ని ఘనంగా స్వాగతించారు. అజ్ఞాత భక్తునిచే ప్రత్యేక నూతన నిర్మిత, బహూకృత హంస రూపు బల్లకట్టుపై స్వామిని ఆసీనులజేసి కోనేటి నీటిపై అయిదు ప్రదక్షిణలు నిర్వహించారు. బ్రహ్మపుష్కరిణి సోపానాలపై నున్న భక్త జన సమూహం ప్రదక్షిణలను మెట్లపై నుండి అనుసరించారు. బుక్కా, గులాలు ఇత్యాది పూజా ద్రవ్యాలు ఉత్సవ మూర్తులపై చల్లి భక్తి శ్రద్దలతో కైమోడ్పులిడి ప్రార్థించారు. అనంతరం కోనేరు మధ్య భాగానగల వేదికపైనున్న భోగ మటపంలోని ఊయలలో స్వామిని అసీనుల గావించి డోలోత్సవం విర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య భక్తులు ఇరుకైన మార్గం గుండా ప్రవేశించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి డోలు ఊగుచుండగా దర్శించిన భక్తులకు వేద పండితులు చతుర్వేద మంత్ర పఠనాలతో ఆశీస్సులు అంద చేశారు. జయజయ ధ్వానాలు మిన్నంటగా, పూజా ద్రవ్యాలను చల్లి భక్తులు తమ ఇష్ట దైవాన్ని కొలిచారు. అర్చకులు శ్రీనివాసాచార్య, వంశీ, విజయ్, అరుణ్ లచే భక్తులు తులసీ కంకణాలను కట్టించు కున్నారు. ఆధ్యాత్మిక ప్రాసంగికులు, గాయకులు జగదీశ్ శర్మ నరసింహ శతక పద్యాలు వినిపించారు. దేవ స్థానం ఈఓ శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో, ట్రస్టు బోర్డు అధ్యక్షుడు జక్కు రవీందర్, సభ్యులు, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ నేతృత్వంలో ఏర్పాట్లు చేయగా ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాం నరసింహా రెడ్డి, ఎస్ ఐ ఉదయ్ కుమార్ నేతృత్వంలో జగిత్యాల జిల్లాలోని ప్రత్యేక పోలీసు బృందాలు, హోంగార్డులు, ఎలాంటి అవాంఛనీయాలు చోటు చేసుకోకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు. ప్రత్యేక బస్సుల ద్వారా భక్తులను గమ్యాలకు చేర్చారు.

**ఉగ్ర నారసింహునికి భక్తజన నీరాజనం :** ధర్మపురి క్షేత్రంలో సనాతన సంప్రదాయరీతిలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో అంత ర్భాగంగా శని వారం జరిగిన శ్రీ ఉగ్రనార సింహుని తెప్పోత్సవ, డోలోత్సవ కార్యక్రమాలలో భాగస్వాము లయ్యేందుకు అశేష భక్త జనం క్షేత్రానికి తరలి వచ్చారు. ఉదయా తూర్వం దేవాలయాలను తెరవగా, సంప్రోక్షణం అనంతరం దేవస్థానం వంశపారం పర్య యాజ్ఞికులు కందాళై పురుషోత్తమాచార్య, వేద పండితులు రమేశ శర్మ మార్గ దర్శకత్వంలో అర్చకులు నంబి శ్రీనివాసాచార్య, నేరెళ్ళ శ్రీనివాసాచార్య, హరినాథాచార్య, రమణాచార్య, మూర్తి, వంశీ కృష్ణ , కిరణ్, విజయ్, అరుణ్, అలంకృత లక్ష్మీ సమేత ఉగ్ర నారసింహుడు ఆలయాలలో, దేవస్థానం ఏసీ, ఈఓ శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్య అర్చనలు, నిత్య కల్యాణంతో పాటు పురుషసూక్త, శ్రీసూక్త, భూసూక్త, నృసూక్త, లక్ష్మీసూక్త, విష్ణుసూక్త, మన్యుసూక్త, సుదర్శన, విశ్వక్సేన, తిరుకళ్యాణ మహోత్సవ వ్యాహ్య కర్మణి ఆవాహిత సర్వ దేవతాహ్వానం, గరుడ, ఆళ్వారుల హవనం, లోక కళ్యాణార్థం వ్యాహృతి హోమాది ప్రత్యేక క్రతువులను నిర్వహించారు. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు, యాత్రికులు పరమ పవిత్ర గోదావరి నదిలో మంగళ స్నానాలు ఆచరించి, సుప్రభాత దర్శనానికి వివిధ ఆలయాల ముందు బారులు తీరి నిలుచున్నారు. అత్యధిక సంఖ్యలో భక్తులు కోడెమొక్కులు, వల్లుబండ, గండాదీపాది మొక్కులు తీర్చుకున్నారు. సహస్ర స్వర్ణ కమలార్చనలో పాల్గొన్నారు. సంతానార్థం హోమగుండం వద్ద ప్రత్యేక పూజలు చేయించుకుని భగవదాశీస్సులనొందారు. ప్రధానంగా ఉగ్ర నారసింహా లయంలో చాలామంది భక్తులకు పూనకం రావడం, తమ భవిష్య త్తును, మంచిచెడులను భక్తులు అడిగి తెలుసుకోవడం కనిపించింది. కాగా శ్రీయోగానంద నారసింహుని తెప్పోత్సవ, డోలోత్సవాల సందర్భంగా ఆలయానికి గణనీయ ఆదాయం సమకూరింది. టికెట్ల ద్వారా, ప్రసాదాల విక్రయాల ద్వారా, అన్నదానం ద్వారా అదనపు ఆదాయం లభించినట్టు ఏసీ, ఈఓ శ్రీనివాస్ వివరించారు. ఉగ్ర నార సింహుని తెప్పోత్సవ, డోలోత్సవాల సందర్భంగా ఉదయా త్పూర్వం నుండి గోదావరిలో స్నానాలను సుదూర ప్రాంతాలకు చెందిన అశేష భక్తులు సంప్రదాయాచరణలో భాగంగా ఆచరించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పతంజలి బాబా రామ్దేవ్ రూ.4500 కోట్ల డీల్ వెనక

యోగ గురు రామ్దేవ్ నేతృత్వంలోని పతంజలి ఆయుర్వేద్ గ్రూప్ అంచెలంచెలుగా ఎదిగిన విధానం ప్రజలకు తెలుసు. ఇప్పుడు ఈ ఆయుర్వేద ఆధారిత గ్రూప్ ఇన్సూరెన్స్ రంగంలోకి ప్రవేశిస్తోంది. రజనిగంధ తయారీ సంస్థ ధరంపాల్ సత్యపాల్ గ్రూప్ (డిఎస్ గ్రూప్), సీరం గ్రూప్ అదార్ పూనవాలా యాజమాన్యంలోని సనోటి ప్రాపర్టీస్తో రూ. 4,500 కోట్ల విలువైన డీల్ ను రామ్ దేవ్ కుదుర్చుకున్నారు. పతంజలి ఆయుర్వేద్ .. డిఎస్ గ్రూప్ సనోటి ప్రాపర్టీస్ ఎల్ఎల్పి నుండి మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ను కొనుగోలు చేయనుందని జాతీయ మీడియా కథనం వెలువరించింది. తాజాగా ఓ ప్రకటనలో కంపెనీలు దీనిని ధృవీకరించాయి. మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ అనేది సనోటి ప్రాపర్టీస్ ఎల్ఎల్పి మెజారిటీ యాజమాన్యంలో ఉంది. ఇది అదార్ పూనవల్లా– రైజింగ్ సన్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా



నిర్వహిస్తున్న సంస్థ. పతంజలి ఆయుర్వేద్ –డిఎస్ గ్రూప్తో వాటా కొనుగోలు ఒప్పందం ప్రకారం.. అదార్ పూనవల్లా యాజమాన్యంలోని సనోటి ప్రాపర్టీస్ దాని బీమా అనుబంధ సంస్థ మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ సంయుక్త సంస్థలన్నీ ఈ అమ్మకానికి ఆమోదం తెలిపాయని ప్రకటన పేర్కొంది. ఈ కొనుగోలు ఒప్పందం విలువ రూ. 4,500 కోట్లు. 12 మార్చి 2025న జరిగిన సమావేశంలో కంపెనీ బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో మాగ్మా హెచ్డిఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్గా పిలిచేవారు.. మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ వివిధ వర్గాలలో 70 కి పైగా ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చింది. సాధారణ బీమా రంగంలోని అన్ని ప్రధాన కవరేజీలను ఇది అందిస్తుంది. పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులు 2,00,000 కౌంటర్లలో, రిలయన్స్ రిటైల్, హైపర్ సిటీ, స్టార్ బజార్ , 250 పతంజలి మెగా స్టోర్లు సహా జాతీయ స్థాయి చైన్లలో అందుబాటులో ఉన్నందున గ్రామీణ మార్కెట్లకు ఇన్సూరెన్స్ అందుబాటులోకి తేవడం సులువు అవుతుందని పతంజలి ప్రతినిధి తెలిపారు. బలమైన ఏజెంట్ వ్యవస్థ మాగ్మా ఇన్సూరెన్స్ ఎదుగుదలకు సహకరిస్తుందని సీరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా చైర్మన్ అదార్ పూనవల్లా వ్యాఖ్యానించారు. 18000 ఏజెంట్లు, 2000 కార్పొరేట్లు తమ వ్యాపారంతో అనుసంధానమై ఉన్నాయని ఆయన వెల్లడించారు.

# 'నాయకుడొచ్చాడన్న నమ్మకం బలపడింది' పవన్ పై చిరు కామెంట్స్ వైరల్!

పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడ గ్రామం వద్ద 50 ఎకరాల ప్రాంగణంలో "జయకేతనం" పేరుతో జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభ జరిగిన సంగతి తెలిసిందే. ఈ సభలో అశేషంగా తరలివచ్చిన జనసైనికులను ఉద్దేశించి ఆ పార్టీ అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రస్థానం గురించి, రాష్ట్ర రాజకీయాల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. అవును... పిఠాపురంలో శుక్రవారం నిర్వహించిన జనసేన పార్టీ ఆవిర్భావ సభలో అశేషంగా తరలివచ్చిన పార్టీ కార్యకర్తలను, అభిమానులను ఉద్దేశించి పవన్ కల్యాణ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా పలు సంచలన వ్యాఖ్యలే చేశారు. ఇందులో భాగంగా... పదకొండేళ్ల జనసేన ప్రస్థానాన్ని, ఎదుర్కొన్న కష్టాలను, పార్టీని నిలబెట్టిన విధానాన్ని వివరించారు. ప్రధానంగా... సామాజిక, రాజకీయ అంశాలపై అవగాహన లేకుండానే పార్టీ పెట్టేస్తామా? అని



మొదలుపెట్టిన పవన్... పార్టీ పెట్టాలంటే తండ్రి ముఖ్యమంత్రి అయ్యుండాలా? బాబాయ్ ని చంపించి ఉండాలా? దశాబ్దంపాటు ఒంటరిగా పార్టీని మోయాలంటే ఎన్ని తిట్లు, ఎన్ని అవమానాలు భరించాలి? ఎంత జ్వలించాలి? అంటూ ప్రశ్నించిన విధానం హైలైట్ గా నిలిచిందని అంటున్నారు! ఈ స్థాయిలో పిఠాపురంలో జరిగిన పార్టీ 12వ ఆవిర్భావ సభలో పవన్ కల్యాణ్ ప్రసంగం సాగింది. తనదైన ఆవేశంతో, తనదైన శైలి పద ప్రయోగాలతో జనసేన కార్యకర్తలను ఉత్సాహ పరుస్తూ, ఆలోచింప చేస్తూ జనసేన అధినేత ప్రసంగం ఆద్యాంతం ఆసక్తిగా మారింది. ఈ సమయంలో పవన్ ప్రసంగానికి జనసైనికులే కాదు తాను ఫిదా అయ్యానంటూ చిరు స్పందించారు. అవును... పిఠాపురం వేదికగా ఆద్యాంతం అత్యంత ఆసక్తిగా, రసవత్తరంగా సాగిన పవన్ కల్యాణ్ ప్రసంగంపై మెగాస్టార్, మాజీ కేంద్రమంత్రి, పవన్ కల్యాణ్ పెద్ద అన్నయ్య చిరంజీవి స్పందించారు. సభకు వచ్చిన అశేష జనసంద్రం లాగానే పవన్ కల్యాణ్ స్పీచ్ కు తాను కూడా మంత్రముగ్ధుడినయ్యానని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. నా ప్రియమైన సోదరుడు పవన్ కల్యాణ్... అని మొదలుపెట్టిన చిరంజీవి.. జనసేన జయకేతన సభలో నీ స్పీచ్ కి మంత్రముగ్ధుడినయ్యాను.. సభ కొచ్చిన అశేష జన సంద్రంలానే నా మనసు ఉప్పొంగింది.. ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చే నాయకుడొచ్చాడన్న నమ్మకం మరింత బలపడింది.. ప్రజా సంక్షేమం కోసం ఉద్యమస్ఫూర్తితో నీ జైత్రయాత్ర నిర్విఘ్నంగా కొనసాగాలని ఆశీర్వదిస్తున్నాను.. అని చిరు ట్వీట్ చేశారు.

# చురకలు

## సంపాదకీయం

### రాముడు కాదు సీత... బీహార్ లో బీజేపీ అస్త్రం !

బీజేపీ రాజకీయానికి జోహార్ అనాల్సిందే. ఎప్పటికి ఏది అవసరమో దానికి గురిపెట్టి అనుకున్న లక్ష్యాన్ని చేధించడం బీజేపీకి ఎంతో సులువైన విద్య అని ప్రత్యర్థులు అంటూంటారు. ఎక్కడా ఈ విషయంలో తగ్గేది లేదని బీజేపీ కూడా అనేక సార్లు నిరూపించుకుంటూనే ఉంది. ఇదిలా ఉంటే యూపీ ఎన్నికలతో పాటు దేశంలో అనేక సార్వత్రిక ఎన్నికల్లో అయోధ్య రామాలయాన్ని ట్రంప్ కార్డుగా వాడిన బీజేపీ కేవలం రెండు ఎంపీ సీట్ల నుంచి అయిదు సార్లు అధికారంలోకి వచ్చేలా రాచ బాటలు వేసుకుంది. ఇక ఇపుడు రాముడు కాదు సీత అంటోంది బీజేపీ. బీహార్ లో శాసనసభకు ఈ ఏడాది అక్టోబర్ నవంబర్ ల మధ్యలో ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో గెలిచి తీరాలని ఎన్డీయే కూటమి పట్టుదలగా ఉంది. అయిదేళ్ళ ఎన్డీయే పాలన పట్ల వ్యతిరేకత ఉన్నా అధిగమించాలని చూస్తోంది. మరోసారి బీహార్ గద్దె మీద ఎన్డీయే కూర్చోవడానికి చేయాల్సిన కసరత్తుని చేస్తోంది. ఈ నేపథ్యంలో బీహార్ ఎన్నికల కోసం బీజేపీ సరికొత్త అస్త్రాన్ని రెడీ చేసి పెట్టింది. బీహార్ లో సీతాదేవి ఆలయం నిర్మాణం అన్నది బీజేపీ అజెండాగా మార్చుకుంటోంది. సీతామర్హి ఆలయాన్ని కాషాయం పార్టీ గట్టిగానే గురి పెట్టింది. ఈ ఆలయం మిథిలా ప్రాంతంలో ఉంది. అక్కడే సీతాదేవి పుట్టిందని పురాణ గాథలు తెలియచేస్తున్నాయి. ఈ ఆలయ పునరుద్ధరణ మీద బీజేపీ ప్రస్తుతం పూర్తి స్థాయిలో ఫోకస్ పెడుతోంది. ఈ నేపథ్యంలో సీతామర్హి ఆలయాన్ని పునరుద్ధరించడానికి కేంద్రం మరిన్ని నిధులు మంజూరు చేయాలని అక్కడి నితీష్ కుమార్ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. ఇదిలా ఉంటే సీతామర్హిలోని పునౌరా గ్రామంలోని పునౌరా ధాం ఆలయ పునరుద్ధరణ ప్రాజెక్టుని మొదత 2023 సెప్టెంబర్ లో మంజూరు చేశారు. దీనినే సీతామాత జన్మస్థలం అన్నది భక్తుల నమ్మకంగా ఉంది. ఇపుడు దీనిని అద్భుతమైన పర్యాటక క్షేత్రంగా మార్చాలని అక్కడి ఎన్డీయే ప్రభుత్వం చూస్తోంది. దాంతో బీహార్ లో ఇపుడు సీతా మాత గురించే బీజేపీ మాట్లాడుతోంది. ఆ పార్టీ సీతామాత ఆలయం గురించి చేస్తున్న జపాన్ని విపక్షాలు తప్పు పడుతున్నాయి. ఇది ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్న రాజకీయమని కూడా విమర్శిస్తున్నాయి. మతపరమైన అంశలను బీజేపీ లేవనెత్తుతోందని ఆర్జేడీ మండిపడుతోంది. సీతా ఆలయ ప్రాజెక్ట్ ని అనవసరంగా రాజకీయాల్లోకి తీసుకుని వస్తున్నారని ఫైర్ అవుతోంది. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జ్ఞాన్ రంజన్ గుప్తా ఆరోపిస్తున్నారు. సరే ఎవరు ఏమనుకున్నా బీజేపీ మాత్రం బీహార్ లో సీతాదేవి ఆలయం విషయంలో ఎక్కువగానే ప్రచారం చేసుకుంటోంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే ట్రంప్ కార్డు అవుతుందని కూడా భావిస్తోంది. చూడాలి మరి బీహార్ లో బీజేపీని సీతాదేవి ఏ విధంగా అభయహస్తం ఇచ్చి కాపాడుతుందో.

## అజరామరాలు...ఉషశ్రీ పురాణ వ్యాఖ్యానాలు - మార్చి 16... ఉషశ్రీ జయంతి



తెలుగు వారికి పరిచయం అక్కర్లేని పేరు ఉషశ్రీ. తెలుగునాట ప్రఖ్యాతి గాంచిన రేడియో వ్యాఖ్యాతగా, సాహిత్య రచయితగా, తమ రామాయణ భారత ప్రవచనాల ద్వారా తెలుగుసీమలో ఉషశ్రీ అందరికీ సుపరిచితులు. ఆప్పట్లో ఆయన గొంతుని, మాట సరళిని గుర్తు పట్టలేని తెలుగు శ్రోతలు లేరంటే అది అతిశయోక్తి కానేకాదు. ధర్మ సందేహాలు అనే పదబంధం వినబడితే ఉషశ్రీ గుర్తుకు రాక మానరు. ఆకాశవాణి ద్వారా ఆ కార్యక్రమాన్ని అంతగా ప్రాచుర్యం గావించారు ఉషశ్రీ. పురాణ ప్రవచనంలోనే కాక ప్రత్యక్ష వ్యాఖ్యానాల లోనూ తెలుగు శ్రోతలపై చెరగని ముద్ర వేసిన 'గళగంధర్వుడు' ఉషశ్రీ. తెలుగు దేశంలో రేడియో స్వర్ణయుగ వైభవాన్ని శిఖరస్థాయికి చేర్చిన దిగ్గంతులలో అగ్ర తాంబూలం ఆయనదే అనడం అతిశయోక్తికాదు. ఉషశ్రీ (మార్చి 16, 1928 - సెప్టెంబరు 7, 1990) అసలు పేరు పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా కాకరపర్రు అగ్రహారంలో 1928 (ప్రభవ తెలుగు సంవత్సరం) సంవత్సరం మార్చి 16 (ఫాల్గుణ బహుళ త్రయోదశి) న జన్మించారు. తండ్రి ఆయుర్వేద వైద్యులు పురాణపండ రామూర్తి, తల్లి కాశీ అన్నపూర్ణ. వారికి నలుగురు సంతానం. డాక్టర్ గాయత్రి, పద్మావతి, వైజయంతి, కళ్యాణి. జాతీయోద్యమ సమయంలో కాకినాడలో కాంగ్రెస్ పార్టీకి ప్రతినిధిగా పని చేశారు. ఉభయ గోదావరి జిల్లాల్లో అనేక వేదికల ద్వారా రామాయణం, మహాభారతం మహాభాగవతం ప్రవచనం చేశారు. ఆకాశవాణిలో పని చేస్తున్నప్పుడు భారత, రామాయణ, భాగవతాలను ప్రతి వారం సీరియల్‌గా చెపుతూ, అశేష తెలుగు శ్రోతలను ఉర్రూత లూగించారు. పురాణాలను పుక్కిట పట్టిన సాహితీ ద్రష్ట. రామాయణ భారతాలు పనికిమాలిన గ్రంథాలు అని నిరసించే హేతు వాదులనూ, అవి పరమ పవిత్రమయిన మత గ్రంథాలు అని గుడ్డిగా ఆరాధించే చాందసులను ఇద్దరినీ సమానంగా నిందించి, ఈ రామాయణ భారతాలు మానవజాతి సర్వకాలాల లోనూ సుఖశాంతులతో మనుగడ సాధించడానికి అవసరమయిన విశేషాలను అందించే గ్రంథాలు మాత్రమే అనీ, అందుచేతనే ఇవి ఇన్నివేల సంవత్సరాలు జీవించ గలిగాయనీ ఉషశ్రీ స్పష్టం చేశారు. రేడియోలో ఉషశ్రీగా పేరొందక ముందు కవిత్వం, గేయాలు, యక్షగానాలు, ఎన్నో కథలు, నవలికలు రాసారు. ఎమెస్కో వారు కూడా ఎన్నో ప్రచురించారు. రేడియోలో వార్తలు కూడా చెప్పేవారు. రేడియో నాటకాలు రాసేవారు. రేడియో నాటకాల్లో పాల్గొనేవారు. 1973 లో రేడియోలో భారత ప్రవచనం ప్రారంభించాడు. ఉషశ్రీ పురాణ ప్రవచనాలు వారానికి ఒకసారి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు వచ్చేది. అప్పట్లో, దూరదర్శన్ లేదు. ఉషశ్రీ పురాణ ప్రవచనాలు వారానికి ఒకసారి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు వచ్చేది. ఆయన ఉచ్చారణ ఎంత గంభీరమో, రచనా శైలి కూడా అంతటి నారికేళపాకంగా ఉండేది. శ్రోతలు రేడియోల ముందు నుండి కదలక ఉండేవారు. భగవద్గీతను, సుందరాకాండను పండిత పామరులను అలరించేలా, అందరికీ అర్థమయ్యేలా చేశారాయన. ధర్మసందేహాల కార్యక్రమం రేడియోలో వస్తూంటే పండిత పామరులనే బేధాల్లేకుండా రేడియోకి అతుక్కుని పోయేవారు. అయన కార్యక్రమం ప్రారంభం అయినంటే, రిక్షా కార్మికులు మొదలుకొని, రోడ్లపై నడిపేవారు కూడా ఆగి, రేడియో ఉన్న షాపు వద్ద విని వెళ్ళేవారు. రోడ్లపై జనసంచారం ఉండేది కాదు. నేటి క్రికెట్ మాచ్ కి మించిన ప్రజాదరణ పొందిన కార్యక్రమం అది. మొదట శనివారం నాడు పది నిమిషాల కార్యక్రమంగా మొదలై తరువాత శ్రోతల కోరికపై అరగంట, ఆ తర్వాత ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మార్చక తప్పలేదు. ఉషశ్రీ వాణి, ప్రత్యేకమైన బాణీ శ్రోతల్ని యెంతగా ఉర్రూత లూగించేవంటే వ్యాసపీఠం ప్రసారాల్ని నిలిపి వేసినప్పుడు రెడియో స్టేషన్ యెదుట ధర్నాలు కూడా జరిగేవి. ఉషశ్రీ స్వరానికి వున్న పాపులారిటీకి అది మచ్చు తునక. దీన్ని బట్టి ఆయన కార్యక్రమాలు శ్రోతలను ఎంతగా ప్రభావితం చేశాయో స్పష్టం అవుతున్నది. 1979 లో పి.వి.ఆర్.కె ప్రసాద్ తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఉన్నపుడు ఉషశ్రీ చేత భాగవతం రాయించి పాతికవేల ప్రతులు ముద్రింప జేసి అతి తక్కువ ధరలో భక్తులకు అందించారు. అయితే ఆయన రెండున్నర రూపాయలకు విక్రయించే చర్యలు గైకొనగా, తర్వాత వచ్చిన అధికారులు తొమ్మిది రూపాయలకు పెంచారు. భారతం, రామాయణాలు కూడా పదివేల ప్రతులు ముద్రించి కృష్ణా పుష్కరాల సమయంలో విడుదల చేశారు. దైవభక్తి, దేవుడిమీద అచంచల విశ్వాసం, జాలి, దయ, కరుణ, సున్నితత్వం, సేవా దృక్పథం, ఆపదలో ఉన్నవారికి సాయం చేయడం ఆయన స్వభావం. ఆయన తనకు మాత్రమే తెల్సి ఇంకెవ్వరికీ చెప్పకుండా చేసిన సాయాలు, దానాలెన్నో. మానవ విలువలు, సంబంధాలకు ఎంతో విలువ నిచ్చేవారు. 1986-90ల మధ్య ఆంధ్రజ్యోతి, స్వాతి వారపత్రికలలో ఉషశ్రీ పాఠకుల ధర్మసందేహాలకు సమాధానాలు కార్యక్రమం నిర్వహించారు. వీరకాకాని అంతిమ యాత్ర, భారత మాజీ రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ప్రారంభించిన రాజమండ్రి - కొవ్వూరు మధ్య గోదావరి నదిపై నిర్మించిన రోడ్ - కమ్ రైలు వంతెన ప్రారంభోత్సవం, భద్రాద్రి రామయ్య కల్యాణం, కృష్ణా పుష్కరాల సందర్భంగా తొలి ప్రత్యక్ష వ్యాఖ్యానం లాల్ బహదూర్ శాస్త్రి హైదరాబాద్ పర్యటన సందర్భంగా చేసిన ప్రత్యక్ష వ్యాఖ్యానం, తదితరాలు ఆయన వాగ్ధాటి, సమయస్ఫూర్తి, విషయ పరిజ్ఞానం, సమయోచిత సందర్భానుసార పద ప్రయోగ ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి. రాజాజీ ప్రసంగాలను అనువదించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## తెలుగు తొలి నిఘంటువు కర్త మామిడి వెంకయ్య - మార్చి 16... మామిడి వెంక టార్యులు జయంతి



ఆంధ్ర దీపిక పేరుతో మామిడి వెంకటార్యులు రాసిన నిఘంటువు తెలుగు భాషా చరిత్రలో ఒక నూతన ఒరవడికి నాంది పలికింది. 1806 మేలో పాశ్చాత్య పద్ధతిలో, ఆధునిక ప్రణాళికతో అకారాది క్రమంలో తొలి తెలుగు నిఘంటువును రాసిన ఘనత మామిడి వెంక య్యకే దక్కింది. ఆయన సంస్కృతంలో రచించిన శబ్దార్థ కల్ప తరువు మొదటగా అచ్చయిన సంస్కృత నిఘంటువు, ఆంధ్ర లక్షణం, పర్యాయ పదాల రత్న మాల, శకట రేఫ లక్షణం, విశేష శబ్ద చింతామణి తెలుగు వ్యాకరణ గ్రంథాలను రచించారు. తెలుగు వ్యాకరణంలో దంత్య తాలవ్యాలను వెంకటార్యులే ముందుగా ప్రవేశ పెట్టారు. వేదాలు, ఉపనిషత్తులను అధ్యయనం చేశారు. యాజ్ఞ వల్క్యని పరాశర సంహితను తెలుగులోకి అనువదించారు. చిన్నయ సూరి, సి.పి. బ్రౌన్ నుంచి బహుజనపల్లి సీతారామాచార్యుల వరకూ, అందరికీ మార్గ దర్శనం కలిగించిన మొదటి అకారాది నిఘంటువు ఆంధ్ర దీపిక నిఘంటు కర్త పండితరాయ మామిడి వెంక య్య (1764 - 1834). రెండు వందల పదిహేనేళ్ల క్రితం 1806లో ఆంధ్ర దీపిక కూర్పు జరిగిందంటే సామాన్యమైన విషయం ఏమీ కాదు. పంతొమ్మిదో శతాబ్దానికి ముందు తెలుగు నిఘంటువులన్నీ ప్రాచీన సంస్కృత నిఘంటువులు లాగే పద్య రూపం లోనే ఉండేవి. అకారాది క్రమంలో సామాన్యులకు అందుబాటులో లేవు. అలాంటి సమయంలో, శబ్దార్థ కల్పతరువు పేరిట సంస్కృత పదాలకు సంస్కృ తంలో, తెలుగులో అర్థాలిచ్చిన నిఘంటువును వెంకయ్య సమకూర్చారు. భారతీయ భాషల్లో అకా రాది నిఘంటువుల్లో ఇదే మొదటిది. కావచ్చని కొందరు విశ్లేషకుల అభిప్రాయం. మామిడి వెంకటార్యులు 1764 మార్చి16న బందరు పరాసుపేట లోని విజయలక్ష్మి, వెంకన్నలకు జన్మించారు. బందరులో దుకాణ దారునిగా ఉన్న వెంకటార్యులు ఒక పండితునిగా, తెలుగుభాషా ఉద్ధార కునిగా ప్రశంసలందు కున్నారు. బ్రిటీషు ఈస్టిండియా కంపెనీ వారు తమ పాలనా సౌలభ్యానికి వెంకయ్య ఆంధ్రదీపిక నిఘంటువు ఉపకరిస్తుందని గుర్తించి, రాత ప్రతిని వేయి వరహాలకు కొనుక్కున్నారు. చాలాకాలం రాత ప్రతి రూపం లోనే ఉండి పోయి, ముద్రణ1965లో మచిలీ పట్నం లోని శ్రీవాసవీ గ్రంథ ప్రచురణ సమితి వారు శ్రీ శుద్ధ చైతన్య స్వామి వారి పరిష్కరణతో ఆంధ్రదీపికను వెంకయ్య పేరుతో 38,000 పదాలతో తొలిసారిగా ప్రచురించారు. మామిడి పాండిత్యాన్ని చూసిన విక్టోరియా రాణి బందరు వచ్చిన పుడు ఆయనకు టౌన్ హాలులో "పండిత రాయలు" బిరుదునిచ్చి సత్కరించారు. ఆ టౌను హాలును ఇప్పటికీ విక్టోరియా రాణి హాలుగా పిలుస్తారు. తెలుగు భాషకు ఆయన చేసిన సేవకు సి.పి బ్రౌన్ మెచ్చి సువర్ణ కంకణం తొడిగారు. బందరు సాహితీ వేత్తలు ఆయనకు "బాల అమర్" అని బిరుదు నిచ్చారు. అమరుడు ఎలా మొదట సంస్కృత నిఘంటువు వ్రాసాడో అలానే ఆయన కూడా 1965 లో కేంద్ర ప్రభుత్వం ఆయన రచనలను అచ్చు వేయడానికి నిధులు కేటాయించింది. ఆయన "ఆంధ్ర దీపిక" ను చూసిన అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ దాని ప్రచురణకు నిధులు అందించారు. తెలుగు భాషకు మామిడి వెంకయ్య చేసిన సేవకు చేసిన సేవ మరువలేనిది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## అమరజీవి ఆత్మార్పణానికి మరో కోణం - మార్చి 16... పొట్టి శ్రీరాములు జయంతి

అమరజీవి'గా ప్రాచుర్యం పొందిన పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేసి, ఆత్మార్పణం చేసుకున్న నేపథ్యం గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఆయన ఆమరణ నిరాహారదీక్ష ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసమే అనే మిగుల ప్రచారంలో ఉన్నా, దాని వెనక మద్రాసు నగర అంశం ప్రధానమని కొందరి అభిప్రాయము. రాష్ట్ర ఏర్పాటు అనేది చాలా తీవ్రమైన రాజకీయ సమస్యగా మారిపోగా, అలాంటి రాజకీయ సమస్య కోసం శ్రీరాములు దీక్ష చేయటానికి ప్రధానంగా మద్రాసు నగర భవిష్యత్తే అని పలు వ్యాసాలను బట్టి మరో కోణానికి బలం చేకూరు తున్నది. మహాత్మా గాంధీతో వ్యక్తిత్వానికి ప్రభావితులై, ఉద్యోగం వదిలి దాదాపు రెండు దశాబ్దాలు శ్రీరాములు సన్నిహితంగా మెదిలారు. జాతిపిత అహింస సిద్ధాంతాన్ని విశ్వసించి, పలుమార్లు ఆచరించి.. విజయం సాధించారు. అదే మార్గంలో దీక్ష చేయాలని నిర్ణయించారు. అస్పృశ్యతకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న సందర్భంగా.. తనకు ఎదురవుతున్న సవాళ్లను తెలియజేస్తూ శ్రీరాములు రాసిన లేఖకు సమాధానంగా గాంధీజీ స్వదస్తూరితో ఇచ్చిన జవాబు... 'అన్ని విధాలుగా ప్రచారాన్ని కొనసాగించు. కానీ ఇప్పుడే దీక్ష వద్దు' అని గాంధీ పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల్లో సత్యాగ్రహ ఉద్యమాలు చేస్తూ జైలుకెళ్లిన శ్రీరాములు బీహారు వంటి రాష్ట్రాల్లో కూడా సేవలు చేశారు. అనంతరం నెల్లూరులో దళితులకు ఆలయ ప్రవేశం, అస్పృశ్యత నివారణ మొదలైన వాటికోసం ప్రచారం, నిరాహార దీక్షలు చేసి విజయం సాధించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన 58 రోజుల ఆమరణ దీక్షకు ముందు శ్రీరాములు ఐదు సార్లు నిరాహార దీక్షలు చేశారు. "మద్రాసును కేంద్ర పాలిత ప్రాంతం చేయాలి" అని 1952 సెప్టెంబర్ 15వ తేదీన శ్రీరాములు నెల్లూరు నుంచి భాగవతుల లక్ష్మీ నారాయణకు ఒక లేఖ రాశారు. అందులో.. "ఆంధ్ర రాష్ట్ర సమస్య అనేక మందికి, అనేక పార్టీలకు, అనేక అభిప్రాయాలకు, అనేక భావాలకు అనేక రకాలుగా పుట్టిల్లు అయ్యింది. ప్రతి ఒక్కరి స్వార్థమూ వేర్వేరుగా ఉంది. ప్రత్యక్ష ఆర్థిక లాభాలున్నాయి. కాబట్టి అందరూ పరమార్థ దృష్టితో ఆలోచిస్తే తప్ప ఏకాభిప్రాయానికి రాలేరు. అధికారంలో ఉన్న మహా నాయకుల దృష్టి మార్చాలంటే సామాన్యం కాదు. ఇందుకు ఒక్కటే మార్గం కనబడుతోంది. నిష్కామ దృష్టితో, ద్వేష రహితంగా, నిశ్చింతగా ప్రాణాలర్పించటమే. ఇక ఈ సమస్యను ఉపేక్షించటం పాపమని నిన్నే (1952 సెప్టెంబర్ 14) అనిపించింది". తర్వాత 15 రోజులకు భీమవరంలో స్వామి సీతారాంను శ్రీరాములు కలిసి, లక్ష్మీనారాయణకు రాసిన లేఖను, దానితోపాటు పంపించిన 'ఆంధ్ర రాష్ట్రం' అనే వ్యాసాన్ని చూపించారు. వాటిని పరిశీలించిన స్వామి సీతారాం అక్టోబర్ 2వ తేదీన శ్రీరాములుకు తన స్పందన తెలియజేస్తూ లేఖ రాశారు. దీక్ష చేయాలన్న శ్రీరాములు నిర్ణయాన్ని అభినందిస్తూనే.. "ప్రస్తుతానికి మద్రాసు నగర భవిష్యత్తును గూర్చి పట్టుబట్టడం ఉచితం కాదు" అని సూచించారు. కానీ, ఆయన సూచనను శ్రీరాములు అంగీకరించ లేదు. "మద్రాసు నగర భవిష్యత్తు నిర్ణయించే బాధ్యతను పండిట్ నెహ్రూకు అప్పగించటానికి వీలులేదు. మద్రాసు నగర పౌరులే ఆ నగరం భవిష్యత్తుని నిర్ణయించాలి. నా దీక్ష వలన మద్రాసు నగరంలోని తమిళ ప్రముఖుల్లో కొందరిలోనైనా హృదయ పరివర్తన ఏర్పడి.. మద్రాసు నగరాన్ని కేంద్ర పాలిత రాష్ట్రంగా ఏర్పరచడానికి వారు అంగీకరించగలరని నేను నమ్ముతున్నాను. ప్రజాభీష్టాన్ని అమలు జరపడమే పండిట్ నెహ్రూ వంతు" అని పేర్కొన్నారు. 1952 అక్టోబరు 19వ తేదీన తన దీక్ష ప్రారంభించడానికి ముందు పత్రికలకు శ్రీరాములు ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో.. "మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం సాధించడానికి తీవ్రమైన కృషి జరగాలి" అని పేర్కొన్నారు. దీక్షకు ఐదు రోజుల ముందు మద్రాసు పౌరులకు చేసిన విజ్ఞప్తిలో ఆయన ఇలా పేర్కొన్నారు.. "ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని తగినంత ప్రచారం, ఆందోళన, లెక్కల సేకరణ మొదలైనవి ఇప్పటికే జరిగాయి. 1916లోనే ఆంధ్రోద్యమ ప్రచారం ముమ్మరం కావటంతో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర స్థాపన సమస్య అందరి దృష్టినీ ఆకర్షించింది. దానివలన కలిగిన తక్షణ ఫలితం అనిబిసెంటు అధ్యక్షతన 1917 డిసెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘాన్ని ఏర్పాటు చేయడం. 'ఆ రాష్ట్ర కాంగ్రెసు సంఘం మదరాసు నగరం మీద తక్కిన మదరాసు రాష్ట్ర కాంగ్రెసు సంఘంతో సమానంగా హక్కు కలిగి ఉంటుంది' అని ఒక తీర్మానం కూడా ఆ సందర్భంగా ఆమోదించబడింది." ఆయనదీక్షను చేపట్టాక...విరమించడానికి రెండు షరతులు పేర్కొన్నారు. 1) మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం ఏర్పడటం. 2) భారత ప్రభుత్వం రాజ్యాంగం లోని 3వ ఆర్టికల్ కింద



ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించటం. " పొట్టి శ్రీరాములు దీక్ష వెనుక లక్ష్యం గురించి ఆయన మేనల్లుడు ఎన్ఆర్ గుప్తా మాటల్లో.. "మద్రాసు ఉమ్మడి సొత్తుగా ఉండాలని ఆయన అనుకుంటూ వచ్చారు. మద్రాసు మన సొత్తు కావచ్చు. అయితే, వాళ్లు (తమిళులు) మనం చాలా కాలంగా కలసి ఉంటున్నాము. అలాంటప్పుడు మనల్ని వాళ్లు వెళ్లిపొమ్మంటే ఎంత కష్టపడతామో.. వాళ్లను మనం వెళ్లిపొమ్మన్నా అంత కష్టపడతారు. అందువల్ల ఉమ్మడిగా నగరం చేస్తే బాగుంటుందన్నారు." "మరి నిర్వివాద ప్రాంతాలతో చాలామంది రాష్ట్రం కావాలంటున్నారు కదా! అంటే.. 'మనం మద్రాసు ఎందుకు వదులు కోవాలి? వేరేచోటకు వెళ్లి మట్టిలోను, ఇటుకల్లోను రూ. 15-20 కోట్లు ఎందుకు పోసు కోవాలి? ఇంత డబ్బు ఎందుకు వృధా చెయ్యాలి? త్వరగా రాష్ట్రం వస్తుందని ఉన్న హక్కు ఎవరైనా వదులు కుంటారా? అసలు ఆ మాటకు వస్తే మద్రాసుపై మనకు ఎక్కువ హక్కు ఉంది. ఇదంతా గుర్తించే ధార్ కమిటీ మద్రాసును ప్రత్యేక రాష్ట్రం చెయ్యాలని న్యాయంగా తీర్పు చెప్పింది. మన రాజధాని ఈ నగరంలో వద్దు అని అంతా అంటే నేను ఏమంటా? ఆంధ్ర రాష్ట్రపు రాజధాని వేరేచోట పెట్టుకోవచ్చు. అయితే, ఈ వ్యవహారాన్ని సామరస్యంతో పరిష్కరించుకోవాలి." అయితే, మద్రాసు కోసం ఎందుకు ఉపవాసం చేయటం, విడిచి పెట్టవచ్చు కదా? అని తాను అడిగానని, అందుకు శ్రీరాములు స్పందిస్తూ.. "నేను చచ్చిపోవాలని చెయ్యడం లేదు. మనకు న్యాయమైన హక్కు ఉన్నదనటం కోసం చేస్తున్నాను. అదివస్తే సంతోషిస్తాను. రాకపోతే చచ్చిపోతాను. నేను పోతే దీన్ని సాధించటానికి ఎవరికైనా అవకాశం ఉండవచ్చు" అన్నారని గుప్తా తెలిపారు. (ఆంధ్ర పత్రిక: 18 డిసెంబర్ 1952) ప్రకాశం పంతులు మాటల్లో చెప్పాలంటే.. "ఉపవాసం చెయ్యడానికి ఎవ్వరూ స్థలం ఇవ్వకపోతే అట్టలు కట్టుకొని, వీధుల్లో తిరిగి ప్రాణాలైనా అర్పిస్తానన్న పట్టుదల గల మనిషి శ్రీరాములు". ఆయనకు ఆశ్రయం ఇచ్చేందుకు బులుసు సాంబమూర్తి ముందుకు వచ్చారు. పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19వ తేదీన బులుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ దీక్ష ప్రారంభించారు. 1952 అక్టోబర్ 19వ తేదీ నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు ఆమరణ నిరాహార దీక్ష చేశారు. మద్రాసు లేకుండా ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డిసెంబర్ 19వ తేదీన లోక్‌సభలో ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు. ఈ మేరకు వాంఛూ కమిటీని ఏర్పాటు చేశారు. 1953 అక్టోబర్ 1వ తేదీన కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. 2008 మే 22వ తేదీన నెల్లూరు జిల్లా పేరును శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# రాకపోకలకు రక్షణ కరవు!

ఇబ్రహీంపట్నం : మల్లాపూర్ మండలం ధర్మారం గ్రామ శివారులోని ప్రధాన రహదారిపైనున్న వాగుపై నిర్మించిన వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు. దిమ్మెలు సైతం అక్కడక్కడ విరిగిపోయాయి. దీంతో వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఏడాది కిందట మల్లాపూర్ మండలంహుస్సేన్‌నగర్ శివారులోని ఎస్సారెస్పీ కాకతీయ కాలువ ఉపకాలువలో ప్రమాదవశాత్తు ఓ ట్రాక్టర్ బోల్తా పడడంతో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. రహదారుల పక్కనే ఉన్న కాలువలు, వాగులపై వాహనాల రాకపోకల కోసం నిర్మించిన వంతెనలు ప్రమాదకరంగా మారాయి. కాలువలకు ఇరువైపులా ఎలాంటి రక్షణ కంచెలు, గోడలు లేకపోవడంతో పలుచోట్ల వాహనాలు ప్రమాదవశాత్తు కాలువల్లోకి దూసుకెళ్లి ప్రాణ నష్టం సంభవించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. కాలువలు, వాగులపై నిర్మించిన వంతెనలకు పలు చోట్ల ఇరువైపులా రెయిలింగ్, రక్షణ దిమ్మెలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి.

జిల్లాలో చాలా చోట్ల కాలువలు, వ్యవసాయ బావులు, వంతెనలు ప్రమాదకరంగా మారాయి. ఆయా చోట్ల ప్రమాదాల నివారణకు రెయిలింగ్, రక్షణ గోడలు, దిమ్మెలు ఏర్పాటు చేయలేదు. వాటి వద్ద



కనీస హెచ్చరిక సూచికలు సైతం ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కాలువలపై వంతెనలు చాలా ఏళ్ల కిందట నిర్మించడంతో శిథిలావస్థకు చేరాయి. వాగులపై నిర్మించిన వంతెనల రక్షణ గోడలు, దిమ్మెలు వరద ధాటికి కొట్టుకు పోవడంతోపాటు దెబ్బతిన్నాయి. మరమ్మతు చేయించక పోవడంతో వాహనదారులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇటిక్యాల శివారులోని వాగుపై వంతెనకు ఇరువైపులా రక్షణ దిమ్మెలు వరద ధాటికి కొట్టుకు పోవడంతో ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించారు. రహదారుల పక్కనే వ్యవసాయ బావులు ఉన్నాయి. వాహనాలు అదుపు తప్పితే పడిపోయే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

# గిలుసుకట్టు.. గంజాయి గుట్టు!

గోదావరిఖని : ఇటీవల రామగుండం కమిషనరేట్ పరిధిలో 120 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్లు పట్టుకుని 17 మందిని అరెస్టు చేశారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ సౌత్ వెస్ట్‌జోన్ పోలీసులు ఇటీవల 160 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఇందులో పెద్దపల్లికి చెందిన వ్యక్తిని కీలక సూత్రధారిగా గుర్తించారు. కరీంనగర్‌లో రెండ్రోజుల కిందట 1,460 గ్రాముల గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్ర వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. ఉమ్మడి జిల్లాలో నెలకు సగటున 10 గంజాయి కేసులు నమోదవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో గంజాయి వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతోంది. వ్యసనం బారిన పడినవారే కాదు.. అక్రమ రవాణాదారులు కూడా పెరుగుతున్నారు. మత్తు పదార్థానికి అలవాటుపడిన వారే కొందరు వ్యసనం తీర్చుకునేందుకు అయినట్లు ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తెచ్చి విక్రయించడం ప్రారంభిస్తున్నారు. వారు గంజాయి తీసుకు రావడానికి వెళ్లే ముందే వ్యసనపరులు ఒకరి ద్వారా ఒకరు గొలుసు కట్టుగా రవాణాదారుకు డబ్బు చెల్లిస్తున్నారు. ఇటీవల పలు కేసుల్లో విచారణ సందర్భంగా పోలీసులు ఈ విషయం గుర్తించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన గంజాయిని ఉమ్మడి జిల్లా పోలీసులు ఎప్పటికప్పుడు పట్టుకుంటున్నా.. అంతకు నాలుగింతలు వ్యసనపరులకు చేరుతోందని సమాచారం.

**వాట్సప్ గ్రూపులు.. కోడ్‌లు**

గంజాయి రవాణాదారులు, మత్తుకు అలవాటుపడ్డ వారికి ప్రత్యేకంగా వాట్సప్ గ్రూపులున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇలాంటి గ్రూపులు 200 వరకు ఉంటాయని అంచనా. కేవలం వారికి పరిచయం ఉన్న వారితోనే కోడ్‌ల ద్వారా సమాచారం ఇస్తారు. ఒక్కో ప్రాంతంలో 10 నుంచి 20 మంది వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని సరకు వచ్చిన వెంటనే అందులో సమాచారాన్ని పోస్టు చేస్తారు. కొద్దిసేపటిలోనే ఎవరెవరికి ఎంత చేరాలో



ప్యాకెట్ల ద్వారా వెళ్లిపోతోంది. అక్రమ రవాణాదారులు ఎప్పటికప్పుడు కొత్తవారు వస్తుండటంతో పోలీసులు వారిని గుర్తించే లోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది.

**పూర్తి స్థాయి తనిఖీలు లేక..**

రాష్ట్ర సరిహద్దుల వద్ద తనిఖీల్లో డొల్లతనం గంజాయి అక్రమ రవాణాకు కారణమవుతోంది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల ద్వారా ఉమ్మడి జిల్లాకు గంజాయి ఎక్కువ తెస్తున్నారు. సరిహద్దు తనిఖీ కేంద్రాల్లో అనుమానం వస్తే లేదా ఏదైనా వాహనంపై ప్రత్యేక సమాచారం వస్తేనే నిశితంగా పరిశీలిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో తనిఖీలు ఎలా సాగుతున్నాయో ముందు ఒకసారి వాహనంలో వెళ్లి పరిశీలించి వస్తున్న అక్రమ రవాణాదారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకుని గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. వాసన బయటకు రాకుండా ప్లాస్టిక్ కవర్లతో గట్టిగా ప్యాకింగ్ చేసి ఆన్‌లైన్ మార్కెటింగ్ వస్తువుల మాదిరిగా రవాణా చేస్తున్నారంటున్నారు. సరిహద్దు తనిఖీ కేంద్రాల్లో నిశిత పరిశీలన చేస్తేనే గంజాయిని పూర్తి స్థాయిలో అరికట్టగలమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గంజాయి దందాపై రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝాను సంప్రదించగా నిఘా పెంచుతామని, డ్రగ్స్ కంట్రోల్ టీంలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. సరిహద్దుల నుంచి రవాణా కాకుండా ప్రత్యేక తనిఖీలు చేపట్టడంతో పాటు మత్తుకు అలవాటు పడ్డ వారిలో మార్పు తేవడానికి ప్రయత్నిస్తామన్నారు. మత్తుకు బానిసలుగా మారిన వారిని మానిపిస్తే రవాణా చేసే వారు తగ్గుతారని, రవాణాను పూర్తిగా నివారించేందుకు అన్ని కోణాల్లో విశ్లేషించి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేస్తామన్నారు.

# కానరాని మరమ్మతులు.. తరచూ లీకేజీలు



కరీంనగర్ : జిల్లాలోని మున్సిపాలిటీలు, నగరపాలికల్లో తాగునీటి అవసరాలు పెరిగాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో మున్సిపల్ సరఫరా చేసే నీటిపై ఆధారపడుతున్నారు. పట్టణాల్లో దినం విడిచి దినం కుళాయినీరు సరఫరా చేస్తుండగా కరీంనగర్‌లో మాత్రం పలు ప్రాంతాల్లో రోజూ నీటి సరఫరా చేస్తున్నారు. హౌసింగ్‌బోర్డు రిజర్వాయర్ పరిధిలో నిరంతర నీటి సరఫరా జరుగుతుంది. ఉదయం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు నీటి పంపిణీ చేస్తున్నారు. ఒక రోజు నల్లానీరు రాకపోతే నగరవాసులు ఆందోళన చెందుతున్నారు.

**చెడిపోతున్న వాల్వులు**

రిజర్వాయర్ల నుంచి వీధుల్లోని నల్లా కనెక్షన్లకు శుద్ధి నీరు పంపిణీ చేయాలంటే కంట్రోల్ వాల్వులు తప్పనిసరి. వీటిని పలుమార్లు తిప్పడంతో రాడ్ అరిగిపోతుంది. ఎప్పటికప్పుడు ప్యాకింగ్ తాడు, ఇతర విడిభాగాలు వేయాల్సి ఉండగా వేయకపోవడం, సామగ్రి కొరత ఉండటతో రోజుల తరబడి అలాగే వదిలేస్తున్నారు. దాంతో నల్లా వచ్చేంత సేపు భారీస్థాయిలో నీరంతా రోడ్లపైకి వస్తుంది. ఈ విషయం సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. కాగా ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లగా వేసవి దృష్ట్యా మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు.

**రోడ్లపై ప్రవాహం**

నగరంలోని ప్రధాన, అంతర్గత రహదారులపై శుద్ధజలం పరుగులు పెడుతుంది. నెలల తరబడి నీరు ప్రవహిస్తుండగా వెంటనే మరమ్మతులు చేయడం లేదు. స్మార్ట్‌సిటీ రోడ్ల మధ్యలో ఉన్న పైపుల జాయింట్లు ఊడిపోయి నీరంతా బయటకు వస్తోంది. దీనిని పరిష్కరించాలంటే సీసీ రోడ్డు పగులకొట్టాల్సి రావడంతో అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. ప్యాచ్ వర్క్ చేయడం సాధ్యం కాదనే ఉద్దేశంతో ఆ లీకేజీలను అలాగే వదిలేస్తున్నారు. కొత్తగా హౌసింగ్‌బోర్డు కాలనీలో లెక్కలేనన్ని లీకేజీలు ఏర్పడుతున్నాయి. నిరంతర నీటి సరఫరా కావడంతో ఎక్కువ సంఖ్యలో సమస్యలు వస్తున్నాయి.

**సరఫరాలో అంతరాయం** గౌతమినగర్ రిజర్వాయర్ పరిధిలో తరుచుగా వాల్వులు చెడిపోతుండటంతో తాగునీటి సరఫరా నిలుస్తోంది. గత రెండు నెలలుగా పలు చోట్ల వాల్వులు చెడిపోగా మరమ్మతులు చేయడంలో తీవ్రమైన జాప్యం చేస్తున్నారు. మళ్లీ బైపాసు రోడ్డులో వాల్వు చెడిపోయింది. దాంతో ఆరు డివిజన్ల ప్రజలకు నీటి సరఫరా నిలిచిపోవడంతో ఆయా ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండాకాలం రావడంతోనే సాంకేతిక సమస్యలు రావడం ఏమిటని స్థానికులు ఆగ్రహిస్తున్నారు.

# కలికోట.. పనులు వేగవంతం



సిరిసిల్ల : గోదావరి జలాలతో రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాల పరిధిలో 40వేల ఎకరాల కొత్త ఆయకట్టు ఏర్పడనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా జిల్లాలో పూర్తిస్థాయిలో సాగునీరందని పరిస్థితి. శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం ఎత్తిపోతలతో కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాలకు సాగునీటి కలసాకారం కానుంది. 2006లో పనులు ప్రారంభం కాగా పొడగిస్తూ వచ్చిన ఈ పనులు 2018లోనే పూర్తికావాలి. చందుర్తి మండలం మల్యాల పంపుహౌజ్‌లో 2018లో ట్రయల్‌రన్ నిర్వహించారు. అప్పటి నుంచి అసంపూర్తి పనులు ఉన్నా.. రుద్రంగి మండలం నాగారం చెరువులోకి గొలుసుకట్టు చెరువుల్లో నీటిని నింపుతూ వచ్చారు. సాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు చేపడుతున్న ప్యాకేజీ పనుల్లో రూ.173.26 కోట్లతో జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం కలికోట సూరమ్మ చెరువు అభివృద్ధి చేపట్టాల్సి ఉండగా అవి నిలిచిపోయాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో కలికోట సూరమ్మ చెరువు పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. వచ్చే ఖరీఫ్‌లో పనులు పూర్తిచేసి ఆయకట్టుకు నీరందించేలా పనులు వడివడిగా సాగుతున్నాయి.

**సామర్థ్యం పెంపు**

ఎల్లంపల్లి ఎత్తిపోతలు ప్యాకేజీ-2లో రుద్రంగి మండలం నాగారం, కథలాపూర్ మండలం కలికోట సూరమ్మ చెరవుల సామర్థ్యం పెంచాలి. 2018లోనే నాగారం చెరువులోకి నీటిని వదిలారు. ఇక కథలాపూర్ మండలంలోని కలికోట సూరమ్మ చెరువు 0.15 టీఎంసీల సామర్థ్యం నుంచి 0.45 టీఎంసీలకు పెంచుతున్నారు. దీనికోసం శిఖంతో కలిపి 800 ఎకరాలను సేకరించారు. దీనిలో రూ.5 కోట్ల మేరకు పరిహారం చెల్లించాల్సి ఉంది.

**భూసేకరణ కీలకం**

రుద్రంగి, కథలాపూర్, బీమారం, మేడిపల్లి మండలాలకు సాగునీరందించే ఈ జలాశయం కింద కాల్వల నిర్మాణానికి భూసేకరణే కీలకం కానుంది. ఎక్కడా పెద్ద జలాశయాలు లేకపోవడం వల్ల ఒకే చోట భారీ ఎత్తున భూసేకరణ అవసరముండదు. అయితే చెరువు నుంచి కుడి, ఎడమ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు, మేజర్, మైనర్ కాల్వలు 32 కిలోమీటర్ల మేర కాల్వల తవ్వకాలు చేపట్టాలి. దీనికి ఒక్కో రైతుకు చెందిన గుంట భూమి నుంచి గరిష్ఠంగా అయిదు ఎకరాల వరకు సేకరించాల్సి ఉంటుంది. దీనికోసం భూసేకరణకు సుమారు రూ.80 కోట్ల అవసరమని గుర్తించారు. దీనిలో రూ.10కోట్లు ఇప్పటికే ప్రభుత్వం నుంచి విడుదలై జగిత్యాల కలెక్టర్ వద్ద ఉన్నాయి.

**నెరవేరనున్న అన్నదాతల కల**

వేములవాడ నియోజకవర్గంలో మెట్టప్రాంతమైన చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట కథలాపూర్, బీమారం, మేడిపల్లి మండలాల్లో ఎక్కువగా వర్షాధారంగా పంటలు సాగవుతాయి. భూగర్భజలాలు అడుగంటితే పంటలు చేతికందడం కష్టం. దీని సమీపంలోని కోరుట్ల నియోజకవర్గంలో కోరుట్ల, ఇబ్రహీంపట్నం, మెట్పల్లి మండలాలకు ఎస్సారెస్పీ నీరు వస్తున్నా అది కొన్ని గ్రామాలకే పరిమితం. కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు పూర్తయితే వేములవాడ నియోజకవర్గంలోని మండలాలన్నింటికీ గోదావరి జలాలు అందనున్నాయి. ఈ ప్రాజెక్టుకు లిఫ్ట్ ఏర్పాటు చేసి ఎగువన ఉన్న మానాలలోని కొత్త, పాత చెరువులను నింపేందుకు ఇటీవల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆమోదం లభిస్తే మానాలలోని ఎనిమిది తండాలకు నీటి కష్టాలు తీరుతాయి.

జూన్‌లోగా పూర్తి

జలాశయం పనులు జూన్‌లోగా పూర్తిచేసి నీటిని నింపేలా ప్రణాళికలు చేస్తున్నాం. భూసేకరణ విషయం ఉన్నతాధికారుల పరిధిలో ఉంది. నిధుల విడుదలతో పరిహారం పంపిణీచేసి పనులు ప్రారంభిస్తాం. సంతుప్రకాశ్, ఈఈ ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం

# ఆ 50 ఎకరాలు భూదాన్ బోర్డువే

హైదరాబాద్ : హైదరాబాద్ శివారులోని మహేశ్వరం మండలం నాగారంలో వివాదాస్పదంగా మారిన 50 ఎకరాల భూమి భూదాన్ బోర్డుదేనని తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ధ్రువీకరించింది. ఈ భూములను భూదాన్ భూములుగా రెవెన్యూ రికార్డుల్లో మార్చాలంటూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసింది. ఈ వ్యవహారంలో రికార్డులు మార్చారంటూ రెవెన్యూ అధికారులే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండేళ్లక్రితం 50 ఎకరాల భూదాన్ భూముల్లో 42 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు బదలాయించారన్న ఆరోపణలొచ్చాయి. అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్, ఆర్డీవో వెంకటాచారి, తహసీల్దార్ జ్యోతి అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై మహేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ కొనసాగుతుండగానే...ఈడీ అధికారులు గతేడాది వారికి ముందస్తుగా తాఖీదులు జారీచేసి విచారించారు. ఈ ముగ్గురూ అక్రమాలకు పాల్పడినట్టు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. విచారణ కొనసాగిస్తున్నారు. భూదాన్ యజ్ఞ బోర్డు సేకరించిన రికార్డుల ఆధారంగా.. వీరు ప్రైవేటు వ్యక్తులకు అక్రమంగా భూములు బదలాయించారని తేలింది. దీంతో పోలీసులు, ఈడీ అధికారులు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.



**వివాదాలు... అక్రమాలపై ఫిర్యాదులు**

నాగారం రెవెన్యూ పరిధి సర్వేనంబర్‌లో 181, 182లో 103.22 ఎకరాల భూమిని కలిగిన మహ్మద్ హాజీఖాన్ అందులో 50 ఎకరాలను భూదాన్ యజ్ఞ బోర్డుకు 1956లో విరాళంగా ఇచ్చారు. మిగిలిన 53.22 ఎకరాల భూమిని హాజీఖాన్ వారసులు వేర్వేరు వ్యక్తులకు విక్రయించారు. అందులో విరాళంగా ఇచ్చిన భూములూ ఉన్నాయి. రెవెన్యూ అధికారులు మాత్రం భూదాన్ యజ్ఞ భూములేనని చెప్పడంతో 13 ఏళ్ల క్రితం వివాదం మొదలైంది. హాజీఖాన్ వారసులు, వారి నుంచి భూములు కొనుగోలు చేసిన వారు కోర్టులను ఆశ్రయించారు. బోర్డు అధికారులు రికార్డులన్నీ పరిశీలించి సర్వే నంబర్ 181, 182లలో 50 ఎకరాలు బోర్డువేనని సబ్‌డివిజన్ నంబర్లతో 3నెలల క్రితం హైకోర్టుకు సమర్పించారు.

# నాబార్డు రుణ ప్రణాళిక ఖరారు

జగిత్యాల : జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు(నాబార్డు) ద్వారా జిల్లాలో 2025-26 సంవత్సరంలో అమలుచేసే వార్షిక రుణప్రణాళికను అధికారులు ఖరారు చేశారు. నూతన ఆర్థిక సంవత్సరంలో అధిక భాగంగా వానాకాలం, యాసంగిల్లో రైతులకు పంటరుణాలు, అనుబంధ టర్మ్‌రుణాలుగా ఇవ్వనున్నారు. భూముల అభివృద్ధి, నీటిపారుదల సౌకర్యాల కల్పన, యంత్రాల కొనుగోలు, వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పన, పాడిగేదెలు, కోళ్లు, గొర్రెలు, మేకలు, చేపల పెంపకానికి రాయితీలతో కూడిన రుణాలను అందించనున్నారు. వ్యవసాయరంగం తదుపరి మధ్య, చిన్నతరహా పరిశ్రమలకు, గృహాలు, విద్యారుణాలు, సంప్రదాయేతర



ఇంధన వనరులు, ఇతర సామాజిక వనరుల కల్పనకు నిధులను కేటాయించారు. ఇటీవల యాంత్రీకరణ, ఉద్యానశాఖ పథకాలకు ఆశించినట్లు రుణమంజూరు లేకపోగా నాబార్డు కేటాయించిన ప్రకారం జిల్లాలోని ఆయా శాఖలద్వారా లబ్ధిదారులకు రాయితీలు పంపిణీచేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

**లక్ష్యం మేరకు పంపిణీకి చర్యలు**

నూతన ఆర్థిక సంవత్సరంలో నాబార్డు ద్వారా లక్ష్యాన్నిదాటి రుణాలిచ్చేలా చర్యలు తీసుకుంటాం. అన్ని శాఖల అధికారుల సహకారంతో బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు రాయితీ రుణాలను చేరవేస్తాం. రామ్‌కుమార్, లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్

# సర్కారు బడుల ఆధునిక బాట

సంగారెడ్డి : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు బోధన చేసేందుకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-కృత్రిమ మేధ) సాయంతో ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తొలుత రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేశారు. అక్కడ విజయవంతం కావడంతో అన్ని జిల్లాల్లో అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం నిపుణులైన ఆర్పీలకు హైదరాబాద్‌లో రెండు రోజుల క్రితం శిక్షణ ఇచ్చారు. సంగారెడ్డిలో ఏఐ కింద ఎంపికైన 33 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

**సామర్థ్యాల ఆధారంగా విభజన**

ప్రాథమిక తరగతుల విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, గణితంలో వెనుకబడుతున్నారు. వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధ సాయంతో 3, 4, 5 తరగతుల విద్యార్థుల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ నెల 15 నుంచి ఎంపిక చేసిన 33 పాఠశాలల్లో కృత్రిమ మేధ అమలు చేయనున్నారు. ఉ



న్నత పాఠశాలలకు సమీపంలోని ప్రాథమిక పాఠశాలలను మాత్రమే మొదటి విడత కింద ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో సామర్థ్యాల ఆధారంగా విద్యార్థులను విభజించారు. 'ఏ' గ్రేడ్ కింద 829, 'బి' గ్రేడ్-423, 'సి' గ్రేడ్-1029 మంది విద్యార్థులు ఉన్నారు.

**బృందాలుగా ఏర్పాటు**

ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో పిల్లలను ఆకట్టుకునేలా కృత్రిమ మేధతో బోధన ఉంటుంది. 3 నుంచి 5 తరగతుల విద్యార్థులను ఒక బ్యాచ్‌గా ఏర్పాటు చేస్తారు. ఒక్కో బ్యాచ్‌కు తెలుగు వాచకం, గణితం అభ్యసన సామర్థ్యాలపై ఏఐ ఆధారిత బోధన ఉంటుంది. ఈ పాఠాన్ని విద్యార్థి అర్థం చేసుకుంటున్నాడా? లేదా? అని విషయాన్ని ఏఐ గుర్తిస్తుంది. పాఠం అర్థం కాకుంటే సరళమైన మార్గంలో.. మెరుగైన పద్ధతిలో బోధన అందిస్తుంది. ఇలా ప్రతి విద్యార్థి సామర్థ్యాలను మెరుగు పరిచేలా చర్యలు తీసుకుంటారు.

**విద్యార్థులకు ఉపయుక్తం-వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి**

ఏఐ బోధన విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది. తొలుత జిల్లాలోని 33 పాఠశాలల్లో అమలు చేయనున్నాం. విద్యార్థులకు దగ్గరుండి ఏఐతో బోధన చేయాలి. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి.

# చౌక బియ్యం పంపిణీలో ఆలస్యం

హుస్నాబాద్: జిల్లాలో ఈ నెల చౌక ధరల దుకాణాల్లో రేషన్ బియ్యం పంపిణీ ఆలస్యం అవుతోంది. ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యం నిల్వలు లేక పోవడం, రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ కోసం ప్రభుత్వం చేస్తున్న ముందస్తు చర్యలే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఇప్పటివరకు కొన్ని రేషన్ దుకాణాలకు సరఫరా కాలేదు.

**సన్నాల సరఫరా కోసమేనా?**

దుకాణాలకు సాధారణంగా ప్రతి నెల 20వ తేదీలోపు బియ్యం అలాట్‌మెంట్లు వస్తాయి. 30వ తేదీ వరకు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి చౌకధరల దుకాణాలకు సరఫరా చేస్తారు. 1 నుంచి గ్రామాల్లో డీలర్లు కార్డుదారులకు పంపిణీ చేస్తుంటారు. మార్చి నెలకు సంబంధించి గత నెల 26న బియ్యం కేటాయింపులు చేశారు. 27 నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లలో నిల్వలను దుకాణాలకు పంపిణీ చేశారు. అవి కొన్ని దుకాణాలకే సరిపోయాయి. ఇతర జిల్లాల నుంచి బియ్యం తెప్పిస్తున్నారు. సన్న బియ్యం కార్యక్రమం ప్రారంభించే నాటికి ఎంఎల్ఎస్ పాయింట్లలో దొడ్డు బియ్యం నిల్వలు ఉండకుండా చేసేందుకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. బియ్యం నిల్వలన్నీ అయిపోయిన తర్వాత అవసరాన్ని బట్టి సర్దుబాటు చేస్తున్నట్లు చెబుతున్నారు. దొడ్డు బియ్యం నిల్వలు లేకుండా చేయాలనేది ప్రభుత్వ ఆలోచన అని తెలుస్తోంది.

**బోధన్, కామారెడ్డిల నుంచి..**

హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల్లో 99 రేషన్ షాపులు ఉన్నాయి. 850 టన్నుల బియ్యం అవసరం. ఇక్కడి గోదాములో బియ్యం నిల్వలు కొన్ని దుకాణాలకు సరఫరా చేశారు. మిగతా వాటి కోసం బోధన్, కామారెడ్డితో పాటు జిల్లాలోని విఠలాపూర్ నుంచి తెప్పిస్తున్నారు. కేటాయింపుల మేరకు గ్రామాలకు తరలిస్తున్నారు. ఇప్పటివరకు 85 దుకాణాలకు బియ్యం సరఫరా చేయగా అక్కడ కార్డుదారులకు పంపిణీ ప్రారంబించారు.

**రెండు మూడు రోజుల్లో పూర్తి-ప్రవీణ్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్**

గోదాముల్లో నిల్వలు అయిపోయాయి. ఇతర ప్రాంతాల నుంచి తెప్పిస్తున్నాం. జిల్లాలో 85 శాతం దుకాణాలకు బియ్యం సరఫరా చేశాం. రెండు మూడు రోజుల్లో మిగిలిన అన్ని దుకాణాలకు అందిస్తాం.

# తోడేస్తున్నారు.. తవ్వేస్తున్నారు

హైదరాబాద్: నగరంలో భూగర్భజలాలు అడుగంటుతుండటంతో వందల సంఖ్యలో బోర్లు ఎండిపోతుండగా మరోవైపు భారీ సంఖ్యలో కొత్తవి తవ్వుతున్నారు. పాత వాటిలో నీరు రాకపోవడంతో భారీ లోతుతో కొత్తవి వేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పుడే భూగర్భజలాల పరిస్థితి ఇలా ఉంటే మున్ముందు ఎలాంటి ఇబ్బందులు వస్తాయో అనే ఆందోళనతో 1500 అడుగులు దాటి బోర్లు వేస్తుండటం గమనార్హం. సాధారణంగా నగరంలో కొత్తగా వేస్తున్న బోర్లు వెయ్యి అడుగుల నుంచి 1200 అడుగులు ఉంటుండగా ఇప్పుడు నిర్మాణాల సంఖ్య, డిమాండ్ ఆధారంగా లోతును పెంచేస్తున్నారు. బోర్‌వెల్స్‌కు డిమాండ్ పెరిగి.. మూడు నాలుగు రోజులపాటు వేచి ఉండాల్సి వస్తోంది.



**1200 అడుగులు వేస్తేనే..**

ప్రధానంగా కూకట్‌పల్లి, మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, పుప్పాలగూడ, మణికొండ, జూబ్లీహిల్స్, ఎస్సార్‌నగర్, అమీర్‌పేట, కుత్బుల్లాపూర్, నిజాంపేట, ప్రగతినగర్ తదితర ప్రాంతాల్లో భూగర్భజలాలు తగ్గడంతో కొత్త బోర్లతో సమస్య నుంచి గట్టెక్కేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. లేదంటే రోజుకు రెండు మూడు ట్యాంకర్లను కొనాల్సిన పరిస్థితి. నగరంలో అత్యధిక ప్రాంతాల్లో 600 అడుగుల నుంచి 800 అడుగుల మేర బోరు వేస్తే సరిపోయేది. కానీ ఇప్పుడు కనీసం 1200 అడుగులు వేస్తే తప్ప నీటికి భరోసా ఉండటం లేదని ఆందోళన చెందుతున్నారు. అపార్ట్‌మెంట్లలో అయితే 1200- 1500 అడుగులు సాధారణంగా మారిందని చెబుతున్నారు.

**రూ.6 లక్షలు ఖర్చు చేస్తే.. 10 రోజులే నీళ్లు**

నగరంలోని ఓ ప్రధాన ప్రాంతంలో ఉన్న హాస్టల్లో ఇటీవల బోరు ఎండిపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో 1500 అడుగుల మేర కొత్త బోరు వేస్తే పదిరోజులు నీళ్లు వచ్చాయి. తర్వాత చుక్కనీరు రాకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. సుమారు రూ. 6లక్షలు వ్యయం చేసినా ఫలితం లేకపోగా ట్యాంకర్ల కోసం తిప్పలు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

# చెరువులు నిండక.. పొలాలు ఎండి

చేగుంట: కాలువల నిర్మాణంలో ఏళ్లుగా తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇవి పూర్తికాకపోవటంతో కాళేశ్వరం నుంచి వచ్చే గోదావరి జలాలు చెరువుల్లోకి వెళ్లటంలేదు. దీంతో పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. కొండపోచమ్మసాగర్ నుంచి చేగుంట, నార్సింగి, చిన్నశంకరంపేట, రామాయంపేట మండలాలకు నీళ్లు వస్తే చెరువులు, కుంటలు నిండి రైతులకు ఎంతో మేలు చేకూరే అవకాశం ఉంది. కానీ కాలువల నిర్మాణం పూర్తిచేస్తేనే ఇది సాధ్యపడుతుంది.

**అసంపూర్తిగా పనులు**

మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నుంచి రామాయంపేట, చిన్నశంకరంపేట వరకు కెనాల్‌లు ఉన్నాయి. దౌల్తాబాద్ మండలం మీదుగా చేగుంట, నిజాంపేట, రామాయంపేట, చిన్నశంకరంపేట మండలాల్లోని గ్రామాల మీదుగా కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు నాలుగేళ్ల క్రితం పనులు ప్రారంభించినా ఇంత వరకు పూర్తికాలేదు. కొన్నిచోట్ల పూర్తిచేసినా.. మరికొన్ని చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. కాలువల నిర్మాణం కోసం రహదారులపై వంతెనలు నిర్మాణం కూడా పూర్తి చేశారు. కొన్నిచోట్ల కాలువలు



తవ్వినా.. సిమెంట్ లైనింగ్ వేయకుండా వదిలేశారు. దీనివల్ల నీరు ప్రవహించని పరిస్థితి నెలకొంది.

**50 వేల ఎకరాలకు మేలు**

గొల్లపల్లి, కరీంనగర్, రుక్మాపూర్, చిట్టోజీపల్లి, భీంరావుపల్లి, రెడ్డిపల్లి, వల్లూరు మీదుగా చిన్నశంకరంపేట కెనాల్ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రస్తుతం రామాయంపేట కెనాల్ నుంచి మాత్రమే కొండపోచమ్మసాగర్ నీళ్లు వస్తున్నాయి. బోనాల, బి.కొండాపూర్, ఇబ్రహీంపూర్ కిష్టాపూర్, పులిమామిడి, నిజాంపేట మండలం నార్లాపూర్, రాయలాపూర్ తదితర గ్రామాలకు నీళ్లు వెళ్తున్నాయి. చిన్నశంకరంపేట కెనాల్ పనులు త్వరగా పూర్తిచేస్తే పలు మండలాల రైతులకు యాసంగిలో మేలు జరగనుంది. నాలుగు మండలాల్లో కెనాల్ నిర్మాణాలు పూర్తిచేస్తే సుమారు 50 వేల ఎకరాలకు మేలు చేకూరుతుంది. దుబ్బాక, మెదక్ ఎమ్మెల్యేలు శ్రద్ధ చూపిస్తే ఇవి పూర్తికావటానికి అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

**కుంటల్లోకి నీళ్లు రాక..**

నాలుగు మండలాల్లో కాలువల నిర్మాణం పూర్తిచేస్తే 50 వరకు చెరువులు నిండి వేల ఎకరాలకు ప్రయోజనం ఉంటుంది. చిన్నశంకరంపేట కెనాల్ చాలా చోట్ల అసంపూర్తిగానే ఉంది. రాంపూర్ చెరువులో నుంచి భూగర్భ కాలువ నిర్మాణం చేపట్టి పూర్తిచేశారు. కానీ ఆ కాలువ నీళ్లు రాంపూర్ చెరువులోకి రాని పరిస్థితి నెలకొంది. తమ చెరువు నింపకుండా కాలువ నిర్మాణం ఎలా చేపడతారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ సమస్య పరిష్కరిస్తే చాలా గ్రామాలకు నీళ్లు చేరనున్నాయి.

# ఒక్క బిడ్డా పుట్టలేదు..




హైదరాబాద్ ప్రైవేటుకు దీటుగా రూ.లక్షలు పెట్టి అందుబాటులోకి తెచ్చిన కృత్రిమ గర్భధారణ సేవలు (ఐవీఎఫ్) పడకేశాయి. నిధుల కొరత కారణంగా ఇప్పటివరకు ఒక్క జంటకు కూడా ఈ సేవలను అందించలేకపోయారు. ఐవీఎఫ్ సేవలకు కార్పొరేట్, ప్రైవేటు సెంటర్లు రూ.లక్షలు వసూలు చేస్తున్నాయి. పేదలకు ఇది ఆర్థిక భారమే. ఇలాంటి వారి కోసం పైసా ఖర్చు లేకుండా సంతాన సాఫల్యాన్ని కల్పించేందుకు ప్రభుత్వం గతంలో రూ.కోట్లతో గాంధీ ఆస్పత్రితోపాటు పేట్లబుర్జు, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రుల్లో ఇన్ విట్రో ఫెర్టిలిటీ(ఐవీఎఫ్) సెంటర్లను ఏర్పాటు చేసింది. ఇటీవల వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గాంధీ ఆసుపత్రిని సందర్శించి తక్షణమే ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నిధుల కొరతతో ఐవీఎఫ్ సేవలు సాగడం లేదు. ఇలా 100 జంటల వరకు ఎదురు చూస్తున్నట్లు తెలుస్తోంది.

**ఆధునిక ల్యాబ్ వసతి...**

గాంధీ ఎంసీహెచ్ భవనం ఐదో అంతస్తులో ఐవీఎఫ్ సెంటర్‌ను అధునాతన పరికరాలు, అత్యంత సౌకర్యవంతమైన వసతులతో కార్పొరేట్‌కు దీటుగా రూపొందించారు. కోజికోడ్, తిరువనంతపురంతోపాటు దేశంలోని పలు ఫెర్టిలిటీ సెంటర్లను పరిశీలించి దీన్ని తీర్చిదిద్దారు. ఎంబ్రియాలజీ ల్యాబ్, ఐవీఎఫ్ ఆపరేషన్ థియేటర్, ఆండ్రాలజీ ల్యాబ్‌లతోపాటు ఫలదీకరణ చేసేందుకు అవసరమైన ఆధునిక ఎక్విప్‌మెంట్, సెమన్ ఎనాలసిస్ యంత్రాలు, రీఏజెంట్స్ (ద్రావకాలు) దయాగ్నోస్టిక్ హిస్టరీ లాప్రోస్కోపీ, అల్ట్రాసౌండ్, కంట్రోల్ వేరియంట్, హైపర్ స్టిమిలేషన్ (సీఓవీ)లను సమకూర్చారు. గాంధీలో కేవలం ఇంట్రా యుటెరిన్ ఇన్‌సెమినేషన్ (ఐయూఐ) మాత్రమే చేస్తున్నారు. వీర్యాన్ని ల్యాబ్‌లో శుద్ధి చేసి భార్య గర్భాశయం వద్ద నేరుగా ప్రవేశపెడతారు. ఐవీఎఫ్‌తో పోల్చితే ఇది తేలికైన విధానం.

**ముందుకు సాగని ప్రక్రియ..**

ఐవీఎఫ్ ప్రక్రియ చాలా క్లిష్టంగా ఉంటుంది. మహిళ నుంచి అండాలను సేకరించి వాటిని ల్యాబ్‌లో ఫలదీకరణ చేయాలి. ఇందుకోసం అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఐవీఎఫ్ కోసం కల్చర్ మీడియంలు, మందులు, డిస్పోజబుల్ కేథటార్లు ఇతర సామగ్రి సమకూర్చుకోవాలి. ఇందుకు ఒక్కో ఐవీఎఫ్‌కు కనీసం రూ. 1.5 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు అవసరం. వీటికి సంబంధించి టెండర్లు ముందుకు సాగకపోవడంతో నిరీక్షణ తప్పడం లేదు. సెమన్ ఎనాలసిస్ చేసి అండాన్ని బతికించి ఈ రెండింటిని కలిపి ఎంబ్రియాలజీ ల్యాబ్‌లో అనుకూలమైన వాతావరణ పరిస్థితుల మధ్య కనీసం 6 రోజులు ఉంచిన తర్వాత పిండాన్ని మహిళ గర్భాశయంలో ప్రవేశ పెడతారు. గాంధీలో లెవల్-2 కేసులు మాత్రమే చేసే సౌలభ్యం ఉంది. దాతల నుంచి సేకరించి చేసే ఐవీఎఫ్ లెవల్-3 సేవలు అందుబాటులో లేవు. లెవల్-2 సేవలు ప్రారంభం కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని సంతాన భాగ్యం కోసం ఎదురు చూస్తున్న జంటలు కోరుతున్నాయి.

# ఇసుకాసురులు.. కలగదా కనువిప్పు?



హుజూరాబాద్ : ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రాత్రింబవళ్లు తేడా లేకుండా వ్యాపారులు దందా నిర్వహిస్తున్నారు. రెవెన్యూశాఖల అధికారులు సంయుక్తంగా కఠినంగా వ్యవహరిస్తే తప్ప దందా కట్టడి చేయలేని పరిస్థితి నెలకొంది.

ఇదీ పరిస్థితి మానేరు వాగులో ఇసుక విరివిగా లభిస్తోంది. దీన్ని ఆసరా చేసుకుంటున్న అక్రమార్కులు.. ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఓవైపు అధికారులు పట్టుకుంటున్నా.. మరోవైపు వ్యాపారులు మాత్రం తేలికగా తీసుకుంటూ తిరిగి దందా కొనసాగిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని వీణవంక మండలం చల్లూరు, మల్లారెడ్డిపల్లి, కోర్కల్, పోతిరెడ్డిపల్లి.. జమ్మికుంట మండలం విలాసాగర్, తనుగుల, గంద్రపల్లి, శంభునిపల్లి, వావిలాల, నగురం, నాగారం, కొండపాక, హుజూరాబాద్ పట్టణంతోపాటు మండలంలోని కందుగుల, చెల్పూరులతోపాటు పలుగ్రామాలకు చెందిన సుమారు 800కు పైగా ట్రాక్టర్లతో మానేరు నుంచి ఇసుకను రవాణా చేస్తున్నారు. దూరం, భవన నిర్మాణ అవసరాలను బట్టి వ్యాపారులు అడ్డగోలుగా ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. చల్లూరు నుంచి వీణవంక మండల కేంద్రానికి ఒక ట్రిపు ఇసుకకు రూ. 2 వేలు వసూలు చేస్తున్నారు. జమ్మికుంట, హుజూరాబాద్, శంకరపట్నం, సైదాపూర్ వంటి మండలాలకు ఒక ట్రిప్పు ఇసుకకు రూ. 4 వేల నుంచి రూ. 6 వేల వరకు వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు చెబుతుండటం అక్రమార్కుల దోపిడీకి అద్దం పడుతోంది. రాత్రి పగలు తేడా లేకుండా నిర్వహిస్తున్న ఈ ఇసుక దందాతో వ్యాపారులకు కాసులు కురుస్తున్నాయి.

ఇసుక రవాణా జరుగుతుండగా పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నారు. అయినా ఇసుకాసురుల్లో ఏమాత్రం మార్పు రావటం లేదు. ఇసుక అక్రమ రవాణాను నిర్మూలించాలంటే పోలీసు శాఖ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలి. నిరంతరం మానేరు పరివాహకం వద్ద రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు పర్యవేక్షిస్తుండాలి. ఈ అక్రమ వ్యాపారం నిర్వహించే వారిపై కేసులు నమోదు చేయడం, భారీ జరిమానా విధించడంతోపాటు కౌన్సెలింగ్ ద్వారా అవగాహన కల్పించాల్సి ఉంది. మళ్లీ నిబంధనలు ఉల్లంఘిస్తే ఉక్కుపాదం మోపాలని స్థానిక ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల్లో 39 కేసులు హుజూరాబాద్ డివిజన్ పరిధిలో రెండు నెలల్లో 39 కేసులు నమోదు చేశాం. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు. నిరంతరం గస్తీ పెంచుతున్నాం. అక్రమ రవాణాను నివారిం చేందుకు ప్రత్యేక దృష్టిపెట్టాం. శ్రీనివాస్‌జీ, ఏసీపీ

# 'అధి'కార్లు ఏం చేద్దాం..?

హైదరాబాద్: ప్రజాధనంతో కొనుగోలు చేసిన వాహనాలను జీహెచ్‌ఎంసీ ఇష్టారాజ్యంగా వినియోగిస్తోంది. అధికారం ఉంది కదా అని.. రవాణా విభాగంలోని ఇంజినీర్లు ప్రభుత్వ వాహనాలను వ్యక్తిగత అవసరాల కోసం వాడుకుంటున్నారు. ప్రస్తుత జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలోని ఓ ఉన్నతాధికారి వద్ద మూడు కొత్త ఇన్నోవా వాహనాలు ఉండగా.. బల్దియాలోనే పని చేస్తున్న మరో విభాగాధిపతి, ఐఎఫ్‌ఎస్ అధికారిణికి మాత్రం ఆరు నెలలుగా వాహన కేటాయింపు జరగట్లేదు. ఆమె ట్యాక్సీ సేవలను ఉపయోగించుకుంటున్నారు.

ట్యాక్సీ బిల్లు నిలుపుదల.. ప్రధాన బాధ్యతతోపాటు మరో మూడు ఇన్‌ఛార్జి పోస్టులను నిర్వర్తిస్తుండటంతో.. పోస్టుకు ఒకటి చొప్పున కారు ఉండాల్సిందేనని, కనీసం మూడు కార్లయినా ఉండాలంటూ ఆ ఉన్నతాధికారి పట్టుబడుతున్నారు. ఆయన వాహనాలను వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించుకుంటున్నారనే విమర్శలున్నాయి. తాజాగా రవాణా విభాగం అదనపు కమిషనర్ ఐఎఫ్‌ఎస్ అధికారి పెట్టిన ట్యాక్సీ బిల్లును నిలిపేశారు. ఈఎన్‌సీ అదనపు వాహనాలను రవాణా విభాగానికి అప్పగించడం లేదు. తన తర్వాత ఇన్‌ఛార్జి బాధ్యతలు తీసుకునే అధికారులకు వాటిని అప్పగిస్తానని ఆయన సమాధానం చెబుతున్నట్టు ఇంజినీర్లు చెబుతున్నారు.

**వాహనం ఖరీదుకు రెండింతలు..**

ఒకప్పుడు చెత్త తరలింపునకు జీహెచ్‌ఎంసీ దాదాపు 400 వాహనాలను ఉపయోగించేది. నిర్వహణ ఖర్చులే వాహనం ఖరీదుకు రెండింతలు,



అంతకుమించి అవుతుండటంతో కాలం చెల్లిన వాహనాలను తుక్కుగా మార్చేసింది. కొత్తవి కొనకుండా ప్రైవేటువి ఉపయోగిస్తోంది. ప్రస్తుతం బల్దియా వద్ద 100-120 చెత్త రవాణా వాహనాలే ఉన్నాయి. వాటినీ కొందరు ఇంజినీర్లు వదలట్లేదు. కవాడిగూడ యార్డు అవినీతికి అడ్డాగా మారింది. ప్రత్యేక అనుమతులు, మరమ్మతులకు ప్రతినెలా అక్కడి అధికారులు రూ. 35లక్షలు వెచ్చిస్తున్నారు. డీజిల్ కూపన్లను బంకుల్లో అమ్ముకోవడం, ఇంజిన్ ఆయిల్, గేర్ ఆయిల్, టైర్లు, ఇతర వస్తువులను బయటి వ్యక్తులకు విక్రయిస్తున్నారు.

# తగ్గుతున్న జలం.. ఉపాధిపై ప్రభావం

బోయినపల్లి : రాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు) నుంచి పంటల సాగుకు నీటి విడుదల కొనసాగుతుండటంతో జలాశయంలో రోజు రోజుకూ నీటి నిల్వలు తగ్గుతున్నాయి. జలాశయంలో మత్స్యకారులు చేపల వేటతో ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో నీటి నిల్వ తగ్గుతుండటంతో ఉపాధిపై ప్రభావం చూపుతోంది. మత్స్యకారులకు స్థానింగా ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏటా చెరువుల్లో చేప పిల్లలను, జలాశయాల్లో చేప, రొయ్య పిల్లలను వదులుతోంది. రాజరాజేశ్వర జలాశయంలో జలాశయంలో 80-100 గ్రాముల బరువు ఉన్న రాహు, బంగారు తీగ, బొచ్చె రకం నెల రోజుల వయసున్న పిల్లలను విడిచిపెడుతున్నారు. జలాశయం పరిధిలోని మత్స్యకారులు సాయంత్రం తెప్పలపై జలాశయంలోపలికి వెళ్లి వలలు అమర్చి తిరిగి ఉదయం వెళ్లి వలకు చిక్కిన చేపలను ఒడ్డుకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. కిలో నుంచి సుమారు 20 కిలోల వరకు బరువున్న చేపలు జలాశయంలో లభిస్తున్నాయి. గ్రామాల్లో చేపల విక్రయాల కోసం అనేక మంది టేలా



డబ్బాలు వేసుకొని ఉపాధి పొందుతున్నారు. వలకు చిక్కిన చేపలను కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడతోపాటు ఇతర పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారు. జలాశయంలో నీరు సమృద్ధిగా ఉన్న సమయంలో వలకు ఆశించిన స్థాయిలో చేపలు చిక్కడంతో ఉపాధి లభించిందని... ప్రస్తుతం నీటినిల్వ తగ్గడంతో చేపలు చిక్కడం లేదని మత్స్యకారులు అంటున్నారు. తమ ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలాశయ నిర్మాణంలో కొదురుపాక, నీలోజిపల్లి, వరదవెల్లి, శాభాష్‌పల్లి, సంకెపల్లి, రుద్రవరం, కొడుముంజ, అనుపురం, చీర్లవంచ, చింతల్‌ఠాణ, గుర్రంవాణిపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి రాజరాజేశ్వర జలాశయంలో 2017-18 ఆర్థిక సంవత్సరం నుంచి చేప, రొయ్య పిల్లలను వదులుతున్నారు జలాశయంలో ముంపునకు గురైన నిర్వాసితులు, మత్స్యకారులతోపాటు జలాశయం పరిధిలోని పది కిలోమీటర్లలోపు మత్స్యకారులు చేపల వేట కొనసాగిస్తూ ఉపాధి పొందుతున్నారు మధ్యమానేరు పరిధిలో 659 మంది మత్స్యకారులు లైసెన్స్‌లు కలిగి ఉన్నారువివిధ కారణాలతో జలాశయంలో చేప పిల్లలను ఆలస్యంగా వదిలారు. 14.24 లక్షల చేప పిల్లలను వదలగా వాతావరణ మార్పులు, జాప్యంతో రొయ్య పిల్లలను ఈ సారి వదల్లేదు.

చేపలు లభించడం లేదుజలాశయంలో నీరు తగ్గడంతో చేపలు వలకు చిక్కడం లేదు. నీరు తగ్గక ముందు రోజూ పది కిలోల వరకు చేపలు లభించేవి. ప్రస్తుతం రెండు కిలోలు లభించడమే గగనంగా మారింది. ఒక్కోరోజు వలకు చేపలు చిక్కకపోవడంతో నిరుత్సాహంగా ఒడ్డుకు తిరిగి రావాల్సి వస్తోంది. నీటి విడుదలతో చేపలు దిగువకు వెళుతున్నాయి. శ్రీనివాస్, మత్స్యకారుడు

**ఆర్థికంగా ఇబ్బందులు**

చేపలు లభించిన సమయంలో రోజుకు రూ. వెయ్యి వరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం రూ. 200 ఆదాయం లభించడమే గగనంగా మారింది. చేపలు ఆశించిన స్థాయిలో లభించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నీరు తగ్గడంతో ఉపాధిపై ప్రభావం చూపుతుంది. నీరు ఇంకా తగ్గితే ఇంకా లోపలికి వెళ్లి వలలు వేయాల్సి ఉంటుంది. అనిల్, మత్స్యకారుడు

## అనుమతులు ఇచ్చారు.. పర్యవేక్షణ మరిచారు

వేములవాడ : ప్రభుత్వ పనులకు సంబంధించి అధికారులు ఇసుక రవాణాకు అనుమతులు ఇస్తున్నారు. రవాణాపై పర్యవేక్షణ లేకపోవడంతో ఇసుక పక్కదారి పడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రవాణాదారులు ప్రభుత్వ పనులకు కాకుండా మరో చోటకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రహదారులు, మురుగు కాలువలు, భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. నిర్మాణాల్లో ఇసుక కొరత లేకుండా ఉండటానికి జిల్లా యంత్రాంగం ఇసుక రీచ్‌లను గుర్తించింది. వేములవాడ గ్రామీణ మండలంలో చేపడుతున్న ప్రభుత్వ పనులకు ఇసుక రవాణా చేసుకోవడానికి లింగంపల్లి మూలవాగు నుంచి అనుమతులు ఇస్తున్నారు. ఒక్కో ట్రాక్టరుకు రూ. 480 డీడీ చెల్లించాలి. డీడీతోపాటు ట్రాక్టరు నంబరు. డ్రైవర్ పేరు పూర్తి వివరాలతో తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. రెవెన్యూ అధికారుల పరిశీలన అనంతరం ఇసుక రవాణాకు అనుమతులు మంజూరు చేస్తున్నారు. మూలవాగు వద్ద తహసీల్దారు కార్యాలయం నుంచి ఒక ఉద్యోగి ఉండి రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేసుకొని వే బిల్లులు ఇస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికీ వాగులో నుంచి బయటకు వెళ్లిన ఇసుక ట్రాక్టరు గమ్యస్థానానికి చేరుకుంటుందో లేదో పర్యవేక్షణ ఉండటం లేదు.

పక్కదారి పడుతున్న ఇసుక

అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పనులు పూర్తి కావడానికి ఇసుక రవాణాలో ఇబ్బందులు ఉండకూడదని అధికారులు అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఇదే అదనుగా కొందరు ట్రాక్టరు రవాణాదారులు ఇసుకను పక్కదారి పట్టించి అధిక ధరకు గ్రామాల్లో విక్రయిస్తున్నారు. నిర్ణయించిన ప్రదేశంలో కాకుండా మరికొన్ని చోట్ల డంప్‌చేస్తున్నట్లు తెలుస్తోంది. అనుమతులు మంజూరు చేస్తున్న అధికారులకు ట్రాక్టర్లపై పర్యవేక్షణ ఉండటం లేదు. గ్రామాల్లో చేపడుతున్న గృహ అవసరాలకు ఇసుక కొరత ఉండటం వలన పలువురు రవాణాదారులు నిబంధనలు అతిక్రమించి ఇసుకను విక్రయిస్తున్నారు. మంగళవారం లింగంపల్లి నుంచి ఇసుక రవాణాకు అనుమతులు మంజూరు చేయగా అనుమతి పొందిన చోటకు కాకుండా ప్రైవేటు అవసరాలకు విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు చేపడతాం

గ్రామాల్లో చేపడుతున్న ప్రభుత్వ పనుల కోసం ఇసుక రవాణాకు అనుమతి ఇస్తున్నాం. రవాణాకు సంబంధించి పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం. ఇసుక పక్కదారి పడుతున్నట్లు మా దృష్టికి రాలేదు. పరిశీలన చేసి చర్యలు తీసుకుంటాం. అనుమతి పొందిన రవాణాదారులు నిబంధనలు పాటించాలి. అతిక్రమిస్తే చర్యలు తప్పవు. సుజాత, తహసీల్దారు

# సర్కారు బడికి కార్పొరేట్ హంగులు

వేములవాడ: విశాలమైన భవనం, ఆహ్లాదకరమైన ఆవరణ, విశాలమైన తరగతి గదులు, వీటన్నింటికీ తోడు ప్రతి సబ్జెక్టులో బోధించే ఉపాధ్యాయులు ఉండటంతో ఆ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలో చదివిన అనుభూతి కలుగుతోంది. రెండేళ్ల క్రితం సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)నిధులు రూ.5 కోట్లు వెచ్చించి హైదరాబాద్ యశోద ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేశారు. గతంలో ఉన్న భవనంపై మరో అంతస్తు నిర్మించి పాఠశాల మొత్తాన్ని ఆధునికీకరించారు. పాఠశాలలో దాదాపు 330 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు.



**ఆధునిక సౌకర్యాలు**

పాఠశాలలో ఆధునిక సౌకర్యాలను కల్పించారు. విశాలమైన తరగతి గదులతోపాటు మధ్యాహ్న భోజనం చేసేందుకు విశాలమైన డైనింగ్ హాల్, విద్యార్థులకు తాగునీటిని అందించేందుకు శుద్ధజల కేంద్రం, రీడింగ్ రూం, మరోవైపు ప్రయోగశాల, కార్యాలయం తదితర అన్ని వసతులను సమకూర్చారు. బాలురు, బాలికలకు ప్రత్యేకంగా శౌచాలయాలు, మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు ప్రత్యేకమైన వంటగది ఏర్పాటు చేశారు. దీంతో ఈ పాఠశాలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.

**విద్యార్థులకు చక్కటి బోధన- రాజారత్నం, ప్రధానోపాధ్యాయుడు**

పాఠశాలలో విద్యార్థులకు వసతులు పూర్తి స్థాయిలో మెరుగుపడ్డాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో చక్కటి విద్యాబోధన జరుగుతోంది. తగినంత మంది బోధన సిబ్బంది ఉన్నారు. ఉత్తమ బోధనతో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించే విధంగా శిక్షణ ఇవ్వడానికి పీడీ కూడా ఉన్నారు. విద్యార్థులను ఇక్కడి సదుపాయాలను వినియోగించుకొని ఉత్తమ లక్ష్యాలను సాధించాలి.

# అక్రమమని తెలిసినా.. చర్యలెక్కడ?


మల్యాల : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ భూముల అన్యాక్రాంతంపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. ముత్యంపేట శివారులోని సంతోష్ లొద్ది చెక్ డ్యాం కింది భాగంలో కొండగట్టు అంజన్న ఆలయం పేర విలువైన భూములున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో మల్యాలకు చెందిన ఓ వ్యక్తి దాదాపు 3 ఎకరాల భూమిని ఆక్రమించుకొని 25 ఏళ్లుగా మామిడితోట సాగు చేస్తున్నారు. ఈ విషయం ఇటీవల కొండగట్టు గిరి ప్రదక్షిణ కోసం చేపట్టిన దారి నిర్మాణ సమయంలో వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై రెండు నెలల కిందట కథనం ప్రచురించడంతో ఆలయ అధికారులు స్పందించి సదరు భూమిని స్వాధీనం చేసుకొని హద్దులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కోట్ల రూపాయల విలువైన ఆలయ



భూమి అన్యాక్రాంతమైనట్లు ఆలయ అధికారులు గుర్తించినప్పటికీ ఇంత వరకు కనీసం హద్దురాళ్లు కూడా ఏర్పాటు చేయలేదు. మల్యాల, కొడిమ్యాల మండలాల పరిధిలో అంజన్న ఆలయం పేర విలువైన భూములున్నాయి. వాటిలో కొన్ని భూములను కొందరు వ్యక్తులు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టగా, మరికొందరు కొన్నిచోట్ల సాగు చేసుకుంటున్నారు. ఆలయానికి పూర్తిస్థాయి ఈవో లేకపోవడంతో ఆలయ భూముల పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారిందని పలువురు భక్తులు పేర్కొంటున్నారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆలయ భూములను ఆక్రమించుకొన్న వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు హద్దులు భూముల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# సరిపడా నిల్వలుంటే నిరీక్షణ ఎందుకో!

కరీంనగర్ : జిల్లాలో పలు చోట్ల యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో అంచనాల మేరకే వరి సాగైనా ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ముందస్తు ప్రణాళిక ప్రకారమే జిల్లాకు సరిపడా ఎరువుల ఇండెంట్ పెట్టామని, సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అవసరమైన ఎరువుల నిల్వలను ఎక్కువగా కరీంనగర్‌లోనే డంప్ చేస్తారు. రెండు రోజుల కిందట రాజన్న సిరిసిల్ల జిల్లాలో యూరియా కొరత ఏర్పడగానే ఇక్కడి నుంచి పంపించినట్లు సమాచారం. జిల్లాలో యాసంగి వరిలో సింహభాగం పొట్ట



దశలో ఉంది. ఈ సమయంలో యూరియా కొరత రైతులను కలవరపెడుతోం ది. అధికారులు మందస్తు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

**మోతాదుకు మించి వినియోగం**

మిగిలిన ఎరువులతో పోలిస్తే శాస్త్రవేత్తలు సూచించిన దానికి మించి రైతులు యూరియా వినియోగిస్తున్నారు. సుమారు రూ.2 వేల విలువైన యూరియా సంచి రాయితీతో కేవలం రూ.267కే లభిస్తుండటమే ఇందుకు కారణమని భావిస్తున్నారు. జిల్లాలో యూరియా మినహా డీఏపీ, కాంప్లెక్స్, ఎంవోపీ ఎరువులు అవసరానికి మించి నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**ఇబ్బందులు లేకుండా చర్యలు**–జె.భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి జిల్లాలోని అన్ని విక్రయ కేంద్రాల్లో సరిపడా యూరియా నిల్వలున్నాయి. కొన్ని ప్రాథమిక సహకార సంఘాలు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడం, ఈ పాస్ విధానంలో నమోదు చేసిన తర్వాతే విక్రయించడం కారణాలతో పంపిణీ కొంత జాప్యం జరుగుతోంది. ఎక్కడా రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపడుతున్నాం. రైతులు అవసరానికి మించి కొనుగోలు చేయొద్దు.

# హుస్సేన్‌సాగర్ స్కైవాక్‌కు మార్గం సుగమం!



హైదరాబాద్ : నగరంలో ప్రధాన పర్యాటక కేంద్రమైన హుస్సేన్‌సాగర్ చుట్టూ స్కైవాక్‌కు మార్గం సుగమమైంది. ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించింది. ఇప్పటికే హెచ్‌ఎండీఏ ప్రతిపాదనలు సిద్ధంచేసింది. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) విధానంలో చేపట్టాలనేది యోచన. ప్రాజెక్టు నిర్వహణకు ఆర్థిక వెసులుబాటు(ఫైనాన్షియల్ వయబులిటీ)పై అధికారులు కసరత్తు చేస్తున్నారు. నిర్వహణ కీలకం కావడంతో.. ఆదాయం పొందే మార్గాలపై హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ఉమ్మా ప్రణాళిక సిద్ధంచేస్తోంది. హుస్సేన్‌సాగర్ చరిత్రను దృష్టిలో పెట్టుకొని స్కైవాక్ నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోనున్నారు. సాధ్యమైనంత వరకు నీటిలో స్తంభాలు లేకుండా, గట్టుకు ఆనించి ఉండేలా డిజైన్ చేస్తున్నారు. స్కైవాక్‌తో పాటు ఒకవైపు సైకిల్ ట్రాక్ నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.500కోట్ల వరకు ఖర్చుచేయనున్నారు.

**ప్రాజెక్టులో కీలకాంశాలు**

నగరంలో ప్రధాన పర్యాటక ప్రాంతాలుగా.. హుస్సేన్‌సాగర్‌లోని నెక్లెస్ రోడ్డు, సంజీవయ్య పార్కు, లుంబిని పార్కు, ఎన్టీఆర్ గార్డెన్, ట్యాంక్‌బండ్ కీలకమైనవి. ఆయా చోట్ల మరింత మంది పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఖైరతాబాద్ మెట్రో స్టేషన్‌తో ఈ స్కైవాక్‌ను అనుసంధానించనున్నారు. మెట్రో దిగి స్కైవాక్‌పై నుంచి నడిచి వెళ్లి హుస్సేన్‌సాగర్ అందాలను తిలకించవచ్చు. మెట్రో, ఎంఎంటీఎస్ స్టేషన్లనుంచి ఐమాక్స్ మీదుగా అటు నెక్లెస్ రోడ్డు, ఇటు ఎన్టీఆర్ పార్కు నుంచి సాగర్ చుట్టూ 10 కి.మీ.మేర ఈ స్కైవాక్ రానుంది.

ఆరు మీటర్ల వెడల్పుతో ఏర్పాటుచేయనున్నారు. అందులోనే ఒకవైపు సైకిల్ ట్రాక్‌కు, ఇంకో భాగం నడిచే మార్గానికి కేటాయించనున్నారు. కీలకమైన మొత్తం 7 ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఉంటాయి. ఈ ప్రాంతాల్లో లిఫ్టులు ఏర్పాటుచేయనున్నారు. సైకిళ్లు తొక్కుతూ స్కైవాక్ పైకి చేరేలా ర్యాంపులు ఏర్పాటు కానున్నాయి.

**ఆదాయ మార్గం ఇలా..**

స్కైవాక్‌కు ఆనుకుని ఫుడ్‌కోర్టులు, ఓపెన్ థియేటర్లు, గేమింగ్ జోన్లు, మినీ థియేటర్లులాంటివి అందుబాటులోకి తేనున్నారు. స్కైవాక్ పైకి వెళ్లిన తర్వాత నడుచుకుంటూ హుస్సేన్‌సాగర్‌ను చుట్టి రావచ్చు. ఉదయపు నడకకు ఈ మార్గాన్ని వినియోగించుకోవచ్చు. పైకప్పుపై సోలార్ ప్యానళ్లను ఏర్పాటుచేసి సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయనున్నారు. ప్రవేశ రుసుం కింద పర్యాటకుల నుంచి కొంత వసూలు చేసే యోచన ఉందని ఓ అధికారి తెలిపారు. వ్యాపార, వాణిజ్య కార్యకలాపాల కోసం పలు చోట్ల జోన్లు కేటాయించడం, పార్టీలు, పుట్టిన రోజులు, పెళ్లి వేడుకలు లాంటివి చేసుకునేందుకు లాంజ్‌లు కూడా అందుబాటులోకి తేవడం ద్వారా ఆదాయం పొందనున్నారు. ఫలితంగా ప్రాజెక్టు నిర్వహణకు ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు.

# ఉన్నది ఒక్కటే.. 'మూడేళ్ల' ముచ్చటే



హైదరాబాద్ : నగరానికి ఉన్న ఏకైక చెత్త నిల్వ కేంద్రం జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు. ఇది మరో మూడేళ్లలో స్తంభించనుంది. అయినా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదు. చెత్త సమస్యకు ఉత్తమ పరిష్కారంగా భావించే డబ్ల్యూటీఈ (వేస్ట్ టు ఎనర్జీ) కేంద్రాలను విస్తరించడం లేదు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన పరిష్కారం చూపకపోతే రాబోయే రోజుల్లో ఇంటింటి చెత్త సేకరణపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనిపై తాజాగా ఘన వ్యర్థాల నిర్వహణ విభాగం ఇంజినీర్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి వద్ద ప్రస్తావించడం ఆందోళనకు అద్దం పడుతోంది.

**నాలుగు చోట్ల స్థలాలు..**

డంపింగ్‌యార్డుల కోసం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో 42.22 ఎకరాలు, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం లక్డారంలో 100ఎకరాలు, మేడ్చల్ జిల్లా దుండిగల్‌లో 85 ఎకరాలు, భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మల్కాపూర్ వద్ద 200 ఎకరాల స్థలాలను జీహెచ్‌ఎంసీకి ఇవ్వాలని ఆయా జిల్లాల కలెక్టర్లను అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశించారు. భూమిని బల్దియాకు బదలాయించే క్రమంలో స్థానికులు, ప్రజాప్రతినిధులు అడ్డుకోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో అత్యాధునిక వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని నిర్మించేందుకు బల్దియా ఇటీవల పనులు చేపట్టగా.. స్థానికులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో అడ్డంకులు తలెత్తాయి.

**ప్రస్తుతం రెండు చోట్లే..**

జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు వచ్చే చెత్త నుంచి రోజూ 4వేల టన్నుల పొడి చెత్తను వేరు చేస్తున్నారు. 24మెగావాట్ల ఒకటో విద్యుదుత్పత్తి కేంద్రానికి 1,500 టన్నుల పొడి చెత్తను తరలిస్తున్నారు. అక్కడే 24 మెగావాట్ల రెండో విద్యుదుత్పత్తి కేంద్రం నిర్మాణంలో ఉంది. అది అందుబాటులోకి వస్తే మరో 1,500 టన్నుల పొడి చెత్తకూ పరిష్కారం లభిస్తుంది. దుండిగల్‌లో ఇటీవల అందుబాటులోకి వచ్చిన 15మెగావాట్ల ఒకటో విద్యుదుత్పత్తి కేంద్రానికి మరో 1,000టన్నుల పొడి చెత్త ప్రస్తుతం తరలుతోంది. ప్యారానగర్, దుండిగల్‌తోపాటు ఇతర కేంద్రాలు అందుబాటులోకి వస్తేనే పూర్తిస్థాయి పరిష్కారం లభిస్తుంది.

**మిగిలింది కొద్ది ప్రాంతమే..**

హైదరాబాద్‌లో ఉత్పత్తయ్యే చెత్త రెండు దశాబ్దాలుగా శామీర్‌పేట మండలం జవహర్‌నగర్ గ్రామంలోని 390 ఎకరాల స్థలంలో పోగవుతోంది. అక్కడి వ్యర్థాల యాజమాన్య కేంద్రంలో సాధ్యమైనంత చెత్తను రీసైక్లింగ్ చేస్తూ పునర్వినియోగానికి మళ్లిస్తున్నారు. ఇటీవల రెండెకరాల విస్తీర్ణంలోని డంపింగ్‌యార్డు నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని తొలగించి ఆ ప్రాంతాన్ని కూడా చెత్తతో నింపేస్తుండటం గమనార్హం. ప్రస్తుతం డంపింగ్‌యార్డులో మరో 30 ఎకరాల ఖాళీ స్థలం ఉంటుందని, రెండున్నరేళ్లలో అదీ నిండిపోతుందని నిర్వాహకులు చెబుతున్నారు.

ప్రమాదకర సూచనలు ఇలా.. (టన్నుల్లో..)

రోజుకు ఉత్పత్తయ్యే వ్యర్థాలు: 10 వేలు

విద్యుదుత్పత్తి కోసం వేరు చేస్తున్న పొడి చెత్త: 4,000–5,000

విద్యుదుత్పత్తి కేంద్రాల కోసం నిల్వ చేస్తోంది: 2,000–2,500

సేంద్రియ ఎరువు కోసం వేరు చేస్తున్న వ్యర్థాలు: 300–350

రీసైక్లింగ్, పునర్వినియోగానికి ఉపయోగపడని వ్యర్థాలు: 3,000–4,000

# ఇచ్చుకో.. పుచ్చుకో..

హైదరాబాద్ : 'మున్సిపాలిటీల్లో మన గ్రామాలు కలిసిపోతున్నాయి.. పన్నులు రెండింతలు వసూలు చేస్తారు. ఇళ్లు కట్టుకునేవారు తొందరగా నంబర్లు వేయించుకోండి" అంటూ కొందరు గ్రామ పంచాయతీ అధికారులు విలీన గ్రామాల్లో చేస్తున్న ప్రచారమిది. మున్సిపాలిటీల్లోకి కొత్తగా చేరిన కొన్ని గ్రామాల్లో ఇంటి నంబర్లు వేసుకుంటే పంచాయతీ పన్నులే కొన్నేళ్లు కొనసాగుతాయని నమ్మిస్తున్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీలోని నాలుగు గ్రామాలు, చేవెళ్లలోని మూడు గ్రామాల్లో కొద్దిరోజుల క్రితం వరకూ రూ.వేలల్లో వసూలుచేసి ఇంటి నంబర్లు కేటాయించారు. ఇందులో ఖాళీ స్థలాలు సైతం ఉన్నట్లు సమాచారం. ఆన్‌లైన్ విధానం రావడంతో ఈ తంతు ఆగిపోయింది.

**ప్రక్రియ పూర్తయ్యేలోపే..**మొయినాబాద్, చేవెళ్ల మేజర్ గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా చేస్తామంటూ ఆరేడు నెలల క్రితం స్థానిక ఎమ్మెల్యేలు ప్రకటించారు. వీరి అభ్యర్థనల మేరకు గతనెల 25న మున్సిపాలిటీలుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అప్పటికి చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీల్లో ఎనిమిది గ్రామాల చొప్పున కలిపేశారు. విలీన ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ ఇంటిపన్నులు, ఇళ్ల వివరాలన్నీ పంచాయతీ అధికారుల వద్దే ఉన్నాయి. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయ్యేలోపు పన్నులు, కొత్తగా ఇంటి నంబర్ల కేటాయింపు అంశాలపై కొందరు అధికారులు దృష్టిసారించారు. వెంటనే ఇంటి నంబర్లు వేసుకుంటే తక్కువ పన్ను వసూలు చేస్తామని, ఏడాది దాకా తక్కువగానే ఉంటుందని నమ్మించి రూ.వేలల్లో వసూలు చేశారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు పెయింట్‌తో నంబర్లు రాయించారు.

**111 జీవో నిబంధనలు తప్పించుకునేందుకు..**మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిది గ్రామాల్లో 111జీవో వర్తిస్తుంది. కొత్తగా నిర్మాణాలు వద్దని రెండేళ్ల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎవరైనా కట్టుకున్నా.. వాటికి నంబర్లు కేటాయించవద్దని ప్రత్యేకంగా ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో.. మొయినాబాద్ మున్సిపాలిటీ అవుతుందన్న ప్రచారంతో అనుమతుల్లేకుండా ఇళ్లు నిర్మించుకునే వారిపై కొందరు అధికారుల దృష్టిపడింది. ఇంటి నంబర్లు కేటాయిస్తే గతంలో ఉన్నవిగా చూపిస్తామని, దీంతో కచ్చితంగా సక్రమమవుతుందంటూ వారు గండిపేట చెరువు సమీపంలోని ఓ గ్రామస్థులకు చెప్పారు. ఆయా ఇళ్ల నిర్మాణాన్ని బట్టి రూ.లక్షల్లో ముడుపులు తీసుకున్నారు. అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశాలున్నాయి.

# సర్కారు వైద్యం.. అందని వైన్యం

కరీంనగర్ : గంగాధర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండు వైద్యుల పోస్టులూ భర్తీకి నోచుకోలేదు. రామడుగు మండలం గుండి గోపాల్‌రావుపేట వైద్యురాలికి అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో నలుగురు స్టాఫ్‌నర్సులు విధులు నిర్వర్తించగా ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. ఇద్దరు ఏఎన్ఎంలు డిప్యుటేషన్‌లో వెళ్లడంతో గంగాధర, నారాయణపూర్ గ్రామాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక సూపర్‌వైజర్ డిప్యుటేషన్‌లో ఉండగా వాచ్‌మెన్ లేక ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రి వేళ ఆసుపత్రిలో మహిళా సిబ్బందికి, రోగులకు రక్షణ లేక ఆందోళనకు గురవుతున్నారు.

ఈ ఒక్క ఆసుపత్రిలోనే కాదు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది నియామకం లేక రోగులకు సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదు. ప్రసవాలు, అత్యవసర సేవలు అవసరమైనపుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. గంగాధర మండలంలోని 33 పంచాయతీలతో పాటు 10 అనుబంధ గ్రామాలకు గంగాధర ప్రధాన కూడలిలో ఉన్న ఆసుపత్రే పెద్ద దిక్కు. ఇక్కడికి నిత్యం రోగులు పెద్ద సంఖ్యలో వస్తుండగా వైద్యులు, సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మేజర్ పంచాయతీ అయిన గర్శకుర్తిలో ఏఎన్ఎం డిప్యుటేషన్‌పై వెళ్లగా



రెండో ఏఎన్ఎంపై అదనపు భారం పడుతోంది. ఓవైపు ప్రభుత్వాసుపత్రుల్లో సహజ ప్రసవాలు పెంచాలని జిల్లా అధికారులు లక్ష్యం నిర్దేశిస్తుండగా ఈ మేరకు పోస్టులు భర్తీ చేయడం లేదు.

**రక్త పరీక్షల నిర్వహణకు ఆటంకాలు**

జిల్లాలోని 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 52 మహిళా ఆరోగ్య సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 25 స్టాఫ్‌నర్సు, 12 గ్రేడ్–2 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు, 10 ఫార్మాసిస్టు గ్రేడ్ 2 పోస్టులు ఏళ్ల తరబడి భర్తీకి నోచుకోవడం లేదు. 97 పల్లె దవాఖానాలుండగా అన్ని చోట్లా వైద్యుల నియామకం జరిగిందని జిల్లా అధికారులు చెబుతున్నా కొందరు దీర్ఘకాలిక సెలవులో వెళ్లినట్లు తెలుస్తోంది. 6 అర్బన్, నాలుగు బస్తీ దవాఖానాల్లో వైద్యులున్నారని చెబుతున్నారు. పారామెడికల్ సిబ్బంది నియామకానికి ప్రభుత్వం ఇటీవలే రాత పరీక్షలు నిర్వహించినా ఎప్పుడు భర్తీ చేస్తారో స్పష్టత లేదు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉండటం రక్త పరీక్షల నిర్వహణకు ఆటంకంగా మారింది. వైద్య సిబ్బంది ఖాళీల భర్తీపై ప్రభుత్వానికి నివేదించినట్లు జిల్లా వైద్యాధికారులు తెలిపారు. అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బందితో ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఇసుక లూటీకి పడేనా అడ్డుకట్ట!

కరీంనగర్ : 'అవసరమైతే నేనే రీచ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేస్తా. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇసుక పక్కాగా సరఫరా అవ్వాలి. పటిష్ఠ పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి. మాఫియాపై ఉక్కుపాదం మోపాలి'.–ఈ నెల 10న మైనింగ్ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలుఉమ్మడి జిల్లాలో లభ్యమయ్యే ఇసుకకు రాష్ట్రంలో డిమాండ్ ఎక్కువ. మానేరు, గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఇసుక నాణ్యంగా ఉండటంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాలవారు ఇక్కడి ఇసుకను కొనుగోలు చేస్తారు. ఈ క్రమంలో గతంలో అనుమతికి మించి తవ్వకాలు, రవాణా జరిగేది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఇసుక రవాణా, సరఫరా వ్యవస్థను పక్కాగా చేపట్టే దిశగా సన్నద్ధమవుతున్న నేపథ్యంలో పటిష్ఠ చర్యలు తీసుకుంటేనే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది.

**గతంలో అక్రమాలు**

తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీఎస్ఎండీఎస్) 2015 నుంచి ఉమ్మడి జిల్లాలో రీచ్‌ల సంఖ్యను పెంచుతూ వచ్చింది. గరిష్ఠంగా కరీంనగర్ జిల్లాలో 12, పెద్దపల్లి జిల్లాలో 23 రీచ్‌లకు ఆయా సందర్భాల్లో అనుమతినిచ్చారు. ఇదేకాకుండా సిరిసిల్ల, జగిత్యాలలో 'మన ఇసుక విధానం'తో కొన్నింటిని ఇసుక రవాణా ప్రాంతాలుగా గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదైన వారికి సరఫరా చేశారు. ఒక్కో రీచ్ వద్ద 25 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తవ్వే అవకాశం ఉండగా అంతకు మించి దోపిడీ జరిగింది. ఒక్కో లారీలో 14 క్యూబిక్ మీటర్లు (21 టన్నులు) నింపాల్సి ఉండగా అక్కడి సిబ్బంది అదనంగా లారీకి రూ.2 నుంచి 3 వేలు వసూలు చేసి 30 టన్నులు నింపేవారు.

రాజకీయ నాయకుల అండదండలు, పోలీసు, మైనింగ్ శాఖల్లోని



కొందరు అధికారుల సహకారంతో గతంలో ఇసుక దోపిడీ ఇష్టారాజ్యంగా సాగింది. సగటున రోజుకు 200 టిప్పర్లు, 500 ట్రాక్టర్ల ఇసుక పక్కదారి పట్టేది. పేరుకే అధికారిక రీచ్‌లున్నా.. నిబంధనలకు విరుద్ధంగా అదనపు దందా నడిచింది. నిర్ణీత పరిమాణాన్ని మించి అధిక లోడుతో ఇసుకను వ్యాపారులు దోచుకెళ్లేవారు. ఈ క్రమంలో ప్రభుత్వానికి ఏటా రూ.18 కోట్ల ఆదాయం నష్టపోయినట్లు అంచనా. పేరుకు ఆన్‌లైన్ విధానం ఉన్నా.. అక్రమాలకు అడ్డుకట్ట లేకుండా పోయింది. ఇక్కడి దందాపై జాతీయ హరిత ట్రైబ్యునల్ కూడా పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేసి కొన్ని రీచ్‌లను నిలిపి వేయడం గమనార్హం.అక్రమాలు గుర్తించినా నామమాత్రంగా కేసుల నమోదు, సరైన జరిమానాలు విధించకపోవడంతో అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.

పర్యవేక్షణ ఇలా పెరిగితేనే..చాలా రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. ఈ నిఘా పెరగాలి. కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానించాలి.ప్రతి వాహనానికి జీపీఎస్ విధానంతోపాటు వే బిల్లుల వ్యవహారంపై మూడంచెల తనిఖీ విధానం ఉండాలి.

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లాస్థాయిలో సమన్వయ కమిటీల బాధ్యతతో రేయింబవళ్లు పర్యవేక్షణ జరగాలి.

# బాల శాస్త్రజ్ఞుల బడి

నర్సీపట్నం : ఆ బడి బాల శాస్త్రజ్ఞులకు చిరునామాగా మారింది. నూతన ఆవిష్కరణలకు వేదికగా నిలిచి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నర్సీపట్నం మండలం చెట్టుపల్లిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఇన్‌స్పైర్ మనక్ అవార్డులు అందుకోవడంలో ముందంజలో ఉంటోంది. తాజాగా ఇందులోని ఓ విద్యార్థి క్యూఆర్ కోడ్‌తో ఇంటి అద్దె బోర్డును రూపొందించడం అందరిని ఆశ్చర్యపరిచి ంది. నిత్య జీవితంలో చుట్టూ కనిపించే వాటినే సాంకేతిక సాయంతో మరింత మెరుగ్గా వినియోగించుకునేలా విద్యార్థులు నమూనాలు రూపొందిస్తున్నారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎ.వి.రాజగోపాల్ ప్రోత్సాహంతో వీరంతా ఈ సైన్స్ ప్రయోగాల్లో రాణిస్తున్నారు. సాధారణ విషయాలనే అద్భుతం అనిపించేలా వీరి తయారు చేసిన కొన్ని నమూనాల వివరాలు ఇవి.

**సోలార్‌తో కాఫీలో నాణ్యత**

అంతర్జాతీయ ఖ్యాతిని సొంతం చేసుకున్న మన్యంలోని కాఫీ గింజల శుద్ధికి ముందుగా వాటిని యార్డుల్లో ఆరబెడుతుంటారు. సోలార్‌తో వీటిని త్వరితగతిన ఎండబెట్టవచ్చని తొమ్మిదో తరగతి విద్యార్థిని అమృతవర్షిణి తయారు చేసిన నమూనా జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. దీని ద్వారా కాఫీలో నాణ్యత పెరుగుతుందని సూచించి ంది. అధికారులు సైతం ఈ ప్రయోగం పట్ల ఆకర్షితులవడం విశేషం.

**స్మార్ట్ బడి గంట**

పాఠశాలల్లోని సాధారణ బడి గంటను 8వ తరగతి విద్యార్థి కె.మహేంద్ర స్మార్ట్ బెల్‌గా రూపొందించి పురస్కారాన్ని అందుకున్నాడు. బడిలోని అంతర్జాలం సాయంతో ఫోను ద్వారానే సమయానికి గంట మోగేలా దీనిని తయారు చేశాడు. ఎలక్ట్రిక్ గంట, స్మార్ట్ స్విచ్‌లను అంతర్జాలానికి




అనుసంధానించడంతో ఇది ఓ కొత్త ఆవిష్కరణగా అందరి ప్రశంసలందుకుంది.

**చింతపిక్క బటన్లు**

ప్లాస్టిక్ నిషేధానికి చిన్న చిన్న ప్రయత్నాలు ఎంతో ప్రయోజనాన్ని చేకూరుతాయని 8వ తరగతి విద్యార్థిని వెలంకాయల సాయి శివాని తన ప్రయోగంతో నిరూపించింది. చొక్కాలు, దుస్తులకు ప్లాస్టిక్ గుండీలనే వినియోగిస్తారు. ప్లాస్టిక్ వీలైనంత తక్కువగా వాడటం అందరికీ మంచిది. ఇదే ఉద్దేశంతో ఈ విద్యార్థిని చింతపిక్కను కాస్త అరగదీసి నలుపు రంగు లేకుండా చేసి బటన్లుగా వాడుకునేలా తయారు చేసిన నమూనా అందరినీ ఔరా నిపించింది.

విద్యార్థుల్లో ప్రేరణకు కృషి..: ప్రయోగాలు చేసేలా విద్యార్థుల్లో ప్రేరణ కల్పించేలా అన్నివిధాలా కృషి చేస్తున్నాం. గతంలో చీడిగుమ్మల, ఇప్పుడు చెట్టుపల్లి ఉన్నత పాఠశాలలో కలిపి మొత్తం 13 సైన్స్ ప్రాజెక్టులకు నేను గైడుగా వ్యవహరించాను. చీడిగుమ్మలలో ఎనిమిది, చెట్టుపల్లిలో 5 చొప్పున వీటిని రూపొందించిన విద్యార్థులకు పురస్కారాలు దక్కాయి. వీటిల్లో ఏడు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. పదో తరగతి విద్యార్థిని కృష్ణవేణి రూపొందించిన సోలార్ పవర్ ట్రీ ప్రాజెక్టు జాతీయ స్థాయికి అర్హత సాధించింది. విద్యార్థికి కొందరైనా శాస్త్రజ్ఞులు కాగలిగితే ఉపాధ్యాయ వృత్తికి సార్థకత లభిస్తుంది.

ఎ.వి. రాజగోపాల్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, చెట్టుపల్లి

# కిడ్నీ వ్యాధి కబళిస్తోంది

అనకాపల్లి : జిల్లాలో కిడ్నీ రోగుల సంఖ్య పెరుగుతోంది. మారుతున్న ఆహారపు అలవాట్లు, వాతావరణం, నీటి కాలుష్యం, చెడు అలవాట్లతో ఈ రోగులు పెరుగుతున్నారు. చిన్నవయస్సుల వారికీ కిడ్నీలు పాడవుతుండడం అందరిలోనూ ఆందోళనలు రేకెత్తిస్తోంది. ఈనెల 13న ప్రపంచ కిడ్నీ దినం సందర్భంగా జిల్లాలోని పరిస్థితిపై కథనం..జిల్లాలో కిడ్నీ వ్యాధి పెరుగుతుండడంతో చికిత్స అందించడాని కి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. అనకాపల్లి మండలం మామిడిపా లెంలో కిడ్నీ బాధితులు పెరుగుతున్నారని కలెక్టర్‌కు స్థానికులు వినతిపత్రం అందజేశారు. దీంతో అక్కడ తనిఖీలు చేపట్టారు. నీటి పరీక్షలు చేశారు. ప్రభుత్వ పరంగా కిడ్నీ సంబంధిత వైద్యులతో వైద్య పరీక్షలు చేశారు. ఎంపీ సీఎం రమేశ్ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా కిడ్నీ వ్యాధి రక్తపరీక్షలను చేపట్టారు. ఇక్కడ ఈ వ్యాధిగ్రస్థులు ఎక్కువగానే ఉన్నారని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. నర్సీపట్నంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుచేయగా అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో త్వరలో అందుబాటులోకి తేనున్నారు. నొప్పి నివారణ మాత్రలు ఎక్కువగా వాడిన వారికి, మద్యం, సిగరెట్ అలవాట్లు, మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం, వాతావరణం, నీటి కాలుష్యం వల్ల వ్యాధి పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.అనకాపల్లి మండలం మామిడిపాలెంలో ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధులకు సంబంధించి 1200 మందికి రక్త



పరీక్షలు చేయగా వీరిలో 277 మందికి సీఆర్ క్రియాటిన్‌లో తేడా ఉన్నట్లు గుర్తించారు.అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రికి 25 ఏళ్ల వయస్సు ఉన్న యువకుడు చికిత్సకు వచ్చాడు. కాళ్లు పొంగుతున్నాయని చెప్పడంతో పరీక్ష చేయగా కిడ్నీ వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. మద్యం ఎక్కువగా తాగడం వల్ల సమస్య వచ్చినట్లు వైద్యులు గుర్తించారు.రాంబిల్లికి చెందిన వ్యక్తికి ఆయాసం ఎక్కువగా వస్తుండడంతో అనకాపల్లి ఆసుపత్రిలో చూపించగా కిడ్నీకి ఇన్‌ఫెక్షన్ సోకినట్లు గుర్తించి మందులు వాడాలని సూచించారు. అనకాపల్లి మండలం సత్యనారాయణపురానికి చెందిన యువకుడు డయాలసిస్ చేయించుకుంటూ ఇటీవలే మృతిచెందాడు.జిల్లాలోని నర్సీపట్నంలోని డయాలసిస్ యూనిట్‌లో నెలకు 170 మంది రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. గత రెండేళ్ల నుంచి రోగుల సంఖ్య పెరిగింది.

త్వరలోనే డయాలసిస్ సెంటర్

అనకాపల్లిలో డయాలసిస్ సెంటర్ త్వరలోనే అందుబాటులోకి రానుంది.కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. దీన్ని సకాలంలో గుర్తించాలి. వ్యాధి నిర్ధారణ జరిగితే మందులు అందుబాటులో ఉన్నాయి. అనుమానం ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలి. ఉచితంగా మందులతో పాటు, చికిత్సను అందిస్తాం. ఇది వరకు వృద్ధులకు ఈ వ్యాధులు వచ్చేవి. ఇప్పుడు మారుతున్న ఆహారపు అలవాట్లు, పెరుగుతున్న కాలుష్యంతో చిన్న వయసుల వారికీ వస్తుంది. సకాలంలో గుర్తించి పరీక్ష చేయించుని వైద్యం పొందితే ఫలితం ఉంటుంది.

డాక్టర్ శ్రీనివాసరావు, డీసీహెచ్ఎస్, అనకాపల్లి

# సొంతింటి కల నెరవేరేలా..



తిరుపతి : అర్హులందరూ 2029 నాటికి సొంతిల్లు కలిగి ఉండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష అనుగుణంగా పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అర్హులందరూ గృహం నిర్మించుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. వైకాపా హయాంలో మంజూరైన ఇళ్లకు కూడా అదనంగా ఆర్థికసాయం అందించాలని నిర్ణయించడంతో అర్ధాంతరంగా ఆపేసిన గృహ నిర్మాణాల్లో కదలిక రానుంది. పనులు మొదలుపెట్టని పేదలు సైతం ముందుకొచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. 2014- 19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు కట్టుకునే లబ్ధిదారుడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.2 లక్షలు- రూ.2.50 లక్షల వరకు సాయం అందింది. వైకాపా అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ ఇంటి పట్టాలు ఇస్తామని ప్రకటించారు. 2024 నాటికి రాష్ట్రంలోని పేదలందరికీ ఓ గూడు ఉండేలా చర్యలు తీసుకుంటామని నాటి ముఖ్యమంత్రి జగన్ చెప్పారు. 2020 డిసెంబరులో లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేశారుకొండల్లో పట్టాలు.. నామమాత్రపు సాయం

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అత్యధిక శాతం స్థలాలు కొండలు, గుట్టల్లో చూపారు. అప్పట్లో సామూహిక శంకుస్థాపనలు నిర్వహించిన సమయంలోనే పేదల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు పునాదులకే ఖర్చవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని కేంద్రమే అందించగా.. జగన్ సర్కార్ అదనంగా ఒక్క రూపాయి ఇచ్చేందుకు ససేమిరా అంది. గృహ నిర్మాణ సంస్థ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల ఒత్తిడితో అప్పుడు పనులు మొదలుపెట్టారు. తర్వాత ఎక్కువ శాతం మంది స్థలాల వైపు కన్నెత్తి చూడలేదు.

**రెండు జిల్లాల్లో 38,750 మందికి లబ్ధి**

కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తగా లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తామని అధికారులు చెప్పినా నిర్మాణ వ్యయం తక్కువగా ఉందని లబ్ధిదారులు గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఈ క్రమంలోనే బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు అదనంగా రూ.75 వేలు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కలిపి 38,750 మందికి లబ్ధి కలుగుతుందని గృహ నిర్మాణ సంస్థ అధికారులు అంచనా వేస్తున్నారు. దాదాపు రూ.198.95 కోట్లు సర్కార్‌పై భారం పడుతుంది. రెండు జిల్లాల్లో ఇంకా 10,953 మంది ఇంటి నిర్మాణాలు మొదలుపెట్టలేదు. వీరు కూడా ప్రారంభిస్తే వ్యయం మరింత పెరుగుతుంది.

**నెలాఖరుకు 20,664 పూర్తి చేయాలని..**

ఈ నెలాఖరుకు 20,664 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండు జిల్లాల్లో గతనెలాఖరుకు 1,827 ఇళ్ల నిర్మాణాలే జరిగాయి. 18,837 పూర్తవ్వాలంటే కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం అదనపు సాయం ప్రకటిస్తుండటంతో మే లేదా జూన్ చివరకు లక్ష్యం చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు.

గృహ నిర్మాణాల పురోగతి ఇలా..

జిల్లాలో మంజూరైన ఇళ్లు: 77,701

పూర్తయిన ఇళ్లు: 49,976

మిగిలినవి: 27,725

# డీలర్ల దయ.. రైతు ప్రాప్తం



చిత్తూరు : హోల్‌సేల్ డీలర్లు దయ తలిస్తేనే జిల్లాలో రైతులకు యూరియా అందుతోంది. లేకుంటే అందేది అంతంత మాత్రమే. రైతన్న పడరాని పాట్లు పడాల్సిందే. అన్నదాతల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు హోల్‌సేల్ డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. తమ కష్టాన్ని దోచేస్తున్నారంటూ రైతులు ఆరోపిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన వ్యవసాయ శాఖ ప్రేక్షక పాత్ర పోషిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.జిల్లాలో గతేడాది నవంబరు, డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. దీంతో రబీ సీజన్ ఆశాజనకంగా ఉండటంతో వరి, కూరగాయలు, ఇతర పంటలు విస్తారంగా సాగయ్యాయి. యూరియా వినియోగం మరింతగా పెరిగింది.

**అంతా మా ఇష్టం**

యూరియా విక్రయాల్లో కొందరు హోల్‌సేల్ డీలర్లు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. వీరి వద్దకు వచ్చిన సరకును రిటైల్ డీలర్లు, ప్రాథమిక పరపతి సంఘాలకు అందజేయాల్సి ఉండగా.. అలా చేయడం లేదు. తమ వద్దే నిల్వ చేసుకుని కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఈ క్రమంలో చిత్తూరులోని కొందరు బహిరంగంగా యూరియా బస్తా రూ.330-330 వరకు విక్రయిస్తున్నారు. దుకాణం ఎదుట కనీసం ధరల పట్టిక, నిల్వ వివరాలు తెలిపే బోర్డే ఉండదు. అధిక ధర గురించి ప్రశ్నిస్తే.. చెప్పిన ధరకు తీసుకోవాలనీ.. అంత ఇవ్వకుంటే తమ వద్ద యూరియా లేదని చెబుతున్నారు.

జిల్లాలో సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)

రబీ సాధారణ సాగు: 23,334

సాగైన విస్తీర్ణం: 24,693

రబీ సీజన్‌కు చేరిన యూరియా: 16,100 టన్నులు

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

నిర్ణీత ధర కన్నా అధిక ధరకు యూరియా విక్రయించకూడదు. కృత్రిమ కొరత సృష్టించినట్లు మా దృష్టికి వస్తే తక్షణమే సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకుంటాం.మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

# విజయ 'వికాస' మన్యం

విజయనగరం: శరవేగంగా ప్రగతి పథంలో దూసుకెళ్లేందుకు అనువైన వనరులు ఉన్న నగరాలను 'గ్రోత్ హబ్'లుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు దేశంలో ఎంపిక చేసిన నాలుగు మహా నగరాల్లో విశాఖ ఒకటి. ఇందులో విలీనం చేసిన ఎనిమిది జిల్లాల్లో పార్వతీపురం మన్యం, విజయనగరానికి చోటు కల్పించారు.వికసిత్ భారత్ లక్ష్యంగా నగరాల విస్తరణ, అభివృద్ధి, నీటి సరఫరా, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' పేరుతో కేంద్రం తాజా బడ్జెట్‌లో రూ.లక్ష కోట్ల నిధిని ఏర్పాటు చేసింది. ఇందులో ఈ వార్షిక సంవత్సరంలో రూ.10 వేల కోట్ల కేటాయింపునకు ప్రతిపాదించింది. జిల్లాల వారీగా కలెక్టర్లు సిద్ధం చేసిన అభివృద్ధి ప్రణాళికల ముసాయిదాలపై అంశాల వారీగా నీతి ఆయోగ్ అధికారులు ఇటీవల కలెక్టర్లతో దృశ్య శ్రవణ సమావేశం నిర్వహించారు. ఏయే అంశాలపై దృష్టి సారిస్తే ప్రగతి సాధ్యమనే విషయమై మార్గనిర్దేశం చేశారు. విజయనగరం జిల్లా స్థూల దేశీయ ఉత్పత్తి రూ.33,709 కోట్లు. జిల్లా తలసరి ఆదాయం రూ.1,42,262. 'గ్రోత్ హబ్' వల్ల స్థూల జాతీయ ఉత్పత్తిలో ఏటా 15 శాతం జిల్లా ప్రగతి సాధనతో పేదరికం నిర్మూలన జరుగుతుందని.. ప్రగతి పథంలో పయనిస్తుందని భావిస్తున్నారు.

ప్రస్తుతం సర్వీసు సెక్టారులో 45 శాతం, వ్యవసాయ, దాని అనుబంధ రంగాల్లో 31 శాతం, పారిశ్రామిక రంగంలో 24 శాతం వృద్ధి నమోదవుతోంది. దీన్ని శరవేగంగా ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉందని జిల్లా అధికార యంత్రాంగం భావిస్తోంది.

వ్యవసాయ, పశు సంపద, భవన నిర్మాణ, స్థిరాస్తి, ఇతర రంగాల్లో దృష్టి సారిస్తే ప్రగతి పరుగు తీస్తుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. చిరు ధాన్యాలు సాగు, ప్రకృతి సేద్యంలో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.తయారీ, పారిశ్రామిక రంగాల వృద్ధికి అవకాశం ఉంది. ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు రూపొందించిన ప్రణాళికలు అమలైతే ప్రతి ఇంటి నుంచి కనీసం ఒకరు ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా ఎదుగుతారు.భోగాపురం విమానాశ్రయం ద్వారా రవాణా, లాజిస్టిక్స్, కార్గో సేవలతో పాటు స్థిరాస్తి రంగం, పర్యాటక రంగాలు పురోగతి దిశగా పయనిస్తాయి.విద్య, పర్యాటకం, వ్యవసాయాధారిత పరిశ్రమలు, త్వరలో పూర్తికానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా ఎగుమతులు, దిగుమతుల కార్యకలాపాలు ఆర్థిక ప్రగతికి దోహదపడతాయి. ఉద్యాన పంటల ఉత్పత్తితో మామిడి తాండ్ర, జీపప్పు, చిరుధాన్యాల శుద్ధీకరణ, పామాయిల్ ఉత్పత్తి యూనిట్లు నెలకొల్పేందుకు అడుగులు పడుతున్నాయి. రోడ్డు, రైలు మార్గాలు అందుబాటులో ఉండటంతో సేవా రంగం ప్రగతి పుంతలు తొక్కే అవకాశం ఉంది. విజయనగరం వైద్య కళాశాల భవనాల నిర్మాణం పూర్తయితే విద్యా రంగంలో అనుబంధ కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంది. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం సొంత భవనాల్లో మరో ఏడాదిలో అందుబాటులోకి వస్తుంది.

# మియవాకి.. హుష్ కాకి

గాజువాక : నగరాల్లో కాలుష్య నివారణలో భాగంగా జపనీస్ తరహా 'మియవాకి' ఉద్యానవనాలకు చాలాచోట్ల శ్రీకారం చుట్టారు. ఈ తరహా ప్రయోగం వల్ల కొన్ని కోట్ల చక్కగా చెట్లు పెరిగి ఆహ్లాదం పంచుతుండగా.. మరికొన్ని చోట్ల వాటి నిర్వహణలేక ఎండిపోయి బీడు భూములుగా మారాయి.గాజువాక కణితిరోడ్డు నుంచి వుడాకాలనీని కలుపుతూ గోపాలరెడ్డినగర్ వరకూ 1.06 కి.మీ. పొడవైన 130 అడుగుల రోడ్డును 2017లో నాటి వుడా అధికారులు అభివృద్ధి చేశారు. రెండువైపులా 50 అడుగుల చొప్పున రోడ్లను వదిలేసి మధ్యలో 30 అడుగుల స్థలం పార్కులకు కేటాయించారు. ఈ దారి పొడవునా మొత్తం 9 పార్కులు (బ్లాక్‌లు) ఉన్నాయి. జీవీఎంసీ ఉద్యాన విభాగం గోపాల్‌రెడ్డినగర్ వద్ద 2022లో మియావాకి తరహాలో చిట్టడివిని



పెంచాలని నిర్ణయించి ఒక బ్లాకులో (మీడియం) 2వేల వేప, కానుగ, చైనాబాదం, మర్రి, రావి, వివిధ పూల జాతుల మొక్కలను నాటారు. అయితే కొన్ని మొక్కలు పెరిగి వృక్షాలుగా మారినా అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. ఓ స్థాయి మొక్కలన్నీ ఎండిపోయాయి. పెరిగిన మొక్కల్లో కూడా పచ్చదనం కరవై మోడుగా మారాయి.

**ఇప్పుడు హడావుడి:** ఇన్నాళ్లు నిర్లక్ష్యం వహించిన వీఎంఆర్‌డీఏ అధికారులు దీన్ని అభివృద్ధి చేస్తామంటూ హడావుడిగా యంత్రాల సాయంతో సెంటర్ మీడియం పార్కుల్లో మొక్కలు, పెద్దచెట్లను కూకటి వేళ్లతో పెకలిస్తున్నారు. మళ్లీ మొక్కలు నాటుతామంటూ చెప్తున్నారు. దీనిపై జోనల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రిని సంప్రదిస్తే.. పార్కుల్లో కొత్తగా మొక్కలు నాటే కార్యక్రమం ఉందన్నారు. ఉన్న మొక్కలు తొలగించవద్దని చెప్పామన్నారు. అయితే సెంటర్ మీడియం పార్కులు వి.ఎం.ఆర్.డి.ఎ. పరిధిలో ఉన్నాయన్నారు.

# పూడికతీత మాటున దందా

గూడూరు : వైకాపా హయాంలో కోట మండలం గూడలి స్వర్ణముఖి నదిలో ఇసుక రీచ్ ఏర్పాటు చేసి లక్షల టన్నుల ఇసుక పక్కదారి పట్టించారు.. కూటమి ప్రభుత్వం వచ్చాకా దందా మరో రూపంలో కొనసాగుతోంది. పూడికతీత పనుల ఒప్పందం జరగక ముందు నుంచే రెండు నెలలుగా గుత్తేదారు అధికారుల అండతో రేయింబవళ్లు భారీ యంత్రాలతో ఇసుక తవ్వి టిప్పర్లలో తరలిస్తున్నారు. దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్వర్ణముఖి నదిలో ప్రస్తుతం ఎలాంటి ఇసుక దిబ్బలు లేవు. కానీ జల వనరుల శాఖ అధికారులు ఉన్నాయంటూ అంచనాలు వేసి.. పూడికతీత చేపడితే నీటి ప్రవాహం సాఫీగా జరుగుతుందని నాలుగు నెలల కిందట టెండర్లు పిలిచారు. గుత్తేదారు ఈ నెల 5 నుంచి మూడు నెలల పాటు నదిలో కూలీల సాయంతో



పూడికతీత పనులు చేపట్టేలా ఒప్పందం చేశారు. మొత్తం 55 వేల టన్నుల ఇసుకను పూడిక తీయాలని జలవనరుల శాఖ అధికారులు నిర్ణయించారు. దీనికి రెండు నెలల ముందుగానే మూడు పెద్ద యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపట్టారు. యంత్రాలతో తవ్వుతుంటే నీటి ఊట ఏర్పడుతోంది. ఒప్పందం ప్రకారం కూలీలతో జరగాల్సిన పనిని యంత్రాలతో చేస్తున్నా.. రెవెన్యూ, జల వనరుల, గనుల శాఖ, పోలీసులు పట్టించుకోవడం లేదు. ఇలా రోజుకు తవ్వి తరలిస్తున్న ఇసుక విలువ రూ.10 లక్షల పైమాటే. ఈ విషయమై గూడూరు జల వనరుల శాఖ ఈఈ శ్రీనివాసరావును వివరణ కోరగా.. నదిలో ఏఈ, సిబ్బందితో పర్యవేక్షిస్తామని తెలిపారు.

# గజాల్లో కోత..ఇదేం కథ!!

విశాఖపట్నం: విశాఖ మహా ప్రాంత అభివృద్ధి సంస్థ మధ్య తరగతి ప్రజల (ఎంఐజీ) కోసం ఏర్పాటు చేసిన కొన్ని లేఅవుట్లలో ప్లాట్లు విస్తీర్ణం తగ్గిస్తున్నారు. విజయనగరం జిల్లా రఘుమండలో 150, 200 గజాల స్థలాలు కొన్న వారికి అయిదారు గజాలు తగ్గించి ఇస్తున్నారు. గజం రూ.6,500లకు కొన్నామని, ఆ మేరకు నష్టపోతున్నట్లు ఓ కొనుగోలుదారు పేర్కొన్నారు. జిల్లాలోని రఘుమండ, జియ్యమ్మవలస, గరివిడి, భోగాపురం వద్ద వీఎంఆర్‌డీఏ ఎంఐజీ లేఅవుట్లు వేసింది. వీటిల్లో పావుశాతమైనా అమ్ముడవ్వలేదు. అన్నింటిలో భూగర్భ కాలువలు, రోడ్లు, విద్యుత్తు సౌకర్యం, పార్కులు అభివృద్ధి చేయాలి. ఇందుకు రూ.150 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే రోడ్లు, కాలువలు నిర్మించి వదిలేశారు. రఘుమండ లేఅవుట్



దారుణంగా ఉంది. మెరక చేసే పనులు సాగలేదు. ఇటీవల వర్షాలకు నీరు చేరి చెరువును తలపిస్తున్నాయి. ఈ ఒక్క లేఅవుట్‌లోనే 80 శాతం ప్లాట్లు అమ్ముడయ్యాయి. ఇక్కడ కూడా ఎత్తుగా చేసి అందుబాటులోకి తీసుకురాకుండా వదిలేయడంతో ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉద్యోగుల నిర్లక్ష్యం** ప్రైవేటు లేఅవుట్ల నిర్వాహకులు వారి ప్లాట్ల విక్రయానికి అనేక రకాలుగా ప్రయత్నిస్తారు. వీఎంఆర్‌డీఏలో కొందరు ఉద్యోగులు ప్లాట్ల కోసం ఫోన్లు చేస్తే సరిగా స్పందించడం లేదంటున్నారు. మరొకరిని సంప్రదించాలని... వారికి చేస్తే మొదట చేసిన వారికే చేయాలని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. కనీసం దరఖాస్తు సమయంలో తలెత్తే సందేహాలూ ఎవరూ తీర్చడం లేదంటున్నారు. కార్యాలయానికి వెళ్లినా పట్టించుకోవడం లేదని, నిరీక్షింపచేస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. చాలా మంది ఉద్యోగుల వ్యవహారశైలితోనే కొనుగోలుకు విముఖత చూపుతున్నారంటున్నారు.

# గజాల్లో కోత.. ఇదేం కథ!!

విశాఖపట్నం : విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మధ్యతరగతి ప్రజల (ఎంఐజీ) కోసం ఏర్పాటు చేసిన కొన్ని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి చిక్కులు ఎదురవుతున్నాయి. పిల్లల చదువులకు, భవిష్యత్తు అవసరాలకు రూ.లక్షలు ఖర్చు చేసి ప్లాట్లు కొనుగోలు చేస్తే వీఎంఆర్‌డీఏ అధికారులు వాటి విస్తీర్ణం తగ్గించేస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. కొనుగోలు చేసిన ప్లాటు మొత్తంలో అయిదారు గజాలు కోతపెట్టి కేటాయిస్తున్నారు. విజయనగరం జిల్లా రఘుమండలో వీఎంఆర్‌డీఏ ఎంఐజీ లేఅవుట్ అభివృద్ధి చేసింది. ఇక్కడ పెద్ద సంఖ్యలో ప్లాట్లు విక్రయించగా.. కొద్ది రోజులుగా సర్వే చేసి కొనుగోలుదారులకు వాటిని కేటాయిస్తున్నారు. 150, 200 గజాల స్థలాలు కొనుగోలు చేసిన వారికి కొలతల సమయంలోనే అయిదారు గజాలు తగ్గించి అప్పగించడంపై విమర్శలు వస్తున్నాయి. గజం రూ.6,500లకు కొనుగోలు చేశామని, ఇప్పుడు ఆ మొత్తం నష్టపోతున్నట్లు ఓ కొనుగోలుదారు పేర్కొన్నారు. పలుమార్లు సంప్రదిస్తే తప్ప స్పందన ఉండడం లేదని మరొకరు ఆవేదన వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా రఘుమండ, జియ్యన్నవలస, గరివిడి, విశాఖ జిల్లా పాలవలస, అనకాపల్లి జిల్లా అడ్డూరు, భోగాపురం వద్ద వీఎంఆర్‌డీఏ ఎంఐజీ లేఅవుట్లు వేసింది. వీటిల్లో 1240 ప్లాట్లు



విక్రయానికి ఉంచగా పావుశాతమైనా అమ్ముడవ్వలేదు. చాలా లేఅవుట్లలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి.
అన్నింటిలో భూగర్భ కాలువలు, రోడ్లు, విద్యుత్తు సౌకర్యం, పార్కులు అభివృద్ధి చేయాలి. ఇందుకు రూ.150 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రస్తుతం అన్ని లేఅవుట్లలో రోడ్లు, కాలువలు నిర్మించి వదిలేశారు. ఆ తర్వాత చేయాల్సినవి ముందుకు సాగటం లేదు.
రఘుమండ లేఅవుట్ దారుణంగా ఉంది. మెరక చేసే పనులు సాగలేదు. ఇటీవల వర్షాలకు నీరు చేరి చెరువును తలపిస్తున్నాయి. ఈ ఒక్క లేఅవుట్‌లోనే 80 శాతం ప్లాట్లు అమ్ముడయ్యాయి. అటువంటి చోట కూడా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎత్తుగా చేసి అందుబాటులోకి తీసుకురాకుండా వదిలేయడంతో అక్కడికి వెళ్లి చూసిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉద్యోగుల వ్యవహారశైలితో..**

ప్రైవేటు లేఅవుట్ల నిర్వాహకులు వారి ప్లాట్ల విక్రయానికి అనేక రకాలుగా ప్రయత్నిస్తారు. ఎలాగైనా అమ్ముడయ్యేలా ఉన్న వనరులను వివరించి మార్కెటింగ్ చేసుకుంటారు. విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) అలాంటి ప్రయత్నం కూడా చేయడం లేదు. ఎంఐజీ (మధ్యతరగతి ప్రజలు) కోసం వేసిన లేఅవుట్లలో ప్లాట్లు విక్రయించడంలో వీఎంఆర్‌డీఏ ఘోరంగా విఫలమవుతోంది. కొన్నింటికి అసలు స్పందనే లేదు. దీనంతటికీ కొందరు ఉద్యోగుల వ్యవహారశైలి కారణంగా కనిపిస్తోంది. ప్లాట్ల కోసం ఫోన్ చేస్తే సరిగా స్పందించడం లేదంటున్నారు. ఫోన్ చేస్తే మరొకరిని సంప్రదించాలని... వారికి చేస్తే మొదట చేసిన వారినే సంప్రదించాలని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. కనీసం దరఖాస్తు సమయంలో తలెత్తే సందేహాలూ ఎవరూ తీర్చడం లేదంటున్నారు. కార్యాలయానికి వెళ్లినా పట్టించుకోవడం లేదని, నిరీక్షింపచేస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. చాలా మంది ఉద్యోగుల వ్యవహారశైలితోనే కొనుగోలుకు విముఖత చూపుతున్నారంటున్నారు.

# ప్లాన్ పక్కా.. పనులన్నీ లెక్కే..!

విశాఖపట్నం: పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. వాటిని కచ్చితం గా అమలు చేయాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలు ఇచ్చారు. ప్లాన్ ప్రకారం నిర్మాణం చేపడితేనే నివాస యోగ్య ధ్రువీకరణ పత్రం (ఓసీ) ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. అలాగే ఓసీ ఉంటేనే వాణిజ్య భవనాలకు వ్యాపార అనుమతులు ఇవ్వాలని స్పష్టం చేశారు. **వారే సూత్రధారులు:** కొత్తగా వచ్చిన నిబంధనలన్నీ అమలు చేస్తే నగరంలో పెద్ద సంఖ్యలో భవనాలకు ఓసీలు వచ్చే అవకాశాలు ఉండవని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం విశాఖలో ఎక్కడికక్కడ వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు కొందరు జీవీఎంసీ పట్టణ ప్రణాళికాధికారులే సూత్రధారులుగా ఉంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ అక్రమ నిర్మాణాలు పూర్తయిన తర్వాత అధికారులే ఓసీ ఎలా ఇస్తారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అయితే ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిన నాటి నుంచి అమలు చేయాలనే ఆదేశాలు వస్తే, ప్రస్తుత నిర్మాణాలకు ఇబ్బంది ఉండకపోవ చ్చంటున్నారు..

**దశలోనైనా పరిశీలన:** ఆన్‌లైన్ ప్లాన్‌కు అనుమతులు వచ్చిన తర్వాత ప్రణాళికాధికారులు భవనం పూర్తయ్యేంత వరకు పరిశీలన చేయకూడదన్న నిబంధన తొలగించారు. దీంతో నగరంలో చేపడుతున్న నిర్మాణాలను ప్రణాళికాధికారులు ఎప్పటికప్పుడు పరిశీలన చేయడానికి వీలుంటుంది. తద్వారా నిర్మాణదారులు అదనపు అంతస్తులు వేసే అవకాశా లు ఉండవు.



ఒక వేళ అదనపు అంతస్తు నిర్మించినా, సంబంధిత అధికారే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రస్తుతం జీవీఎంసీలో ఉన్న సిబ్బందితో క్షేత్రస్థాయి పరిశీలన సాధ్యపడదు. కొత్తగా సిబ్బందిని నియమించుకోవడం, లేక..గతంలో ఉండే ఛైన్‌మెన్ వ్యవస్థను తిరిగి ప్రవేశపెట్టడం చేయాలి.

**కార్యదర్శులకు బాధ్యతలు**

నగర పరిధి నియోజకవర్గాల్లో వార్డు ప్రణాళిక కార్యదర్శులు ఉన్నారు. వారికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించే అవకాశాలపై అధికారులు చర్చిస్తున్నారు. నిర్మాణదారుడు ప్లాన్ కోసం దరఖాస్తు చేసినప్పుడు, ప్లాన్ ప్రకారమే పనులు చేపడతామని అంగీకారపత్రం తీసుకోవాల్సి ఉంటుంది. ప్లాన్ ప్రకారం నిర్మిస్తేనే నివాస ధ్రువీకరణ పత్రం మంజూరవుతుందన్న విషయంపై అధికారులే అవగాహన కల్పించాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే విద్యుత్తు మీటర్ ఇవ్వొదంటూ ఏపీఈపీడీసీఎల్ అధికారులకు ఫిర్యాదు చేయాల్సి బాధ్యత ప్రణాళికాధికారులపైనే ఉంటుంది. ఇలా నూతన విధానంతో అన్ని నిర్మాణాలు ప్లాన్ ప్రకారమే ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

# వడివడిగా హంద్రీనీవా..



అనంతపురం: రాయలసీమ జీవనాడి హంద్రీనీవా పథకాన్ని పూర్తి చేసేందుకు కూటమి సర్కారు వేగంగా అడుగులు వేస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే పనులకు టెండర్లు ఖరారు చేసి గుత్తేదారు సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది. ఇటీవల బడ్జెట్‌లో రూ.3243 కోట్లు కేటాయించారు. ఫేజ్-1లో విస్తరణ, ఫేజ్-2లో లైనింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. మల్యాల నుంచి జీడిపల్లి వరకు విస్తరణలో భాగంగా కంపచెట్లు తొలగిచారు. రాప్తాడు, పుట్టపర్తి నియోజకవర్గాల పరిధిలో లైనింగ్ పనులు మొదలుపెట్టారు.

**తక్కువ రోజుల్లో ఎక్కువ నీరు**

శ్రీశైలంలో 810 అడుగుల వరకు 40 టీఎంసీల నీటిని తీసుకునే వెసులుబాటు ఉంది. ప్రధాన కాలువ విస్తరణకు నోచుకోకపోవడంతో పూర్తివాటాను తీసుకోవడానికి ఎక్కువ సమయం పడుతోంది.
విస్తరణ పూర్తయితే 120 రోజుల్లోనే 40 టీఎంసీలు తీసుకోవచ్చు. చిత్తూరుకు నీటిని ఇవ్వడంతో పాటు ఉమ్మడి అనంత జిల్లాకు సాగు, తాగునీటి అవసరాలను తీర్చుకునే వీలుంటుంది.
మడకశిర బ్రాంచి కాలువ, భవిష్యత్తులో చేపట్టబోయే జీడిపల్లి-పేరూరు, జీడిపల్లి-భైరవానితిప్ప ప్రాజెక్టులకు జలాలను మళ్లించవచ్చు. హంద్రీనీవా నుంచి పీఏబీఆర్‌కు నీటిని మళ్లించి ఉరవకొండ, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లోని 42 చెరువులను నింపవచ్చు. పీఏబీఆర్ నుంచి ఎంపీఆర్‌కు నీటిని తరలించి శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల అవసరాలను తీర్చడానికి మార్గం సుగమం కానుంది.

**లైనింగ్ కోసం..**

ఎక్కడి నుంచి ఎక్కడి వరకు: జీడిపలి నుంచి పుంగనూరు బ్రాంచి కెనాల్ ఆఫ్‌టేక్ దాకా
వ్యయం: రూ.936 కోట్లు
ప్యాకేజీలు: 5
ప్రస్తుతం: అవసరమైన యంత్రాలు, సామగ్రి సమకూర్చుకున్నారు. 64 పొక్లెయిన్లు పనిచేస్తున్నాయి.
కాలువ తీరు, పనులు ఇలా..
నంద్యాల జిల్లా మల్యాల నుంచి జీడిపల్లి వరకు ప్రధాన కాలువ: 216 కి.మీ.
విస్తరణకు వ్యయం చేయనుంది: రూ.696 కోట్లు
రెండు ప్యాకేజీలు : 0 నుంచి 88 కి.మీ వరకు ఒకటి.. మరొకటి 88-216 కి.మీ వరకు
ప్రస్తుతం పనులు: 37 పొక్లెయిన్‌లు పనిచేస్తున్నాయి. ప్రధాన కాలువలో అక్కడక్కడ నిలిచిపోయిన నీటిని తోడేస్తున్నారు. దారుల్ని వెడల్పు చేస్తున్నారు. జూన్‌లో పూర్తి చేయిస్తాం: రాజా స్వరూప్, ఎస్‌ఈ, హంద్రీనీవావచ్చే జూన్ 10 నాటికి పనుల్ని పూర్తిచేసి నీటి సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందించాం. నిధుల సమస్య లేకపోవడంతో లక్ష్యాన్ని చేరుకుంటామనే ధీమాతో ఉన్నాం.

# వనితలు.. ఆరోగ్యమణులు!



పుట్టపర్తి : మనం తినే కాయగూరల్లో రసాయనిక ఎరువులు, పురుగు మందుల అవశేషాలు పుష్కలంగా ఉండటంతో ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నాయి. మరోపక్క మార్కెట్‌లో వాటి ధరలు కూడా మండిపోతున్నాయి. డబ్బులు పోసి అనారోగ్యం కొంటున్నామా..? అన్న ప్రశ్న కొందరు మహిళల మెదడులో మొలిచింది. అంతే పెరటి తోటల సాగుపై ఆసక్తి పెంచుకున్నారు. ఉన్న కాస్త స్థలంలో తమ ఇంటికి నిత్యం అవసరమయ్యే కాయగూరలను పండిస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో పండించిన వాటితో ఆరోగ్యం.. ఆదాయం పొందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పెరటి తోటలు సాగు చేస్తూ సత్ఫలితాలు పొందుతున్న మహిళలపై కథనం.

**పని ఒత్తిడి దూరం**

పుట్టపర్తిలోని చిన్నంపల్లి పాఠశాల వద్ద నివాసం ఉండే లలిత స్టాఫ్ నర్స్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నిత్యం పని ఒత్తిడితో ఉండే ఆమె పెరటి తోటకు అరగంట కేటాయిస్తే ఒత్తిడి మాయమవుతుందని భావించి తన ఇంటి ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో టమాటా, మిరప, వంకాయ, చిక్కుడు, గుమ్మడి, కొత్తిమీర, మెంతి, తోటకూర, అరటి, జామ, సీతాఫలం, బొప్పాయి చెట్లు పెంచారు. వాటిని ఇంటి అవసరాలకు ఉపయోగించడమేకాకుండా పొరుగింటి వారికి కూడా అందిస్తున్నారామె. 'పెరట్లో మనం పండించే కూరగాయలు, ఆకుకూరలు ఎప్పటికప్పుడు తాజాగా తెంచుకుని వడుకుని తింటే ఆరోగ్యానికి ఆరోగ్యం.. రుచికి రుచి ఉంటుంది. కాయగూరల ఖర్చు తగ్గుతుంది. పొరుగు వారికి కూడా వాటిని ఇస్తుంటే ఆ ఆనందమే వేరు.' అని లలిత పేర్కొంటున్నారు.

**ఆదాయం గడిస్తూ..**

కళ్యాణదుర్గం మండలం మల్లాపురం చెందిన ఎర్రమ్మ కూలీ పనులకు వెళ్తూనే తన ఇంటి ఆవరణలో ఖాళీగా ఉన్న సెంటు స్థలంలో బొప్పాయి, కొబ్బరి, నిమ్మ, మునగ, గులాబీ, కనకాంబరాలు, మల్లె, ఆకుకూరలు, కూరగాయలు మొక్కలు పెచుతున్నారు. రోజు విడిచి రోజు కాయగూరలను కోసి.. కుటుంబ అవసరాలకు వినియోగిస్తున్నారు. మిగిలినవి ఇరుగుపొరుగు వారికి విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. పెరటి తోటతో ఆదాయం వస్తోందని ఎర్రమ్మ పేర్కొంటున్నారు.

**ఇంటి పరిసరాల్లో ఆహ్లాదానికి..**తాడిపత్రిలోని సంజీవనగర్‌కు చెందిన శివశంకర్‌రెడ్డి, ఆదిలక్ష్మీదేవి దంపతులు. ఆయన విద్యుత్తు శాఖ ఉద్యోగి. ఆమె చీరల వ్యాపారం చేస్తున్నారు. ఆమె తీరిక చూసుకుని పెరటి తోట సాగు చేపట్టారు. మామిడి, అరటి బొప్పాయి, దానిమ్మ, సపోట చెట్లు.. మిరప, టమాట, వంకాయ, కాకర, బీర, ఆకు కూరలు, పూల మొక్కలు పెంచుతున్నారు. ఇంట్లో ఉన్న స్థలంతోపాటు.. ప్లాస్టిక్ డబ్బాలు, నీళ్ల సీసాలు, బకెట్లు వంటివి కుండీలుగా మార్చి అందులో వాటిని పెంచుతుండటం అందరినీ ఆకట్టుకుంటోంది. పరిసరాలు ఆహ్లాదంగా ఉండటంతోపాటు ఇంటి అవసరాలు తీరుతాయని వాటిని పెంచుతున్నట్లు ఆదిలక్ష్మీదేవి చెబుతున్నారు. పండ్లు, కాయగూరల కొనుగోల ఖర్చు తగ్గిందని పేర్కొంటున్నారు.

# ఒకటికి.. రెంటికీ ఇబ్బందే..!



పుట్టపర్తి : సత్యసాయి మహాసమాధి దర్శనార్థం వచ్చే భక్తులు, పర్యాటకులు, పట్టణ ప్రజలు.. జిల్లా కార్యాలయాలకు వచ్చే సందర్శకులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి పుట్టపర్తిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు ప్రజా మరుగుదొడ్ల నిర్వహణను గాలికొదిలేశారు. ఫిబ్రవరి 15న మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి.. ఐదు రోజుల్లో పట్టణ పరిధిలోని సామూహిక మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. నేటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు వాటికి తాళం తీయలేదు.. శుభ్రం చేయలేదు. నీటి సౌకర్యం కల్పించలేదు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న, జిల్లా అధికారులు, పాలకులు మూతపడిన వాటిని వినియోగంలోకి తీసుకురావడంపై చొరవ చూపడంలేదు. చిత్రావతినదిలో స్నానమాచరించేందుకు భక్తులు, పర్యాటకులు, ప్రజల సౌకర్యార్థం నది ఒడ్డున మరుగుదొడ్లు నిర్మించారు. దాని నిర్వహణను గాలికి వదిలేసి, తాళం వేశారు. భక్తులు, ప్రజలు నది ఒడ్డున కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.
పట్టణంలోని గోకులం వద్ద నిర్మించి మరుగుదొడ్లు.. ప్రభుత్వ కార్యాలయాల సందర్శకులకు, ఆర్టీసీ సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా ఉండేది. దానికి తాళం వేయడంతో వారు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు, ఎనుములపల్లి చెరువు తదితర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లకు రెండేళ్లుగా తాళం తీయలేదు. : సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వచ్చే రోగులు, ప్రజల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లకు ఏడేళ్లుగా తాళం తీసిన దాఖలాలు లేవు. ఆసుపత్రి వచ్చే రోగులు, వారి సహాయకులు ఆరుబయట కాలకృత్యాలు తీర్చుకునే దుస్థితి ఏర్పడుతోంది.
వినియోగంలోకి తీసుకొస్తాం : ప్రహ్లాద, కమిషనర్, పుట్టపర్తి
మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు సామూహిక మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నీరు, విద్యుత్తు సరఫరా ఏర్పాటు చేస్తాం. ప్రజలకు ఇబ్బందులు తొలగిస్తాం.

# అక్రమాల లోతెంత?

విశాఖపట్నం: భీమిలి వద్ద తీరంలో వైకాపా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి సాగించిన అక్రమాల లోతులను అధికారులు పరిశీలిస్తున్నారు. సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన కట్టడాలను పూర్తిగా తొలగించి పూర్వస్థితి తీసుకురావాలని హైకోర్టు ఇటీవల ఆదేశించింది. ఈ నేపథ్యంలో పునాది ఎంత లోతు ఉంది? ఎంత ఖర్చు అవుతుంది? అని అంచనా వేయడానికి నిర్ణయించుకున్నారు. రెండు రోజుల కిందట మనుషులతో పునాదుల వద్ద సమాంతరంగా తవ్వి లోతును గుర్తించేందుకు ప్రయత్నించగా సాధ్యపడలేదు. దీంతో బుధవారం జేసీబీతో పునాది పక్కన ఇసుక తవ్వి లోతు పరిశీలించారు. పునాదిని నిర్మించిన తీరు చూసి ప్లానింగ్ అధికారులు ఖంగుతిన్నారు. 588 మీటర్ల పొడవున్న పునాది సుమారు 6-8 అడుగుల్లోతు వరకు ఉంది. అడుగు భాగాన పునాది వెడల్పు 10 అడుగుల మేర ఉంది. కోర్టు ఆదేశాల ప్రకారం ఇదంతా పూర్తిగా తొలగించడానికి రూ.50 లక్షలపైగా ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే



స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీ, ఇతర నిర్మాణాలు కూల్చడానికి రూ.4లక్షలు ఖర్చు అయినట్లు జీవీఎంసీ అధికారులు తెలిపారు. కట్టడాలు కూల్చడానికి పెట్టిన ఖర్చు నేహారెడ్డికి చెందిన అవ్యాన్ సంస్థ నుంచి వసూలు చేయాలని కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

**నక్షత్రాల హొటల్‌కేనా?:** విజయసాయిరెడ్డి కుమార్తె భీమిలి తీరాన్ని ఆనుకుని అవ్యాన్ ఎల్‌ఎల్‌పీ సంస్థ పేరిట ఉన్న స్థలంలో భారీ నిర్మాణం చేపట్టడానికి ప్రణాళికలు చేశారు. సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘన అంశం తెరపైకి వచ్చిన సమయంలో ఐదు నక్షత్రాల హొటల్ నిర్మాణం కోసమే శాశ్వత కట్టడాలు చేపడుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం సముద్రానికి దగ్గరిగా నిర్మించిన ప్రహరీ పునాదులు పరిశీలించగా.. అడుగున పది అడుగుల మేర వెడల్పుతో కాంక్రీట్ పర్చడం హొటల్ కోసమేనని స్పష్టమవుతోందని పలువురు భావిస్తున్నారు.
17న పరిశీలన: తీరంలో శాశ్వత కట్టడాలను కూల్చడానికి అయ్యే ఖర్చుతోపాటు, నిర్మాణాల వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని అధ్యయనం చేసేందుకు కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ అధికారులతో నిపుణుల కమిటీతో అంచనా వేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నిపుణులు కమిటీలో అధికారి ఈనెల 17వ తేదీన పరిశీలించే అవకాశం ఉంది. పర్యావరణానికి జరిగిన నష్టం అంచనా వేసి కోర్టుకు చెప్పాల్సి ఉండటంతో కేసు వాయిదాకు ముందే ఈ తనిఖీ పూర్తి చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులకు కోర్టు నిర్దేశం చేసింది. అయితే ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.

# సొంతింటి కలకు కొండంత అండ

నక్కపల్లి : సొంత గూడు ఉండాలని ప్రతి కుటుంబం కోరుకుంటుంది. గడిచిన వైకాపా పాలనలో జగనన్న ఇళ్ల పేరిట ఆర్భాటంగా మొదలు పెట్టిన గృహ నిర్మాణాలకు సరైన సహకారం అందించక పోవడంతో అవన్నీ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందాన ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తి నిర్మాణాలను కొనసాగించేలా తీపికబురు చెప్పింది. లబ్ధిదారుల్లో వెనుకబడిన వర్గాలకు అదనపు ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించింది. దీని ద్వారా అనకాపల్లి జిల్లాలో వేలాదిమందికి మేలు జరగనుంది.అయిదేళ్ల పాలనలో జిల్లాలో 61 వేలకు పైగా ఇళ్లను మంజూరు చేశారు. దీనికి కేవలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం రూ. 1.8 లక్షలు అమలు చేస్తూ, జగన్ పేరును ప్రచారం చేసుకున్నారు. కాగా ధరాభారం, ప్రోత్సాహం లేకపోవడంతో చాలామంది ఇళ్లను నిర్మించుకోలేక పోయారు. జగన్ అధికారం కోల్పోయేనాటికి అసలు ప్రారంభం కానివి, వివిధ స్థాయిల్లో ఆపేసినవి సుమారు 40 వేలకు వరకు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఆసక్తి ఉన్న లబ్ధిదారులను గుర్తించి గడిచిన రెండు నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ పెట్టి చాలా ఇళ్లను పూర్తిచేయించగా, జిల్లాలో సుమారు 5500 వరకు ఉన్నాయి. ప్రస్తుతం మరో ఏడువేల ఇళ్లను పూర్తి చేయించే పనిలో ఉన్నారు. ఇవన్నీ పోనూ మిగిలిన వాటిలో దాదాపు బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల వారు ఎక్కువగా ఉండటంతో వీరందరికీ అండగా నిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. ఈ క్రమంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, చేనేత వర్గాలకు అదనపు ఆర్థిక సాయం చేయనుంది. ఆ మేరకు జిల్లా పరిధిలో దాదాపు 26,800 ఇళ్లను నిర్మించాల్సి ఉంది. ఇందులో ఓసీలు సుమారు 5800 మంది ఉన్నారు. ఇవి మినహాయిస్తే, దాదాపు 21 వేల మందికి మేలు జరగనుంది. ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం ఇలాంటి వివరాలను సేకరించే పనిలో పడింది.

**సాయం ఇలా..**

ఎస్సీ, బీసీ, చేనేతలకు: రూ. 50 వేలుఎస్టీలు: రూ. 75 వేలు
ఎస్టీల్లో బాగా వెనుకబడిన వారికి: రూ. లక్షజిల్లాలో ఇళ్ల పరిస్థితి ఇది
మొత్తం ఇళ్లు: 61,505పూర్తయినవి: 26,699ప్రారంభం కానివి: 17,559వివిధ దశల్లో నిలిచినవి: 17,247

**సద్వినియోగం చేసుకోండి**

అదనపు ఆర్థిక సహాయం వినియోగించుకుని ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. ప్రస్తుత యూనిట్ విలువ రూ.1.80 లక్షలు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పీవీటీజీలకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం అందిస్తుందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 17,749 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. వీటిలో ఎస్సీ, ఎస్టీ బీసీలకు చెందిన 13,548 మంది లబ్ధిదారులకు రూ.70.04 కోట్ల అదనపు ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. జిల్లాలో మే చివరినాటికి 13,687 గృహాలు పూర్తి చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించుకున్నామన్నారు.

## కట్ట.. ఆక్రమణల పుట్ట..

ఏర్పేడు : చెరువులే కాదు వాటి కట్టల రూపురేఖలూ మార్చేసి ఆక్రమించేస్తున్నారు. ఏర్పేడు మండలం వికృతమాల చెరువును ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాకు ఏళ్లుగా ప్రయత్నాలు సాగుతున్నాయి. తాజాగా చెరువును ఆనుకుని ఉన్న స్థలంతో పాటు కట్టను తవ్వేసి ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు.

**మీనమేషాలు లెక్కిస్తున్నారు**

రేణిగుంట, ఏర్పేడు రెవెన్యూ అధికారులు ఇది తమ పరిధి కాదంటూ ఆక్రమణలపై చర్యలకు మీనమేషాలు లెక్కించడం విమర్శలకు తావిస్తోంది. ఇక్కడి స్థలం కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలంటూ గ్రామస్థులు కోరుతున్నారు.



**ఆక్రమిత స్థలం.. రూ.కోట్లలోనే..**

ఆక్రమిత స్థలం ఓ వైపు ఏర్పేడు మండలం వికృతమాలకు చెందినదైతే.. మరోవైపు రేణిగుంట మండలం జీపాళెంకు కిందకు వస్తుంది. ఇక్కడున్న ఆరెకరాల ప్రభుత్వ స్థలానికి సమీపంలోనే టిడ్కో ఇళ్ల సముదాయం ఉండటం, బీసీ కాలనీ దగ్గర కావడంతో ఎలాగైనా భూమిని సొంతం చేసుకోవాలని చూస్తున్నారు. కబ్జారాయుళ్లు రాత్రి వేళల్లో మాత్రమే పనులు చేపడుతున్నారు. చెరువు స్థలంతో పాటు కట్ట రూపురేఖలు మార్చేయడంతో పనులు నిలిపేయాలని స్థానికులు అభ్యంతరం తెలిపారు. **పరిశీలించి.. చర్యలు తీసుకుంటాం..- భార్గవి, తహసీల్దార్, ఏర్పేడు మండలం** ఆక్రమిత స్థలం ఏ మండలం కిందకు వస్తుందన్నది పరిశీలించాలి. ఏర్పేడు మండల పరిధిలోది అయితే ఆక్రమణలకు వీల్లేకుండా చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం.

## పట్టాల సృష్టి.. సర్కారు దృష్టి

విశాఖ :జగనన్న కాలనీల్లో వైకాపా నాయకులు అక్రమాలు తవ్వేకొద్దీ బయట పడుతున్నాయి. 2020 డిసెంబరులో ఇంటి పట్టాలు పంపిణీ చేపట్టారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికే పట్టాలు ఇచ్చామని చెప్పినా వీరిలో పలువురు వైకాపా నాయకులు, వారి అనుచరులే ఉన్నారు. కొందరు తమ స్థలాలను అమ్మకాలు చేశారు. దీనిపై నిరుపేదలు ఆందోళనలు చేశారు. పేదల ముసుగులో కొందరు నాయకులు పట్టాలు పొంది కాలనీల్లో భవంతులు నిర్మించారు. కొన్ని చోట్ల నిరుపేదల నుంచి కారుచౌకగా పట్టాలు కొనుగోలు చేసి వాటిని అధిక ధరలకు అమ్మేశారు. ఈ అక్రమాలు నిగ్గుతేల్చాలని కూటమి సర్కార్ నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బందిని పంపించి అనర్హుల జాబితా సిద్ధం చేసి ఏరివేతకు రంగం సిద్ధం చేసింది.

జిల్లాలో 704 జగన్న కాలనీల్లో 56వేల మందికి పట్టాలు పంపిణీ చేశారు. 33,155 మందికిపైగా లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. అయితే 20వేలకు పైగా నకిలీ పట్టాలు పుట్టుకొచ్చాయి.



ఒక్కో పట్టాను రూ.20 వేల నుంచి రూ.30 వేలకు అమ్మడం విశేషం. కట్టిన ఇళ్లను రూ.15 లక్షలకు విక్రయించారు. అనకాపల్లి, మునగపాక, పాయకరావుపేట, ఎలమంచిలి, నర్సీపట్నం తదితర మండలాల్లోని లేఅవుట్‌లలో ఎక్కువగా అమ్మకాలు జరిగాయి.

**15లోగా పునః పరిశీలించాలి:** కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీల్లో మంజూరు చేసిన ఇంటి పట్టాలను పునః పరిశీలించాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో కాలనీల్లో లబ్ధిదారులు ముసుగులో ఉన్న అక్రమార్కులు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. పరిశీలనకు తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్లతో బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 10 నుంచి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కాలనీల్లో లబ్ధిదారుల వివరాలు సేకరించాలి. ప్రత్యేక మొబైల్ యాప్‌లో ఎప్పటిప్పుడు వివరాలను నమోదు చేయాలి. ఈ నెల 15లోగా వివరాలు ఇవ్వాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## ఫలించే.. సాగరమ'ధనం'

విశాఖ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం గడువు దగ్గరవుతున్న నేపథ్యంలో జిల్లాలో మత్స్యశాఖ నిర్దేశించిన లక్ష్యం సాధించే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. మొత్తం దిగుబడుల్లో సముద్ర ఉత్పత్తులే అధికంగా ఉంటున్నాయి.జిల్లాలో 1,02,246 మెట్రిక్ టన్నుల మత్స్య ఉత్పత్తులు లక్ష్యం కాగా, జనవరి నెలాఖరు నాటికి 1,04,569 టన్నుల దిగుబడులు వచ్చాయి. విశాఖలో లభ్యమవుతున్న సముద్ర ఉత్పత్తుల్లో అధిక శాతం రొయ్యలు, ట్యూనా రకం చేపలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. కొన్ని రకాల రొయ్యలతో పాటు వివిధ రకాల చేపలు దేశంలోని ముంబయి, హైదరాబాద్, కోల్‌కతా, ఢిల్లీ తదితర నగరాలకు తరలివెళ్తున్నాయి. ఈ ఆర్థిక ఏడాది ప్రారంభంలో వాతావరణం అనుకూలించక పలుమార్లు వేటకు అంతరాయం ఏర్పడి నా... రెండు నెలల నుంచి అంతా సవ్యంగా ఉండడంతో భారీ దిగుబడులు సాధ్యమవుతున్నాయని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు.ఏప్రిల్ 15 వరకు: ఇప్పటి వరకు లభ్యమైన మత్స్యసంపద విలువ రూ.వెయ్యి కోట్లకుపైగా ఉంటుందని అంచనా. ఏటా జూన్ 15న సముద్ర జలాల్లో చేపల వేట ప్రారంభమై ఏప్రిల్ 15న ముగుస్తుంది. ఏప్రిల్ 16 నుంచి జూన్ 14 వరకు చేపల వేట పూర్తిగా నిలిపేస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆశాజనకంగా ఉండడంతో రానున్న రెండు నెలల్లో మరిన్ని దిగుబడులు వచ్చే అవకాశం ఉందని ఆయా వర్గాలు భావిస్తున్నాయి. **వేటకు ప్రోత్సాహం..:** మత్స్యకారులకు కూటమి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ, చేపల వేటను ప్రోత్సహిస్తున్నాం. వేటకు వెళ్లే బోట్లకు ఉచితంగా ట్రాన్స్పాండర్లను అందిస్తున్నాం. ఆ పరికరం విలువ రూ.38 వేలు ఉంటుంది. ఇప్పటి వరకు 586 బోట్లకు అందించాం. వాటి సాయంతో వెళ్లిన బోటు ఆచూకీ తెలుసుకునే వీలుంటుంది.

# ఆరోగ్యం 'ఉక్కు'రి బిక్కిరి..




విశాఖ : విశాఖ ఉక్కు కర్మాగారంలో పనిచేస్తున్న వేలమంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య అవసరాలు తీర్చడంలో ఒకప్పుడు తన ప్రత్యేకత చాటుకున్న స్టీల్ జనరల్ ఆసుపత్రి నేడు ఆ స్థాయిలో సేవలు అందించలేక పోతోంది. చాలామంది వైద్యులు, సిబ్బంది పదవీ విరమణ చేస్తున్నా తిరిగి భర్తీ జరగడం లేదు. కీలకమైన బర్న్ యూనిట్ మూతపడింది.

ఉక్కు యాజమాన్యం కార్మికుల వైద్య సేవలను దృష్టిలో పెట్టుకొని స్టీల్ జనరల్ ఆసుపత్రిని 1984లో 60 ఎకరాల్లో ప్రారంభించారు. 1991 నాటికి 160 పడకలకు విస్తరించారు. ఈ ఆసుపత్రిలో కేవలం ఉక్కు కార్మికులు వారి కుటుంబ సభ్యులకే కాకుండా సీఐఎస్ఎఫ్, ఉక్కునగరం పాఠశాలల సిబ్బందికి కూడా వైద్య సేవలు పొందేందుకు అవకాశం ఉంది. సుమారు 18 వేల మంది దీని పరిధిలోకి వచ్చేలా ఆసుపత్రి తీర్చిదిద్దారు.

**మందుల కొరత:** ఆసుపత్రిలో మందుల కొరత కూడా వేధిస్తోంది. 'నాట్ అవైలబుల్ అంటూ' చీటి మీద రాసి బయట కొనుక్కోమని చెప్తున్నారు. దీంతో బయట కొనుగోలు చేసిన ఉద్యోగులు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఓ ప్రముఖ మందుల దుకాణం ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసి ఆ దుకాణదారునకు నేరుగా యాజమాన్యం బిల్లులు చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఆసుపత్రి నిర్వహణ, జీతాలు, మందులు, నిర్వహణ, అంబులెన్స్‌ల కోసం గతంలో సుమారు రూ. 75 కోట్లు వ్యయం చేసేవారు. ప్రస్తుతం దానిని రూ. 35 కోట్లకు కుదించినట్లు సమాచారం. అది వైద్య సేవలపై ప్రభావం చూపుతోంది.

**ప్రమాదాలు జరిగితే...**

ఉక్కు ఆసుపత్రిలో ప్రధానంగా ఉండాల్సింది బర్న్ యూనిట్ అయినా.. అది మూతపడింది. కార్మికులు 1700 డిగ్రీలకు పైగా వేడి వద్ద పనిచేస్తుంటారు. తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. గతంలో ఆసియాలోనే మొదటిస్థానంలో నిలిచిన బర్న్ యూనిట్ ప్లాస్టిక్ సర్జన్లు లేని కారణంగా మూతపడింది. దీంతో ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను ప్రైవేటు ఆసుపత్రులకు పంపించేస్తున్నారు.

**వైద్యుల కొరత..**

1 వైద్యులు, పారామెడికల్ సిబ్బందిలో సుమారు 50 శాతం ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానాలు భర్తీ కావడం లేదు.

2 వైద్యులు 105 మంది ఉండేవారు. ప్రస్తుతం 53 మంది మెడికల్ ఆఫీసర్లు, 1 స్పెషలిస్టు, ఇద్దరు సర్జన్లు మాత్రమే ఉన్నారు. వారిలో ఒకరు ఈ మే నెలలో ఉద్యోగ విరమణ చేయనున్నారు.

3 నేత్ర వైద్యులు లేరు. నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది మొత్తం 380 ఉండేవారు. ప్రస్తుతం 220 మంది మాత్రమే పని చేస్తున్నారు.

4 గుండె సంబంధ సమస్యలు గుర్తించేందుకు ఉపయోగించే టీఎంటీ (ట్రెడ్ మిల్) పరికరం పనిచేయడం లేదు. 3 ఎక్స్‌రే యంత్రాలకు గాను కేవలం ఒక్కటి మాత్రమే పనిచేస్తుంది. 5 వైద్యుల కొరతను అధిగమించేందుకు ఇటీవల కేవలం 10 మంది వైద్యులను తాత్కాలిక విధానంలో చేర్చుకునేందుకు ప్రకటన జారీ చేశారు.

# మన్ను దోపిడీ మొదలై'నది'



నందికొట్కూరు : శ్రీశైలం జలాశయంలో వే'గంగా'నీటి మట్టం తగ్గుతోంది.. వెనుక జలాలు తగ్గడంతో ముంపు భూములు తేలుతున్నాయి.. వాటిలో విలువైన మట్టి ఉండటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. భారీ యంత్రాలతో నదీ గర్భాన్ని తోడేస్తున్నారు.. నందికొట్కూరు మండలంలోని శాతనకోట, జంగంపాడు, మల్యాల, పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి, నెహ్రూనగర్, జూపాడుబంగ్లా మండలంలోని చాబోలు, కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం, బలపాలతిప్ప, జానాలగూడెం గ్రామాలు కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో మట్టి తవ్వకాలతో పాటుగా అక్రమ ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.

**ఇసుకపైనా కన్నేశారు**

నందికొట్కూరు మండలం జంగంపాడు, శాతనకోట, మల్యాల, బిజినవేముల గ్రామాల సమీపాన కృష్ణానదిలో ఇసుక నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం నదిలో జలాలు తగ్గుముఖం పట్టడంతో అక్రమార్కులు వెళ్లి తవ్వకాలకు అనువైన స్థలాలను గుర్తించి హద్దులు పాతారు. తెదేపా పాలనలో శాతనకోట సమీపంలో ఇసు రీచ్ నిర్వహించే వారు. గత వైకాపా పాలనలో అక్రమార్కులు నదిలోకి చొరబడి ఇష్టానుసారం తవ్వి పెద్దఎత్తున ఇసుక నిల్వ చేసుకుని బహిరంగ విక్రయాలు సాగించారు. 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించాలని స్థానికులు విన్నవిస్తున్నారు.

**దారిమళ్లిస్తున్నారు** పాములపాడులో కొనసాగుతున్న జాతీయ రహదారి 340సీ నిర్మాణానికి చెలిమిల్ల- మాడుగుల గ్రామాల మధ్య ఉన్న ఓ రైతు పొలంలో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. నెల రోజులుగా సుమారు 6 ఎకరాల్లో మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. సంబంధిత రైతును అడిగితే తాను పొలాన్ని విక్రయించానని, తవ్వకాలతో తనకు సంబంధం లేదని చెబుతున్నారు. మట్టిని తవ్వి తరలించాలంటే రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలి. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తమకు తెలియదని చెప్పడం గమనార్హం.

**మేటలు మేస్తున్నారు**

నదిలో మేటలు వేసిన సారవంతమైన నల్లరేగడి మట్టికి ఎక్కువ డిమాండ్ ఉంది. దూరాన్ని బట్టి ట్రిప్పు మట్టి రూ.1500 నుంచి విక్రయిస్తున్నారు. దీనిని పొలాల్లో వేసుకుని పంటలకు ఎరువులు వేయాల్సిన అవసరం ఉండకపోవడంతో చాలామంది రైతులు దీని కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. ఇదే అదనుగా అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు సాగిస్తున్నారు. ఇంటి నిర్మాణం కోసమని చెప్పి పక్కదారి పట్టిస్తున్నారు. కొత్తపల్లి మండలం చిన్నగుమ్మడాపురం సమీపంలో మట్టి తవ్వి తరలిస్తున్నారు.

# రూ.150 కోట్ల మాన్యం అక్రమార్కులకు నైవేద్యం

నంద్యాల : అక్రమార్కుల అత్యాశకు ఆలయ మాన్యాలు కర్పూరంలా కరిగిపోతున్నాయి. బేతంచెర్లలో ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి, మాధవస్వామి, గట్ల నరసింహస్వామి సముదాయ ఆలయాలకు వందలాది ఎకరాల మాన్యం ఉంది. బేతంచెర్ల మున్సిపాల్టీతో పాటు ఆర్.ఎస్.రంగాపురంలోని భూములు 20 ఏళ్లుగా ఆక్రమణలకు గురవుతున్నాయి. ఇప్పటికే బేతంచెర్ల పట్టణంలో 168.29 ఎకరాలు, ఆర్.ఎస్.రంగాపురంలో 17.17 ఎకరాలు పరాధీనమైంది. రాజకీయ పార్టీల నాయకులతో పాటు వ్యాపారులు, గుత్తేదారులు, ఇతరులు ఇష్టానుసారం కబ్జా చేశారు. ఆక్రమణలకు గురైన భూమిలో కొంత ఇప్పటి వరకు మాన్యం భూములే అని చెబుతున్నా అధికారులు వాటిని స్వాధీనం చేసుకొనే ప్రయత్నాలు చేయకపోవడం గమనార్హం.

**దస్త్రాలనే మార్చేశారు**

సముదాయ ఆలయాలకు సంబంధించిన మాన్యంలో బట్రాజులకు 13.09, నర్తకిలకు 69.02, భజంత్రీలకు 78.83, గౌరి మాన్యం 7.34 ఎకరాలు కేటాయించారు. వీరు ఆయా భూములను అనుభవించడానికి మాత్రమే అవకాశం కల్పించారు. అక్రమార్కులు రంగ ప్రవేశం చేసి మొత్తం 168.29 ఎకరాల భూమిని ఆక్రమించారు. కొంతమంది దస్త్రాలను మార్చి రెవెన్యూ దస్త్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. మరికొందరు ఆలయ దస్త్రాల్లో తమ పేరు లేకున్నాసరే దర్జాగా భూములు అనుభవిస్తున్నారు. కొందరైతే ఏకంగా మాన్యం భూములను ఆక్రమించి ఇతరులకు విక్రయించారు.

**పరాధీనమైన భూములివే**

సర్వే నంబరు 23-7-34లో ఉన్న భూమిని జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తీసుకున్నా ఇంత వరకు నష్ట పరిహారం అందలేదు.

సర్వే నంబరు 175లో ఉన్న 8 ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది.



సర్వే నంబరు 235లోని 2.36 ఎకరాల బట్రాజుల మాన్యాన్ని ఇతరులు కబ్జా చేశారు.సర్వే నంబర్లు 293లో 6.10 ఎకరాలు, 306లో 0.97, 334లో 0.32, 338లో 4.06, 393లో 3.54, 543లో 13.60, 545లో 2.12, 640లో 15.35, 646లో 6.74, 6.98లో 4.10, 780లో 12.16, 872లో 8.07, 878లో 8.92, 903లో 9.93, 911లో 17.90, 1004లో 4.60, 22లో 11.83, 49లో 8.80, 612లో 14.35, సర్వే నంబరు 186లో 5.36 ఎకరాల భూమి ఆక్రమణలు గురైంది.ఆర్.ఎస్.రంగాపురంలో సర్వే నంబరు 810లోని 23.35 ఎకరాల ఆంజనేయస్వామి ఆలయ మాన్యం ఉంది. ఇందులో 19.35 ఎకరాలు అన్యాక్రాంతమైంది.

**అధికారులు చేతులెత్తేశారు**

అక్కడ బహిరంగ విపణిలో ఎకరం రూ.కోటిపైనే ధర పలుకుతోంది. సెంటు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు విక్రయిస్తున్నారు. ఆర్.రంగాపురంలో ఉన్న భూమి ఎకరం ధర రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు విలువ చేస్తుంది. మొత్తం మాన్యం విలువ రూ.150 కోట్లకు పైగానే ఉంటుంది. ఇంతటి విలువైన భూమిని ఆక్రమిస్తున్నా ఆలయ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# 5ఏళ్ల అలసత్వం.. రూ.100 కోట్ల భారం

కర్నూలు : పట్టణ ప్రజలు 30 ఏళ్ల వరకు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవద్దన్న ఉద్దేశంతో తెదేపా హయాంలో రూ.593 కోట్లతో ప్రాజెక్టుకు పునాది వేశారు. ఐదేళ్ల అధికారంలో ఉన్న వైపాకా ఆయా పథకాలను 'నీరు'గార్చింది. ఇప్పుడు వాటిని పూర్తి చేయాలంటే రూ.100 కోట్ల వరకు అదనంగా వెచ్చించాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.లక్షలోపు జనాభా ఉన్న పట్టణాల్లో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఉద్దేశంతో తెదేపా హయాంలో పనులకు శ్రీకారం చుట్టారు.

జలాశయాల నుంచి పైపులైన్లు వేసి, అధునాతన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్లను (ఇ.ఎల్.ఎస్.ఆర్.) నిర్మించి, పట్టణ వ్యాప్తంగా పైపులైను వ్యవస్థ ఉండేలా ప్రణాళిక రూపొందించారు.ప్రాజెక్టు వ్యయంలో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు సమకూర్చాలని ఒప్పందం చేసుకున్నారు. అప్పట్లోనే దాదాపు 25 శాతం పనులు పూర్తయ్యాయి. జగన్ ప్రభుత్వం వాటా సరిగా విడుదల చేయలేదు.



**ఎండుతున్న పుర గొంతులు**

చదువు.. ఉద్యోగం.. ఉపాధి ఇలా అవసరం ఏదైనా పల్లె జనం పట్టణ బాట పడుతోంది. ప్రస్తుతం అందుతున్న నీరు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. గూడూరులో ట్యాంకు, పైపులైన్లు, ఫిల్టర్ బెడ్ల పనులు చేపట్టకుండా మధ్యలోనే వదిలేశారు. 35 వేల జనాభాకు సరిపడా నీరు సక్రమంగా రాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ఎమ్మిగనూరు పట్టణంలో ట్యాంకుల నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. పట్టణంలో న్యూ ఎస్సీ, క్రాంతినగర్, హరిజనవాడ, ఉసేనప్ప కొట్టాల, గణేశ్ కాలనీ, శివన్ననగర్, సాయినగర్, మిలటరీ, నక్కరామయ్య కొట్టాల, హనుమాన్, ముగతిపేట, ఎన్టీఆర్ కాలనీ, యల్లమ్మ బీడు, ఓల్డ్ ఎస్సీ కాలనీ, శాంతినగర్, సోగనూరు రోడ్డు ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది.

ఆత్మకూరు పట్టణంలో ఖల్లావీధి, నీలితొట్ల వీధి, ఇస్లాంపేట, కొత్తపేట, వడ్లపేట, పెద్దబజారు, సంత మార్కెట్ ప్రాంతం, ఆర్డీటీ కాలనీ, స్వరాజ్‌నగర్, అర్బన్ కాలనీ, ఏరాసు అయ్యపురెడ్డినగర్, వెంగళరెడ్డినగర్‌లో నీటి కష్టాలు ఎక్కువయ్యాయి.


## ఇంటి పట్టా.. అనర్హుల పుట్ట

కర్నూలు : పేదలందరికీ ఇల్లు.. ఇళ్లు కాదూ ఊళ్లు నిర్మిస్తున్నామని ఐదేళ్లు జగన్నాటకం ఆడారు. పేదల పేరుతో వైకాపా కార్యకర్తలు, వాలంటీర్లు, వారి బంధువులు, సచివాలయ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు 'పట్ట'ం కట్టారు. నగరంలో పాతబస్తీలో నివాసముంటున్న వారికి పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్‌లోని కృష్ణానగర్ ప్రాంతంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేశారంటే ఎంపిక తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. స్థానికేతరులు కొందరు జిల్లా కేంద్రంలో ఉన్నట్లు తప్పుడు చిరునామాలతో పట్టాలు పొందారు. రాజకీయపలుకుబడి ఉన్నవారు పట్టాలు దక్కించుకోగా.. నిరుపేదలకు పథకం ప్రయోజనం చేకూరలేదు. కొన్నిచోట్ల ఇంటి నంబరు, భర్త పేరు, సమగ్ర వివరాలు లేకపోయినా.. ఇళ్లున్నా పట్టాలిచ్చేశారు. ఇలాంటి అక్రమ పట్టాల కథ తేల్చాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు

ఉప తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలు, సర్వేయర్ల బృందం పట్టాలను పరిశీలించాలని భూపరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్లు, జేసీలు ప్రత్యేక డ్రైవ్‌ను పర్యవేక్షిస్తూ ర్యాండమ్‌గా తనిఖీలు చేయాలన్నారు.

ఇందుకు వీఆర్వోల లాగిన్‌తో ప్రత్యేక మొబైల్ యాప్ (హౌస్ సైట్



రీ-వెరిఫికేషన్) అందుబాటులోకి తెచ్చారు.

యాప్‌లో గ్రామం, లేఅవుట్, ఇళ్ల పట్టాలు పొందిన వారి పేర్లు ఉంటాయి. లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ ఐడీ, లబ్ధిదారు పేరు, రిలేషన్ నేమ్, ఆధార్ నంబరు, చరవాణి నంబరు, ప్లాట్ వివరాలు పరిశీలిస్తారు. స్థలం ఖాళీగా ఉందా ? ఇంటి నిర్మాణం జరిగిందా ? ఇళ్ల పట్టాలకు అర్హులేనా వంటి వివరాలన్నీ నమోదు చేస్తారు.

ఇలా లెక్క తేల్చుతారు

బీపీఎల్ కేటగిరీ కానివారు, ఇల్లు లేదా ఇంటి స్థలం ఉన్నవారు, ఇంతకు ముందు గృహనిర్మాణ పథకం వినియోగించుకున్న వారు, వ్యవసాయ భూమి 10 ఎకరాలు ఉన్నా, ఆదాయ పన్ను చెల్లించినా, నాలుగు చక్రాల వాహనాలు కలిగిన ఉన్నా అనర్హులుగా పరిగణిస్తారు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నా, ఒకే కుటుంబంలో ఒకటి కంటే ఎక్కువ ప్లాట్లు కలిగి ఉన్నా, తమప్లాట్‌ను ఇతరులకు విక్రయించినా అనర్హులే అవుతారు ఓర్వకల్లులో పునాదులు, బేస్‌మెంట్ల వరకు ఇళ్ల నిర్మించిన 350 మంది ప్లాట్లను ఒక్కోటి రూ.4-5లక్షలకు విక్రయించేశారు. ఇంటి పట్టా స్థలంలో లబ్ధిదారులు స్థానికంగా లేకపోయినా, అవివాహితుల పేరిట ఉన్నా, మైనర్లకు ఇచ్చినా అనర్హులని అధికారులు చెబుతున్నారు.

## పన్ను వసూళ్లు సగమే..

అనంతపురం: ఆస్తి పన్ను వసూళ్లలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పురపాలికలు పూర్తిగా వెనకబడ్డాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 54 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయి. మార్చి 31 నాటికి అనంతపురం నగర కార్పొరేషన్‌తో పాటు మిగిలిన 11 పురపాలికల్లో రూ.113.72 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా.. ఈనెల 10 నాటికి 62.40 కోట్లే వచ్చింది. అనంతపురం, హిందూపురంలో 50 శాతం మించకపోవడం గమనార్హం. లక్ష్యాన్ని సాధించడానికి 47 రోజులే మిగిలాయి.

**పాత బకాయిలు రూ.129 కోట్లు**



ఉమ్మడి జిల్లాలోని అన్ని పురపాలికలు పాత బకాయిల వసూళ్లలో ఆలసత్వం ప్రదర్శిస్తున్నారు. జరిమానాలతో కలుపుకొని రూ.141.96 కోట్ల బకాయిలు ఉండగా.. ఈ ఏడాది రూ.12.22 కోట్లు వసూలు చేశారు. కోర్టు కేసులు, రైట్‌ఆఫ్‌లు రూ.1.53 కోట్లు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.8.198 కోట్లకు గాను రూ.2.41 కోట్లు వసూలు చేశారు. బకాయిలు, జరిమానాలతో పాటు ఈ ఏడాది ఇంకా వసూలు చేయాల్సినవి కలిపితే పురపాలికల్లో రూ.178.56 కోట్ల మేర ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉంది. **ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నాం- విశ్వనాథ్, మున్సిపల్ ఆర్డీ**గతేడాది అక్టోబరు నుంచి ప్లానింగ్ సెక్రటరీ, మున్సిపల్ అడ్మిన్‌లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆస్తి పన్ను వసూలుపై దృష్టిపెట్టాం. వారానికి ఒకసారి సమీక్షలు నిర్వహించి ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

## కలపను కొల్లగొడుతున్నా పట్టదేం?

కుప్పం : కుప్పంలో కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పచ్చదనాన్ని కాపాడాల్సిన అటవీశాఖ అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. పగలు... రాత్రి తేడా లేకుండా లారీలు.. ట్రాక్టర్ల ద్వారా కలపను రవాణా చేస్తున్నా... అటవీ అధికారులు నోరుమెదపడం లేదని పెదఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**చట్టం ఏం చెబుతుందంటే..**

పట్టా భూమిలో చెట్టు నరకాలంటే సంబంధిత తహసీల్దారు ధ్రువపత్రాన్ని అటవీశాఖ అధికారులకు అందించాలి. అనంతరం మొక్కలు అంచనావేసి కోత అనుమతి కోసం జిల్లా అటవీ అధికారికి నివేదికలు పంపాలి. ఈ రికార్డుల పరిశీలించి అనుమతులివ్వాలి. అలా జిల్లా అధికారులు పర్మిట్ ఇస్తే ఒక్కో టన్ను కలపకు రూ.16,800, లేదా



అందుకు ఐదురెట్లు పెంచి చెల్లించాలని సూచిస్తారు. అది చెల్లిస్తే అనుమతిస్తారు.

**పుట్టగొడుల్లా కలప మండీలు...**

కలప అక్రమ రవాణాను ఆదాయ మార్గంగా ఎంచుకొన్న కొందరు అక్రమార్కులు ఆంధ్రా–తమిళనాడు సరిహద్దు రాష్ట్రం కెంపాపురం, రాజుపేట రోడ్డు, శాంతిపురం, వి.కోట పరిసరాల్లో కలప మండీలను ఏర్పాటు చేసుకొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా పచ్చని చెట్లను కొల్లగొట్టి ఒక్కో టన్నుకు రూ.5 వేల నుంచి రూ.6 వేలు వరకు కొనుగోలుచేస్తున్నారు. ఈ కలపను డీబార్గింగ్(పొట్టుఒలిచి) చేసి లారీల ద్వారా తమిళనాడులోని సేలం, ధర్మపురిలోని పేపరు మిల్లులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారమంతా బహిరంగంగా జరుగుతున్నా... అటవీశాఖ అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపలున్నాయి.

**సీఎం వస్తేనే స్పందిస్తారా..?**

గత నెలలో సీఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన ఖరారైన వెంటనే ముందస్తుగా కలప అక్రమ రవాణా విషయమై తమపై ఎవరైనా నాయకులు ఫిర్యాదు చేస్తారేమోననే భయంతో కుప్పం అటవీశాఖ అధికారులు ఒక్కరోజు మెరుపు దాడిచేశారు. ఏకంగా తొమ్మిది కలప ట్రాక్టర్లు స్వాధీనం చేసుకొని జరిమానాలు కూడా విధించారు. ఇలా... నిత్యం ఎందుకు అటవీశాఖ అధికారులు దాడులు చేయలేకపోతున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**ఊరూ... వాడా వెలసిన ఇటుకబట్టీలు**

కర్ణాటకలో అటవీ అధికారులు కలప నరికివేతపై ఉక్కుపాదం మోపుతారు. దీనివల్ల ఇటుకల తయారీదారులు ఇటుకలను బొగ్గు, వరిపొట్టు, చింతపొట్టుతో కాల్చుతారు. అదే... కుప్పంలో మాత్రం ఇటుకలను కాల్చేందుకు కలప వినియోగిస్తున్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం అంతరించిపోతోందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కిసుక్కుమనని కియోస్క్ యంత్రాలు



పుట్టపర్తి : రైతు సేవ కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల వ్యయంతో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన యంత్రాలు సేవలు అందించకుండా మూలకు చేరాయి. రైతులకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశంతో కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఈ యంత్రం పనిచేయాలంటే అంతర్జాల సౌకర్యం ఉండాలి. గత ప్రభుత్వం యంత్రాలిచ్చిందే తప్ప అంతర్జాల సౌకర్యం కల్పించలేదు. దీంతో సిబ్బందే సొంత నిధులతో ఈ సదుపాయం ఏర్పాటు చేసుకుని సేవలందించారు. తర్వాత చరవాణిలోనే అందుకు సంబంధించిన యాప్ ఉండటంతో యంత్రాలను పట్టించుకోలేదు. ఫలితంగా రైతు సేవా కేంద్రాల్లో నిరుపయోగంగా మారాయి. 50 శాతం మరమ్మతులకు గురికాగా, 30 శాతం గోదాముల్లో పడేశారు. 20 శాతం యంత్రాలు దిష్టిబొమ్మలా దర్శనం ఇస్తున్నాయి. ఎలాంటి ఆలోచన లేకుండా గత పాలకులు, ఉన్నతాధికారులు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారు.

**తొలి ఏడాది వినియోగించినా..**

శ్రీసత్యసాయి జిల్లాలో 2020 జూన్‌లో కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేశారు. తొలి ఏడాదిలో సిబ్బంది సొంత డబ్బులతో ఇంటర్నెట్ రీఛార్జి చేసి వినియోగించారు. వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందితో సంబంధం లేకుండా రైతులే స్వయంగా కేంద్రానికి వెళ్లి, వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, యంత్రాలు, పశుగ్రాసం వంటివి అవసరమైన పరిమాణంలో కియోస్క్‌ల ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఇందుకు అవసరమైన నగదు రైతు చెల్లిస్తే 48 గంటల్లో అందిస్తామని ప్రకటించారు. ఆచరణలో సక్రమంగా అమలు చేయకపోవడంతో యంత్రాలు మూలనపడాయి. వీటిలో 50 శాతానికిపైగా యంత్రాలకు అంతర్జాలం సౌకర్యంతో పాటు, బ్యాటరీలు పనిచేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. అధికారులు, సిబ్బంది వీటిని గాలికి వదిలేశారు.

తలుపుల మండల వ్యాప్తంగా 13 రైతు సేవా కేంద్రాలు ఉండగా 4 కేంద్రాల్లో మూలనపడేశారు. బీ కొత్తచెరువు మండలంలో 16 కేంద్రాలు ఉండగా మీర్జాపురం, పోతులకుంట కేంద్రాల్లో ఏడాదిగా పనిచేయడం లేదు. చాలాచోట్ల వాటిని వినియోగించడం లేదు.

**వినియోగంలోకి తెచ్చేలా చర్యలు- సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి**

రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది చరవాణిలోని యాప్ ద్వారా అవసరమైన సేవలందిస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఉన్న కియోస్క్‌లన్నిటినీ వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

జిల్లాలో మండలాలు: 32
రైతు సేవా కేంద్రాలు: 416
ఏర్పాటు చేసిన కియోస్క్‌లు: 389
ఒక్కో యంత్రం విలువ: రూ.80 వేలు

## కలెక్టరేట్‌లో కదలని దస్త్రాలు



కదిరి : జిల్లా సాధారణ పరిపాలన సైతం స్తంభించింది. సాఫీగా కదలాల్సిన దస్త్రాలు ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు, ఒత్తిడి ఉన్న దస్త్రాలు మాత్రమే ముందుకెళ్తున్నాయి. సాధారణ దస్త్రాల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలోని 124 ప్రభుత్వ శాఖల నుంచి వివిధ అంశాల ఆమోదానికి కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చే దస్త్రాలు పేరుకుపోతున్నాయి. ఎనిమిది నెలల్లో అన్ని శాఖల సంబంధించిన దస్త్రాలు, అర్జీలు సుమారు 10 వేలకుపైగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. కీలక అధికారుల నిర్లక్ష్య ధోరణితో ప్రధాన శాఖల్లో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతి కుంటుపడుతోంది.

**నెలలు తరబడి నిరీక్షణ**

ఆర్థిక సంబంధమైన దస్త్రాలు మినహా.. మిగతావి సకాలంలో పరిష్కరించాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు తెగేసి చెప్పారు. పంచాయతీరాజ్, జిల్లా పరిషత్తు, వైద్య–ఆరోగ్యం, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా, డీఆర్‌డీఏ, జలవనరులు, పౌర సరఫరాలు, సంక్షేమం, కార్పొరేషన్లు, సహకార.. తదితర శాఖలకు చెందిన దస్త్రాలు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. రైతుల పొలాలు సబ్ డివిజన్, తండ్రుల నుంచి కుమారులకు బదలాయించిన పేర్లు మార్పునకు పంపిన మ్యుటేషన్ దస్త్రాలు వందల్లో మూలనపడేశారు. నెలల తరబడి నిరీక్షిస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు.

**ఫలించని సమీక్షలు**

ఏ దస్త్రం ఎంత కాలం పెండింగ్‌లో ఉందన్న విషయం స్పష్టంగా తెలుస్తుంది. మాన్యువల్ ఫైళ్లలోనూ తేదీలు ఉంటాయి. అడపాదడపా సమీక్షలు జరిపి చేతులు దులుపుకొంటున్నారు. తర్వాత పరిష్కారంపై కనీస వాకాబు చేయడం లేదు. స్వయంగా కలెక్టరేట్లోనే ఈ దుస్థితి ఉంటే.. ఇతర శాఖల పరిస్థితి చెప్పనవసరమే లేదు.

మూడు మాసాలు.. ఆరు నెలలు.. ఏడాది... ఇలా ఎంత కాలం కాలక్షేపం చేస్తారు. దస్త్రాల పరిష్కారంపై ఎందుకు దృష్టి సారించడం లేదు. సాధారణ పాలన కుంటుపడుతుంది. మీ వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉంది. ఇక ఎవరిని సహించేది లేదు. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం దస్త్రాలు ఎప్పటికపుడు పరిష్కారం కావాల్సిందే. ఇందులో రెండో మాటే లేదు.

మంత్రులు, కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో సీఎం చంద్రబాబు అనంత గ్రామీణం పరిధి కందుకూరు సమీపాన జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్ల కోసం అనేక మంది నిర్దేశిత డబ్బు చెల్లించారు. అక్కడి పరిస్థితులు సరిగా లేకపోవడం.. ప్లాట్లు నచ్చకపోవడంతో చెల్లించిన డబ్బు వెనక్కి ఇవ్వాలని అహుడా కార్యాలయానికి దరఖాస్తు పెట్టుకున్నారు. ఏడాదిగా కార్యాలయం చుట్టూ తిరిగినా డబ్బులు వెనక్కి ఇవ్వడం లేదు. ఇన్‌ఛార్జి వైస్ ఛైర్మన్‌గా ఉన్న జేసీ నుంచి ఆమోదం కావాలంటూ తిప్పుకొంటున్నారు.

మ్యుటేషన్ కోసం రైతులు, కుల ధ్రువీకరణలో అక్షర దోషాలు, ఇతరాత్ర లోపాలు సరిచేసుకోడానికి విద్యార్థులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఈ తరహా దస్త్రాలన్నీ కలెక్టరేట్లోనే ఆమోదం లభించాలి.

**ప్రత్యేక దృష్టి సారిస్తాం- డాక్టర్ వినోద్‌కుమార్, కలెక్టర్**

దస్త్రాల పరిష్కారంపై దృష్టి సారిస్తాం. ఏ శాఖ కార్యాలయంలో ఎన్ని పెండింగ్ ఉన్నాయో ఆరా తీస్తాం. అధికారులతో ప్రత్యేక సమీక్షలు జరిపి ఫైళ్లను త్వరగా పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడతాం.

## తెల్లబంగారం.. ఏమి ప్రయోజనం



పెద్దవడుగూరు : మండలంలో అత్యధికంగా పండించే పత్తి పంటకు కనీస మద్దతు కరవైంది. ఈవిషయంలో రైతులు ఏటా వంచనకు గురవుతున్నారు. ఇక్కడి రైతులకు ప్రధాన పంట పత్తికాగా అందులో వచ్చిన దిగుబడులను అమ్ముకునేందుకు మద్దతు ధరలు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మండల వ్యాప్తంగా ఈఏడాది సుమారు 30 వేల ఎకరాల్లో పత్తి పంటను రైతులు సాగుచేయగా వాటిని అమ్ముకునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు. ఇక్కడి నుంచి ఏటా దాదాపు 3.5 లక్షల క్వింటాళ్ల దిగుబడులు వస్తుండగా గత రెండేళ్లుగా ఈపంట దిగుబడులు తగ్గాయి. కనీసం దిగుబడులు తగ్గినప్పుడైనా ధరలు వస్తాయనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత ధరలు చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పత్తి క్వింటా ధర రూ.5,800 వేలు నుంచి రూ.6,200 వేల మధ్య పలుకుతోంది. ఈధరలతో తమకు నష్టం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడులు సైతం రావని, ఇలాంటి ధరలతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలని రైతులు అంటున్నారు.

**మార్కెట్ ఉన్నా వృథానే**

పండించిన పత్తి పంటను అమ్ముకునేందుకు గుత్తి ప్రాంతంలో మార్కెట్ సదుపాయం ప్రభుత్వం కల్పించినప్పటికీ వాటివల్ల ఎలాంటి ఉపయోగం లేదని ఇక్కడి రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.7,250 కల్పించింది. అందులో కూడా నాణ్యమైన పత్తికి ఆ ధరలను వెచ్చిస్తున్నారు. దీంతో తమకు గిట్టుబాటు ధరలు కావని ఇక్కడి రైతులు వాపోతున్నారు. ఈఏడాది ఎకరాకు ఆరు క్వింటాల దిగుమడి వచ్చింది. ఈలెక్కన 1.80 లక్షల క్వింటాల దిగుబడి వచ్చింది.

**అంతులేని వేదన**

పత్తిపంటలను ఎక్కువగా కొట్టాలపల్లి, పెద్దవడుగూరు, చిన్నవడుగూరు, దిమ్మగుడి, మేడిమాకులపల్లి, లక్షుంపల్లి, మిడుతూరు, కాశేపల్లి, విరుపాపురం, ఆవులాంపల్లి, చిట్మూరు, కండ్లగూడూరు, తెలికి, ముప్పాలగుత్తి, బుర్నాకుంట, మల్లేనిపల్లి తదితర గ్రామాల్లో సాగుచేశారు. ప్రస్తుతం ఉన్న ధరలను చూసి పంట దిగుబడులను అమ్ముకునేందుకు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇక్కడి పలుగ్రామాలకు చెందిన రైతులు మూడేళ్లుగా పండించిన పత్తిపంట నిల్వలను ధరలు వచ్చేవరకు అలానే ఇళ్లలో నిల్వ చేసుకున్నారు.

## అక్రమంగా అమ్మేసి.. రూ.లక్షలు కాజేసి

గూడూరు : వైకాపా హయాంలో 2022 నవంబరు నుంచి 2023 ఫిబ్రవరి వరకు వాకాడు మండలం దుగరాజపట్నం, కొండూరుపాలెం, తూపిలిపాలెం తదితర ప్రాంతాల్లో ఇద్దరు ఉద్యోగులు డిస్కంలో నియంత్రికలు, ఇతర సామగ్రిని అక్రమంగా అమ్మేసి రూ.80 లక్షల మేర దిగమింగారు. వీటిపై అప్పట్లో డిస్కం, విజిలెన్సు విచారణ అధికారులు నిగ్గు తేల్చినా ఎలాంటి చర్యలు లేవు. తాజాగా మరో అక్రమాల పుట్ట తెరపైకి వచ్చింది. మొనపాలెం, ఓడపాలెం, వైట్‌కుప్పం, రావిగుంటపాలెం పంచాయతీల పరిధిలోని పంబలి తీర గ్రామాల్లో రైతుల వద్ద రూ.15 లక్షల వరకు డిస్కంలోని కొందరు ఉద్యోగులు దోచుకున్నారు. డీడీలు చెల్లించిన వారికి ఏర్పాటు చేయాల్సిన నియంత్రికలను ఇతరులకు విక్రయించి విద్యుత్ వాడినట్లు బిల్లులు పంపడంతో అక్రమాల పుట్ట వెలుగులోకి వచ్చింది.

దీనిపై డిస్కం గూడూరు ఈఈ నరేంద్రరెడ్డిని వివరణ కోరగా.. వీటన్నింటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.



సర్వీసు దరఖాస్తుకు రూ.5 వేలు

తీర గ్రామాల్లో రైతులకు విద్యుత్ సర్వీసు కావాలంటే కోట సబ్ డివిజన్ కార్యాలయం వద్ద ఓ ఉద్యోగి దరఖాస్తుకు రూ.5 వేలు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. కోట సబ్ డివిజన్ పరిధిలో 2022 నుంచి జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాల్సిన డిస్కం విజిలెన్సు విభాగంలోని కొందరు ఉద్యోగులు అక్రమార్కులతో చేతులు కలిపి దోచుకుంటున్నట్లు తెలుస్తోంది.

**తీరంలో నియంత్రికల ఏర్పాటులో అవినీతి**

వాకాడు మండలం మొనపాలెంకు చెందిన మామిడి మంగమ్మ, వీరం బుజ్జమ్మలు వ్యవసాయ విద్యుత్తు నియంత్రణ కావాలని ఎనిమిది నెలల కిందట డీడీ చెల్లించారు. నేటికీ ఏర్పాటు చేయకపోగా వారం కిందట బిల్లులు రావడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఇదే ప్రాంతంలో ఆదిపరెడ్డి ముత్యాలమ్మ, విజయ కల్పన పేర్లపై నియంత్రికలకు డీడీలు కట్టినా నేటికీ అమర్చలేదు. వీరి కేటాయించాల్సిన వాటిని ఇతరులకు విక్రయించినట్లు స్థానికులు చెబుతున్నారు. తాజాగా వాకాడు మండలం వైట్‌కుప్పానికి చెందిన ఓ రైతు వద్ద డిస్కంలోని ఓ ఉద్యోగి రూ.లక్ష తీసుకొని నియంత్రిక ఏర్పాటు చేశారు. డబ్బులు తీసుకొని నియంత్రిక ఏర్పాటు చేయడంపై విమర్శలు రావడంతో సమీప రైతులను రూ.80 వేలకు డీడీ తీయాలంటూ సదరు ఉద్యోగి ఒత్తిడి చేస్తున్నాడు.

మొనపాలెంలో మరో రైతు నియంత్రికకు డీడీ చెల్లించగా.. ఆయనకే కేటాయించాల్సిన నియంత్రికను ఇతరులకు ఇచ్చారు. దీనిపై చర్చ సాగడంతో హడావుడిగా నియంత్రిక అమర్చారు.

## వరి సాగు భళా

చిత్తూరు : జిల్లాలో రబీ సీజన్ ఆశాజనకంగా సాగుతోంది. కర్షకులు వరి సాగుకు ఎంతో ఆసక్తి చూపుతూ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ ప్రోత్సాహం అందుబాటులో సాగు సేవల విస్తరణతో రబీ సీజన్ లక్ష్యాల దిశగా ముందుకు సాగుతోంది. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో జిల్లా తూర్పు ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. వాగులు, వంకలు ప్రవహించడంతో పాటు చెరువుల్లోకి నీరు భారీగా చేరడంతో భూగర్భజలాలు వృద్ధి చెందడంతో వరి సాగుపై అన్నదాతలు దృష్టిసారించారు. వరి సాధారణ సాగు విస్తీర్ణం 26 వేల ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 14 వేల (51 శాతం) ఎకరాల్లో విస్తరించింది. ఈ నెలాఖరు వరకు నాట్లు కొనసాగి సాధారణ సాగును మించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

**పరికరాల పంపిణీకి వినతి**

గత ఐదేళ్ల వైకాపా పాలనలో యాంత్రీకరణ పరికరాల పంపిణీ ఊసే లేదు. యంత్ర సేవా పథకం కింద రైతు సంఘాలకు అందజేసిన పరికరాలు వైకాపా నాయకుల పరమయ్యాయి. కూటమి ప్రభుత్వం సాగును ప్రోత్సహిస్తోంది. రాయితీపై టార్పాలిన్ పట్టలు, ఇతర పరికరాల పంపిణీకి జిల్లా వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదించింది. త్వరలో వీటిని అందజేయనున్నారు.

**పొలంబాట దిశగా చర్యలు..- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి**

రైతులు పొలంబాట పట్టే దిశగా చర్యలు చేపట్టాం. రబీ సీజన్‌లో అన్ని పంటల సాగు లక్ష్యాన్ని అధిగమిస్తాం. అవసరాలకు అనుగుణంగా ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాం. నిధులు రాగానే యంత్ర పరికరాలు అందజేస్తాం.

## నిధుల వరద

చిత్తూరు : గ్రామ పంచాయతీలకు కేంద్రం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులకు వైకాపా హయాంలో పలు విధాలుగా కోత పెట్టారు. ఆర్థిక సంఘం నిధులతో పాటు, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి పంచాయతీలకు స్టాంపు డ్యూటీ సర్‌ఛార్జీలు రెండేళ్ల పాటు ఒక్క పైసా జమ చేయలేదు.. ఫలితంగా పంచాయతీల్లో పాలన పడకేసింది.. చిన్నచిన్న సమస్యలు పరిష్కరించలేని దయనీయ స్థితి. కూటమి ప్రభుత్వం రాకతో గతంలో నిలిచిన నిధులు నేడు నేరుగా పంచాయతీల ఖాతాలకు జమవుతుండటం గమనార్హం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లో పంచాయతీలకు అన్ని రకాల నిధులు అందుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు, వృత్తిపన్ను, తలసరి ఆదాయం, సర్పంచుల గౌరవ వేతనం, సీనరేజ్ ఛార్జీలు వెంటవెంటనే జమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం లేకుండా నేరుగా పంచాయతీల ఖాతాలకే నిధులు జమ కావడంపై రాజకీయాలకు అతీతంగా సర్పంచులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాకు రూ.89.32 కోట్లు..**కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులన్నీ పంచాయతీల ఖాతాలకే జమ చేస్తోంది. ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలకు రూ.89.32 కోట్లు విడుదలయ్యాయి. వీటితో గ్రామాల్లో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. అత్యవసర పనులు చేసేందుకు సర్పంచులకు కాసింత ఊరట లభించింది. **పూర్తిస్థాయిలో నిధులు - సుధాకర్‌రావు, డీపీవో**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు పూర్తి స్థాయిలో నిధులు విడుదలవుతున్నాయి. పంచాయతీల్లో అత్యవసర సేవలతో పాటు, అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి.

## తెల్లని చీరలో అనసూయ అందం.. స్టన్నింగ్ లుక్స్!

టెలివిజన్ స్క్రీన్‌పై గ్లామర్ తో టాలెంట్‌తో స్పెషల్ క్రేజ్ అందుకున్న అనసూయ భరద్వాజ్ తాజాగా సోషల్ మీడియాను తన అందంతో షేక్ చేస్తోంది. యాంకర్‌గా కెరీర్‌ను ప్రారంభించి, సిల్వర్ స్క్రీన్‌పై కూడా తనదైన ముద్ర వేసిన ఈ స్టార్ బ్యూటీ, ప్రతి అప్‌డేట్‌తో అభిమానులను అలరిస్తోంది. తాజాగా ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసిన ఫోటోషూట్ మరింత వైరల్‌గా మారింది. తెల్లని చీరలో ఆమె చూపిన హావభావాలు అద్భుతంగా ఉన్నాయని చెప్పాలి. ఈ ఫోటోల్లో అనసూయ సంప్రదాయ హెూదాను మోడ్రన్ టచ్‌తో ప్రదర్శించింది. తెల్లని చీరకు మ్యాచింగ్ బ్లాక్ బ్లౌజ్ ధరించి, డిజైనర్ నగలతో తన లుక్‌ను ప్రత్యేకంగా మలుచుకుంది. కురులను వదులుగా ఒదిలిపెట్టి, స్టైలిష్ ఇయర్ రింగ్స్‌తో తన గ్లామర్‌ను ఇంకాస్త



పెంచేసింది. హెూలి ఫెస్టివల్ కాన్సెప్ట్‌తో షేర్ చేసిన ఈ ఫోటోలకు నెటిజన్లు విపరీతమైన రెస్పాన్స్ ఇస్తున్నారు. సాధారణంగా అనసూయ ఇలాంటి డిఫరెంట్ స్టైల్ షూట్స్‌కు ప్రత్యేకంగా ప్రాధాన్యత ఇస్తుంది. ప్రత్యేకించి ఆమె మోడర్న్ వేర్‌తో పాటు ట్రెడిషనల్ లుక్‌లో కూడా అద్భుతంగా మెరిసిపోతుంది. ఈ సారి స్పెషల్ డిజైన్‌తో ఉన్న చీరను ఎంచుకోవడం విశేషం. ఫ్యాషన్ ప్రపంచానికి సంబంధించిన తన ఆసక్తిని ఈ ఫోటోల్లో స్పష్టంగా చూపించింది. ఈ ఫోటోషూట్ అనసూయ స్టైల్ క్వీన్‌గా మారిపోయిందనే టాక్ తెచ్చిపెట్టింది. ఇన్‌స్టాలో పోస్ట్ చేసిన ఈ ఫోటోలపై సెలబ్రిటీలతో పాటు ఫ్యాన్స్ నుంచి మంచి స్పందన వస్తోంది. సో బ్యూటీఫుల్ అంటూ కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అనసూయ ప్రత్యేకత. కేవలం యాంకర్‌గా మాత్రమే కాదు, నటిగా కూడా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. ప్రస్తుతం అనసూయ సినిమా ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టింది. ఇటీవల ఆమె నటించిన 'పుష్ప 2'లో పాత్రకు మంచి రెస్పాన్స్ దక్కింది. అలాగే కొన్ని క్రేజీ వెబ్ సిరీస్‌లలోనూ నటిస్తున్నట్లు సమాచారం.

## 28 కోట్లకు సీనియర్ బ్యూటీ ప్రీమియం ప్రాపర్టీ!

సెలబ్రిటీల ఆదాయాల గురించి చెప్పాల్సిన పనిలేదు. ఫాంలో ఉన్నంత కాలం రెండు చేతులా సంపాదన. వచ్చిన ఆదాయంతో వివిధ వ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతుంటారు. తద్వారా భారీ మొత్తంలో లాభాలు ఆర్జిస్తుంటారు. ఇప్పటికే చాలా మంది తారలు రియల్ ఎస్టేట్ రంగంలో మంచి లాభాలు చూస్తున్నారు. తాజాగా బాలీవుడ్ నటి కాజోల్ తాజాగా ముంబైలోని గోరేగావ్‌లో ప్రీమియం రిటైల్ ప్రాపర్టీని కొనుగోలు చేసింది. రూ. 28.78 కోట్లు విలువగల ప్రాపర్టీని కొనుగోలు చేసింది. భారత్ రియాల్టీ వెంచర్స్ కి చెందిన 4,365 చదరపు అడుగుల విస్తీర్ణం గల స్థలాన్ని కొనుగోలు చేసింది. ఈ స్పేస్ లో మొత్తం ఐదు కార్ల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలం కూడా ఉంది. 2023 లో కాజోల్ ముంబైలో 7.64 కోట్లతో ఓ ఆఫీసు స్థలాన్ని కూడా కొనుగోలు చేసింది. 194.67 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రెరా కార్పెట్ ఏరియాలో విస్తరించింది ఈ ఆఫీస్ స్పేస్. అలాగే అంధేరీ వెస్ట్‌లోని వీర దేశాయ్ రోడ్డు ని అనుకుని ఓ సిగ్నేచర్



బిల్డింగ్ కూడా కొనుగోలు చేసింది. అదే ఏడాది భారత్ రియల్టీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి 16.50 కోట్లతో మరో అపార్ట్‌మెంట్ కూడా కొనుగోలు చేసింది. ఇలా కొంత కాలంగా కాజోల్ సంపాదనంతా రియల్ రంగంలోనే పెట్టుబడులుగా పెడుతుంది. కొనుగోలు చేసిన నెలల వ్యవధిలోనే వాటి ధర రెట్టింపు అవుతుంది. బాలీవుడ్ తారలు కొంత కాలంగా కమర్షియల్ ప్రాపర్టీలలో పెట్టుబడి పెట్టడానికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్‌తో పోల్చితే వార్షిక అద్దె రాబడి ఎక్కువగా ఉన్నందున బాలీవుడ్ తారలు కమర్శియల్ ప్రాపర్టీస్ క్రయ, విక్రయాలు జరపడానికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది బాలీవుడ్ తారలకు బాంద్రా, ఖార్, అంధేరిలోని లోఖండ్‌వాలా , వర్లీ వంటి ప్రాంతాల్లో ఉన్న అనేక భవనాలు, విల్లాలు ఉన్న సంగతి తెలిసిందే.




## శోభితను కూడా రేసులోకి దింపిన చైతూ



నాగచైతన్యకు రేసింగ్ అంటే ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అతడు బైకులు, కార్లు, స్పోర్ట్స్ వెహికల్స్ లవర్ అని అందరికీ తెలిసిందే. గతంలో ఎన్నోసార్లు అతడు రేస్ ట్రాక్స్‌పై కనిపించాడు. ఇప్పుడు ఇదే ఆసక్తిని తన భార్య, గ్లామరస్ బ్యూటీ శోభిత ధూళిపాళతో కూడా షేర్ చేసుకోవడం విశేషం. తాజాగా చెన్నైలోని మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో రేసింగ్ ఎంజాయ్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. శోభిత తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ప్రత్యేకమైన మూమెంట్స్‌ను షేర్ చేయగా, అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. బ్లాక్ టాప్, ఖాకీ ట్రౌజర్స్‌లో స్టైలిష్ లుక్‌లో ఉన్న శోభిత, కూల్ అండ్ క్యాజువల్ అవతార్‌లో ఉన్న చైతు ఫొటోలు నెట్టింట వైరల్ అయ్యాయి.

ఇక శోభిత నేరుగా రేసింగ్ కార్ డ్రైవ్ చేస్తున్న స్టిల్స్ మోస్ట్ ఇంట్రెస్టింగ్‌గా మారాయి. హెల్మెట్ ధరించి రేస్ ట్రాక్‌పై స్ట్రాంగ్ ఫోకస్ పెట్టిన ఆమె లుక్ అభిమానులను ఆకట్టుకుంది. ఈ ఫోటోలు వీరి మధ్య ఉన్న కెమిస్ట్రీని మరింత హైలైట్ చేస్తున్నాయి. నాగచైతన్య, శోభితల మధ్య బంధం ఎంత బాగుంటుందో మరోసారి క్లారిటీగా అర్థమవుతుంది. ఫోటోల విషయానికొస్తే, శోభిత తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌కు రేస్ ఫ్లాగ్ ఎమోజీని మాత్రమే క్యాప్షన్‌గా పెట్టడం గమనార్హం. అయితే, చైతు కెరీర్ పరంగా ప్రస్తుతం పలు ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నా, తన వ్యక్తిగత జీవితాన్ని కూడా అదే ట్రాక్ లో హ్యాపీగా వెళ్లేలా చేస్తున్నారు. అలాగే శోభిత కూడా బాలీవుడ్‌లో మంచి అవకాశాలతో ముందుకెళ్తోంది. రీసెంట్ గా నాగచైతన్య తండేల్ సినిమాతో బిగ్గెస్ట్ బాక్సాఫీస్ హిట్ అందుకున్న విషయం తెలిసిందే.

చందు మొండేటి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో సాయి పల్లవి హీరోయిన్ గా నటించగా సినిమా బాక్సాఫీస్ వద్ద 100కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టింది. ఇక మరోవైపు కార్తిక్ దండు దర్శకత్వంలో మరో థ్రిల్లర్ సినిమాను స్టార్ట్ చేసిన చైతూ మరో రెండు కథలపై కూడా చర్చలు జరుపుతున్నారు.

## వార్ 2 - కూలీ.. బిజినెస్ కోసం గొడవలు లేకుండా న్యూ ప్లాన్!



ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న రెండు భారీ ప్రాజెక్టులు వార్ 2 - కూలీ. బాలీవుడ్‌లో హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ కాంబోలో వస్తున్న వార్ 2, లోకేష్ కనగరాజ్ – రజినీకాంత్ కాంబినేషన్‌లో రూపొందుతున్న కూలీ రెండూ 2025లో అత్యంత భారీ బడ్జెట్ చిత్రాలుగా హైలెట్ అవుతున్నాయి. స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందుతున్న వార్ 2 ఇప్పటికే బాలీవుడ్ మార్కెట్‌ను హీట్ పెంచగా, రజినీకాంత్ అభిమానులు మాత్రం కూలీ ఎలా ఉండబోతుందనే ఉత్కంఠలో ఉన్నారు. ఈ రెండు సినిమాల బడ్జెట్, మార్కెట్ స్కేల్ దృష్ట్యా, నిర్మాతలు భారీ వ్యూహాలను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం బిజినెస్ పరంగా చూస్తే, ఈ రెండు సినిమాలూ ప్రపంచవ్యాప్తంగా భారీ రేంజ్‌లో రిలీజ్ చేయాలనే లక్ష్యంతో ఉన్నాయి. వార్ 2 బాలీవుడ్ స్పై యూనివర్స్‌లో అత్యంత క్రేజీ ప్రాజెక్ట్, అలాగే కూలీ రజినీకాంత్ కెరీర్‌లో మళ్లీ పాన్ ఇండియా మార్కెట్‌ను టార్గెట్ చేసే సినిమా. ఊహించని స్థాయిలో ప్రమోషన్లు, భారీ ప్రీ రిలీజ్ బిజినెస్, మెరుగైన థియేట్రికల్ కవర్ కోసం ఇప్పటికే ప్లానింగ్ మొదలైంది. ప్రత్యేకంగా, ఈ రెండు చిత్రాలు ఒకే వీకెండ్‌లో వస్తే, అవి ఒకదానిపై మరొకటి ప్రభావం చూపే అవకాశం ఉండటంతో నిర్మాతలు ముందుగానే జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అసలు ఇబ్బంది ఏంటంటే, మొదట కూలీ ఆగస్టు 14వ తేదీన రావాలని అనుకున్న సినిమా. అదే సమయంలో వార్ 2 కూడా అదే తేదీకి లాక్ చేసినట్లు సమాచారం. ఈ క్లాష్ వల్ల థియేట్రికల్ షేర్ దెబ్బతినే ప్రమాదం ఉండటంతో, చిత్ర వర్గాలు ముందుగానే చర్చలు ప్రారంభించాయి. తాజా సమాచారం ప్రకారం, కూలీ టీమ్ తమ రిలీజ్ డేట్‌ను వెనక్కి జరిపే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పెద్ద సినిమాలు ఒకే వారం విడుదలైతే, థియేటర్ల షేరింగ్ సమస్యలు తప్పవు. అలాగే ఓపెనింగ్స్ పై కూడా దెబ్బ పడే అవకాశం ఉంది. అందుకే, రెండు సినిమాలు భిన్నమైన వీకెండ్స్‌లో విడుదలయ్యేలా ప్లానింగ్ జరుగుతోంది. ఇప్పటికే, కూలీ హక్కుల కోసం భారీ డిమాండ్ ఉంది. అయితే, రీలీజ్ డేట్ క్లారిటీ రాకపోవడంతో బిజినెస్ ఇంకా పూర్తి స్థాయిలో ఫైనల్ కాలేదు. ప్రస్తుతం డిస్ట్రిబ్యూషన్ నెగోషియేషన్స్ జరుగుతున్నాయి. భారీ బడ్జెట్ సినిమాలను ప్రాఫిటబుల్‌గా మార్చడానికి, స్ట్రాటజిక్‌గా విడుదల చేయడం తప్పనిసరి. ఇండస్ట్రీ వర్గాల కథనం ప్రకారం, కూలీ ఆగస్టు చివరి వారానికి లేదా సెప్టెంబర్ ఫస్ట్ వీక్‌కు షిఫ్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా పాన్ ఇండియా సినిమాలకు ఎంతటి డిమాండ్ ఉందో ఈ రెండు సినిమాల బిజినెస్ చూస్తే అర్థమవుతోంది. రెండూ కూడా వెయ్యి కోట్ల రేంజ్ లో.కలెక్షన్స్ అందుకునేలా బజ్ క్రియేట్ చేయనున్నాయి. ఈ రెండు సినిమాలూ డిఫరెంట్ మార్కెట్లో పెద్ద హిట్ అవుతాయనే నమ్మకంతో, నిర్మాతలు స్ట్రాటజిక్ రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి, హై బజ్ కలిగిన ఈ రెండు సినిమాలు ఒకదానిపై మరొకటి ప్రభావం చూపకుండా విడుదల అవ్వడం సినీ పరిశ్రమకు మంచిది. డిస్ట్రిబ్యూషన్, మార్కెటింగ్, ప్రమోషన్ దృష్ట్యా ఈ వ్యూహం ఎంత వరకు సక్సెస్ అవుతుందో చూడాలి.

## స్టైల్ ఐకాన్‌గా ప్రణీత

2010లో దర్శన్ హీరోగా నటించిన 'పోర్కి' అనే కన్న సినిమాలో ప్రణీత సుభాష్ హీరోయిన్‌గా నటించి ఇండస్ట్రీకి పరిచయం అయింది. ఆ సినిమాతో కన్నడంలో మంచి గుర్తింపు దక్కించుకుంది. ఆ వెంటనే తెలుగులో ఏమ్ పిల్లో ఏమ్ పిల్లాడో సినిమాలో నటించింది. ఆ సినిమా కమర్షియల్‌గా నిరాశ పరచినా ప్రణీతకు అవకాశాలు ఇవ్వచ్చు అన్నట్లుగా టాక్ సొంతం చేసుకుంది. అందుకే సిద్ధార్థ్‌కి జోడీగా బావా సినిమాలో నటించే అవకాశం సొంతం అయింది. ఆ సినిమాపై చాలా ఆశలు పెట్టుకున్న ప్రణీతకు బావా తీవ్రంగా నిరాశ మిగిల్చింది. అయినా కూడా ఇండస్ట్రీలో ప్రణీతకి ఆఫర్లు రావడం కొనసాగింది. కన్నడ సినిమాలతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ప్రణీత



సుభాష్ ఆ తర్వాత తెలుగు, తమిళం, హిందీ, మలయాళం భాషల్లోనూ సినిమాలు చేసింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపుగా 15 ఏళ్లు అవుతుంది. అయినా ఇప్పటి వరకు సినిమాల్లో కొనసాగుతూనే వచ్చింది. పెళ్లి చేసుకుని ఇద్దరు పిల్లలకు తల్లి అయిన తర్వాత కూడా ప్రణీత స్టైల్ ఐకాన్‌గా నిలుస్తున్న కారణంగా ఇండస్ట్రీలో వరుస ఆఫర్లు దక్కించుకుంటూనే ఉంది. సాధారణంగా సౌత్ హీరోయిన్స్ కొందరు పెళ్లి తర్వాత ఇండస్ట్రీ నుంచి దూరం కావాలని అనుకుంటారు. కానీ ప్రణీత మాత్రం గత ఏడాది కూడా ఈమె నటించింది. గత సంవత్సరం ఈమె నటించిన రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. గర్భంతో ఉన్న సమయంలోనూ ప్రణీత కెమెరా ముందుకు వచ్చిందని కన్నడ సినీ వర్గాల వారు అంటూ ఉంటారు. ఆ విషయం పక్కన పెడితే కన్నడ సినిమా ఇండస్ట్రీలో నటిగానే కాకుండా ప్రణీతకు ఒక మనిషిగా మంచి పేరు ఉంది. కరోనా సమయంలో ఎంతో మంది ఆకలి తీర్చిందని ఆమెను ఇప్పటికీ చాలా మంది అభినందిస్తూ ఉంటారు. అలాంటి మంచి మనసున్న ప్రణీత తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఈ ఫోటోలు ఆమె అందంను చూపించకనే చూపిస్తున్నాయి. బ్లాక్ షర్ట్ ధరించి, స్టైలిష్ లుక్‌లో యాక్సిసరీస్‌ను ధరించిన ప్రణీత చూపు తిప్పనివ్వడం లేదు. సోషల్ మీడియాలో ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

## బ్లాక్ అండ్ వైట్‌లో పొన్నాడ సూపర్

నాగార్జున, కార్తీ హీరోలుగా నటించిన 'ఊపిరి' సినిమాలో చిన్న పాత్రలో కనిపించిన పూజిత పొన్నాడ మెల్ల మెల్లగా ఇండస్ట్రీలో నిలదొక్కుకుంటూ వస్తుంది. రామ్ చరణ్ హీరోగా నటించిన 'రంగస్థలం' సినిమాలో పూజిత పొన్నాడ ముఖ్య పాత్రలో నటించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. అప్పటి నుంచి చిన్న సినిమాల్లో మెయిన్ హీరోయిన్‌గా పెద్ద హీరోల సినిమాల్లో కీలక పాత్రల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. కేవలం తెలుగు సినిమాల్లో మాత్రమే కాకుండా తమిళ్‌లోనూ ఈమె నటించింది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ మూవీ హరి హర వీరమల్లు సినిమాలో పూజిత కీలక పాత్రలో నటిస్తున్న తెలుస్తోంది. యంగ్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా సినిమాలు చేస్తున్న పూజిత పొన్నాడ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. సినిమాలతోనే కాకుండా రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలతో అలరిస్తున్న పూజిత పొన్నాడ మరోసారి తన అందమైన



ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్స్‌తో పంచుకుంది. ఎప్పటిలాగే ఈసారి కూడా తన అందమైన లుక్‌తో పాటు స్టైలిష్ అవతార్‌లో పూజిత పొన్నాడ కనిపించింది. అలరించే అందంతో పాటు బ్లాక్ అండ్ వైట్‌లో చూపు తిప్పనివ్వకుండా అందంగా కనిపిస్తుంది. బ్లాక్ అండ్ వైట్ లో క్లోజప్ పిక్స్‌ను షేర్ చేసింది. ఇంత అందంగా ఉన్న పూజిత పొన్నాడకి దక్కాల్సిన స్థాయిలో ఆఫర్లు దక్కడం లేదని అభిమానులు కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈమెకు ఉన్న ఫాలోయింగ్‌కి తగ్గట్లుగా సినిమా ఆఫర్లు దక్కడం లేదనే అభిప్రాయంను పలువురు వ్యక్తం చేస్తున్నారు. ముందు ముందు అయినా పూజిత పొన్నాడకి స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు రావాలని నెటిజన్స్ కోరుకుంటున్నారు. ఈ ఏడాదిలో పూజిత నుంచి రెండు మూడు సినిమాలు అయినా వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. పవన్ కళ్యాణ్ తో ప్రస్తుతం నటిస్తున్న హరిహర వీరమల్లు సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంటే తప్పకుండా మరిన్ని సినిమాలు ఈ అమ్మడికి దక్కే అవకాశాలు ఉన్నాయి. భగవన్ అనే తమిళ్ సినిమాలోనూ ఈమె నటిస్తుంది. త్వరలోనే ఈమె మరో తెలుగు సినిమాలోనూ నటించబోతున్నట్లు సమాచారం అందుతోంది. మరో వైపు వెబ్ సిరీస్‌ల్లోనూ ఈమెకు నటించే అవకాశాలు వస్తున్నాయట. త్వరలోనే ఈమె వెబ్ సిరీస్‌లోనూ నటించే అవకాశాలు ఉన్నాయని సమాచారం అందుతోంది. ఇలాంటి ఫోటోలను షేర్ చేయడం ద్వారా ఇండస్ట్రీ నుంచి మరిన్ని ఆఫర్లు దక్కే అవకాశాలు ఉన్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536